thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 239 కరీంనగర్ గురువారం, 6 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఆమ్కా జెట్‌ల రేసులో..హైదరాబాదీ సంస్థతో అదానీ జట్టు

హైదరాబాద్ : దేశీయంగా అభివృద్ధి చేయనున్న ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానం 'ఆమ్కా (అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్)' ప్రొటోటైప్ తయారీ రేసులో హైదరాబాదీ సంస్థ కూడా భాగస్వామ్యం అవుతోంది. ఆమ్కా ప్రొటోటైప్ కాంట్రాక్టును దక్కించుకునేందుకు అదానీ గ్రూపులోని అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సంస్థ తాజాగా హైదరాబాద్‌కు చెందిన 'ఎంటార్ టెక్నాలజీస్' సంస్థతో జట్టుకట్టినట్టు తెలిసింది. విశ్వసనీయవర్గాలను ఉటంకిస్తూ బిజినెస్ స్టాండర్డ్ దీనిపై కథనాన్ని ప్రచురిం చింది. ప్రెసిషన్ ఇంజనీరింగ్ (కీలకమైన పరికరాలు, విడిభాగాలను ఎలాంటి లోపాలు లేకుండా అత్యంత కచ్చితత్వంతో తయారు చేయడం)లో ఎంటార్ టెక్నాలజీస్ సంస్థకు మంచి గుర్తింపు ఉంది. న్యూక్లియర్ పవర్ కార్పొ రేషన్, ఇస్రో, డీఆర్‌డీవో తదితర సంస్థలకు ఎన్నో సంస్థలు ఎంటార్ టెక్నాలజీస్ కస్టమర్లుగా ఉన్నాయి. చంద్రయాన్-2, మంగళ్‌యాన్ మిషన్లకు అవసరమైన ఎలక్ట్రో న్యూమాటిక్ వ్యవస్థలను ఈ సంస్థే సరఫరా చేసింది.




హైదరాబాద్: జోడో యాత్ర ద్వారా దేశంలోని మైనార్టీలకు రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు బుధవారం సీఎంను కలిశారు. తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై సీఎం సానుకూలంగా స్పందించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు తమ మద్దతు ఉంటుందని పాస్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. "భారత రాష్ట్ర సమితిని కేసీఆర్ భాజపాకు తాకట్టుపెట్టారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోంది. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించి 3 నెలలైనా స్పందించలేదు.

ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ ఇంకా అనుమతి ఇవ్వలేదు. భాజపా, గులాబీ పార్టీల మధ్య ఒప్పందం లేకుంటే ఎందుకు అనుమతివ్వరు? భాజపాలో ఆ పార్టీ విలీనం అయ్యే పరిస్థితి ఉంది. ఈ విషయంపై గతంలోనే కవిత చెప్పారు. ఆ రెండు పార్టీల కుమ్మక్కుకు జూబ్లీహిల్స్‌ను ప్రయోగశాలగా మార్చారు" అని సీఎం విమర్శలు చేశారు.

# బెదిరిస్తున్న బంగాళాఖాతం.. నేడు, రేపు మళ్ళీ వర్ష బీభత్సం!




హైదరాబాద్/అమరావతి : వర్షాకాలం ముగిసినప్పటికీ, ప్రస్తుతం చలికాలం కొనసాగుతున్నప్పటికీ తెలుగు రాష్ట్రాలను వర్షాలు మాత్రం వదిలిపెట్టడం లేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరోమారు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుంది.

మొన్న మొంథా తుఫాను చేసిన తీరని నష్టం నుండి ఇంకా కోలుకోక ముందే కోస్తా తీరానికి అనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.

**ఉపరితల ఆవర్తనం... మళ్ళీ ఏపీలో వర్షాలు...** దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అయితే నేడు కూడా ఉపరితల ఆవర్తన ప్రభావంతో బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి రాయలసీమలోని పలు జిల్లాల వరకు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ వెల్లడించారు.

**నేడు ఏపీలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు...** నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణ, గుంటూరు, బాపట్ల, కర్నూలు, తిరుపతి, కడప జిల్లాలలో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇక మిగతా జిల్లాలలో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.

**రేపు ఈ జిల్లాలలో వర్షాలు, అధికారుల సూచనలు...** రేపు నెల్లూరు, రాయలసీమ జిల్లాలలో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. అయితే అకస్మాత్తుగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసేటప్పుడు చెట్ల కింద నిలబడి ఉండకూడదని సూచించారు. ఇక వర్షాలు పడుతున్న సమయంలో రైతులు తమ పంట విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, వాతావరణ శాఖ హెచ్చరికలను పరిగణన లోకి తీసుకొని తదనుగుణంగా ప్రవర్తించాలని సూచించారు.

**నిన్న ఏపీలో వర్షాలు ఇలా...** ఇదిలా ఉంటే నిన్న సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్లలో 61.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, నంద్యాల జిల్లా నందికొట్కూరులో 51.8 మిల్లీమీటర్లు, బొల్లవరం లో 43.5 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. కాగా నిన్న కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, బాపట్ల, ప్రకాశం, పల్నాడు, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాలలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుశాయని ఆయన తెలిపారు.

# తారాస్థాయి 'జూబ్లీపోరు'

## నియోజకవర్గంలో ఇంటింటికీ కాంగ్రెస్

### సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు - సీటుపై బీజేపీ కన్ను

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరింది. ప్రధాన రాజకీయ పక్షాలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ.. ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, ముమ్మర ప్రచారంలో నిమగమయ్యాయి. అగ్రనేతలు రంగంలోకి దిగి మాటల తూటాలు పేల్చుతుం డటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. గడప గడపకూ తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు, నేతలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. కాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత ఆ పార్టీ తరపున, వి.నవీన్ యాదవ్ కాంగ్రెస్ అభ్యర్థిగా, లంకల దీపక్ రెడ్డి బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. ఉప ఎన్నిక నవంబర్ 11న జరగనుంది.

మూడు పార్టీల మధ్య నువ్వా..నేనా..?

ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ను ఓడించడం ద్వారానే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, ఇచ్చిన హామీలను అమలు చేసేలా చేయవచ్చని ప్రజలకు చెబుతున్నారు. మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆరోపించారు. ఈ రెండు పార్టీల కుట్ర రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నిక రౌడీలకు, మహిళలకు మధ్య జరుగుతున్న పోరాటమని.. ఇందులో మహిళనే గెలవాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాటాలతో ప్రచారాన్ని మరింత హీటెక్కించారు. బీజేపీ అగ్రనేత, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దశాబ్దాలుగా జూబ్లీహిల్స్ను నిర్లక్ష్యం చేశాయని విమర్శిస్తున్నారు. ఈ నియోజకవర్గాన్ని 'సమస్యల హిల్స్'గా మార్చారని ఆరోపించారు. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల మధ్య అవగాహన ఉందని, కాంగ్రెస్కు ఓటు వేస్తే అది ఎంఐఎంకు వేసినట్టేనని చెబుతున్నారు.




## మాటల యుద్ధం

**రంగంలోకి అగ్రనేతలు..** మూడు ప్రధాన పార్టీలు తమ అగ్రనేతలను ప్రచార బరిలోకి దింపాయి. బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు సహా 40 మంది స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఆ పార్టీ విడుదల చేయగా.. కేటీఆర్, హరీశ్ రావు వంటి నేతలు ఇప్పటికే డివిజన్ల వారీగా ప్రచార బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో 40 మంది స్టార్ క్యాంపెయినర్లను ప్రకటించగా.. మంత్రులు, సీనియర్ నేతలు డివిజన్ల వారీగా ప్రచార బాధ్యతలు చేపట్టారు. పొన్నం ప్రభాకర్, ఇతర నేతలు ఇప్పటికే డివిజన్ల వారీగా ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ.. ఓటర్లకు ప్రజాపాలన ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి.. అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ఓట్లు అడుగుతున్నారు. ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 28 నుంచి రోడ్ షోలు, బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. బీజేపీ తరపున కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రచార బాధ్యతలను ముందుండి నడిపిస్తున్నారు. ఆయనతో పాటు పలువురు రాష్ట్రస్థాయి నేతలు కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు.

**గడప గడపకూ ప్రచారం...**

అభ్యర్థులు, పార్టీల నేతలు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కాంగ్రెస్ మంత్రులు, నేతలు డివిజన్ల వారీగా గడప గడపకూ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు కూడా ఇంటింటికి వెళ్లి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, తమ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు. బీజేపీ నేతలు సైతం, ముఖ్యంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బస్తీలలో పర్యటిస్తూ, స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఉపఎన్నిక ఫలితం రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అందువల్ల మూడు పార్టీలు ఈ ఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నాయి.




# మనమూ తగ్గం!

## భారత్ అణు పరీక్షలు?.. ఇక పాక్‌కు దబిడి దిబిడే!

### అణు పరీక్షలపై అమెరికా నిర్ణయం దరిమిలా.. భూగర్భంలో అణు పేలుళ్లకు సన్నాహాలు

ప్రపంచం మళ్లీ అణు యుగం అంచున నిలబడి ఉంది. మూడు దశాబ్దాల సైలెన్స్ తర్వాత.. అణు పరీక్షల విషయంలో అమెరికా తీసుకున్న నిర్ణయం ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. అమెరికా మళ్లీ అణు పరీక్షలు చేయబోతోందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. 1992 తర్వాత మొదటిసారి అమెరికా తన భూగర్భంలో అణు పేలుళ్లకు సన్నాహాలు చేస్తోంది. ఈ నిర్ణయం కేవలం ఒక పరీక్ష కాదు.. ఇది వరల్డ్ న్యూక్లియర్ బ్యాలెన్స్‌ను కదిలించే సంకేతం. ఈ ప్రకటనతో ప్రపంచ శక్తుల మధ్య ఒక కొత్త పోటీ మొదలైంది. రష్యా ఇప్పటికే సముద్రం అడుగున అణు శక్తితో నడిచే డ్రోన్‌ను పరీక్షించింది. చైనా తన కొత్త ఆర్బిట్ బాంబుల వ్యవస్థను ప్రదర్శించింది. ఇలా అణు శబ్దం ప్రపంచాన్ని మళ్లీ చుట్టేసిందనే చెప్పాలి. ఇక ఈ పరిణామాల మధ్య ఒక ప్రశ్న మెల్లగా భారత్ వైపు తిరుగుతోంది. పోఖ్రాణ్ ఎడారిలో ఎన్నో ఏళ్ల క్రితం జరిపిన అణు పేలుళ్ల తర్వాత భారత్ స్వచ్ఛందంగా పరీక్షలను ఆపింది. కానీ ఇప్పుడు ప్రపంచం మళ్లీ అణు బీభత్సం దిశగా వెళ్తుంటే, భారత్ కూడా తన పాత శక్తిని మళ్లీ నిరూపించుకోవాలా అనే ఆలోచనలో ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

**పొరుగు దేశాల బాటలో..** నిజానికి భారత్ సరిహద్దుల్లో రెండు అణు నీడలు ఉన్నాయి. పాకిస్తాన్ కూడా అమెరికా సాయంతో బాంబులను పెంచుకుంటోంది. చైనా భారీ హైడ్రోజన్ బాంబులతో ముందుకు సాగుతోంది. ఇదే సమయంలో ట్రంప్ తీసుకున్న నిర్ణయం భారత్‌కు ఒక అవకాశమా, లేక ప్రమాదమా అనే ప్రశ్న వినిపిస్తోంది. 1998లో పోఖ్రాణ్ ఇసుకల కింద జరిగిన ఆ ఐదు అణు పేలుళ్లు ప్రపంచాన్ని ఒక్కసారిగా షాక్‌కు గురిచేశాయి. ఇక భారత్ అణు శక్తి ఉన్న దేశాల జాబితాలో చేరింది. కానీ ఆ విజయం వెంటనే ఒక వివాదం మొదలైంది. హైడ్రోజన్ బాంబు పరీక్ష పూర్తిగా సక్సెస్ కాలేదని DRDO శాస్త్రవేత్త సంతానం ప్రకటించారు. ప్రయోగించిన బాంబు దాదాపు 10 నుంచి 15 కిలోటన్నుల శక్తిని మాత్రమే విడుదల చేసిందని చెప్పారు. కానీ అప్పటి అణు విభాగం చైర్మన్ రాజగోపాల చిదంబరం మాత్రం ఈ పరీక్షలు సక్సెస్ అయ్యాయని చెప్పడం వివాదానికి కారణమైంది. ఆ తర్వాత ప్రపంచంలోని భూకంప కేంద్రాలు పంపిన సైజ్మిక్ డేటా కూడా అనేక అనుమానాలు రేపింది. అధికారికంగా భారత్ ప్రకటించిన 58 కిలోటన్నుల శక్తి కంటే చాలా తక్కువ శక్తి గుర్తించబడింది. ఈ వాదనలతో పోఖ్రాణ్ పరీక్ష ఒక మిస్టరీగా మిగిలిపోయింది. ఇప్పుడా మిస్టరీ గురించి చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది.

**ఇండియా దగ్గర 180 వార్‌హెడ్లు?...** ఇటు ట్రంప్ కొత్త అణు పరీక్ష సందేశాలతో ప్రపంచం మారుతోంది. రష్యా కొత్త అణు శక్తి యంత్రాలను పరీక్షిస్తుండగా.. చైనా అంతరిక్షం నుంచి దాడి చేయగల FOBS వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. పాకిస్తాన్ తన చిన్న టాక్టికల్ బాంబులను పెంచుకుంటోంది. దీంతో ఇండియా కూడా ఈవైపుగా అడుగులు వెయ్యాలన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇండియా దగ్గర అణు నిల్వలు దాదాపు 180 వార్‌హెడ్లు ఉన్నట్లు అంచనా. పాకిస్తాన్ దాదాపు 170కి చేరింది. చైనా దగ్గర ఇప్పటికే 600కి పైగా ఉండగా.. 2030 నాటికి ఈ సంఖ్య వెయ్యికి చేరవచ్చని అంచనా. ఈ నంబర్ గేమ్ మధ్య భారత్ తన అణు వ్యూహాన్ని కొత్తగా ఆలోచించాల్సిన అవసరం ఏర్పడింది. ఇటు మళ్లీ అణు పరీక్షలు చేయడం ద్వారా భారత్ తన థర్మో న్యూక్లియర్ బాంబులను పూర్తిగా ధృవీకరించుకోవచ్చు. ఈ పరీక్షలు భారత్ సామర్థ్యాన్ని పెంచుతాయని.. నో ఫస్ట్ యూజ్ విధానాన్ని మరింత బలపరుస్తాయని నిపుణులు అంటున్నారు.

**అంతర్జాతీయంగా ప్రమాదకరం?...** అయితే మరికొందరు శాస్త్రవేత్తల మాట వేరేలా ఉంది. కొత్త పరీక్షలు అవసరం లేవని కొందరు సైంటిస్టులు అంటున్నారు. 1998లో సేకరించిన డేటా, కంప్యూటర్ సిమ్యులేషన్లు చాలని వారు నమ్ముతున్నారు. కొత్త పరీక్షలు భారత్‌కి అంతర్జాతీయంగా ప్రమాదకరమని, అమెరికాతో ఉన్న అణు ఒప్పందం కూడా ప్రశ్నార్థకమవుతుందని హెచ్చరిస్తున్నారు. అమెరికా ఇప్పటికీ CTBT ఒప్పందాన్ని ఆమోదించలేదు. చైనా కూడా ఆ ఒప్పందాన్ని పూర్తిగా అంగీకరించలేదు. భారత్, పాకిస్తాన్ కూడా దానిపై సంతకం చేయలేదు. ఇటు ఒప్పందాన్ని ముందుగా అంగీకరించిన రష్యా తన మద్దతును వెనక్కి తీసుకుంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచ అణు నియంత్రణ వ్యవస్థ బలహీనపడుతోంది. ఒకవేళ అమెరికా పరీక్షలు మొదలుపెడితే.. రష్యా, చైనా కూడా అదే పని చేస్తాయి. అప్పుడు భారత్ మౌనం పాటిస్తే, వ్యూహాత్మకంగా వెనుకబడే అవకాశం ఉంది.

**1998లో పోఖ్రాణ్‌లో ఐదు అణు పేలుళ్లు**
**అణు శక్తి కలిగిన దేశాల జాబితాలో భారత్**
**సామర్థ్యాన్ని పెంచనున్న థర్మో న్యూక్లియర్ బాంబులు**




# మరో ప్రమాదం..

## డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు.. బెంబేలెత్తిపోయిన ప్రయాణికులు

సంగారెడ్డి జిల్లా, నవంబర్ 5: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల బస్సు ప్రమాదం ఘటన ఎంతటి విషాదాన్ని నింపిందో అందరికీ తెలిసిందే. బస్సును టిప్పర్ లారీ ఢీకొట్టడంతో అందులోని కంకర బస్సులో పడి దాదాపు 19 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మరువక ముందే తెలంగాణలో మరో ప్రమాదం చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లాలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. దీంతో బస్సులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. జాతీయ రహదారి 65 సమీపంలో పటాన్‌చెరు మండలం ముత్తంగి వద్ద ఆర్టీసీ బస్సుకు ప్రమాదం జరిగింది. ముందు ఉన్న కారును తప్పించబోయి బ్రేక్ ఫెయిల్ అవడంతో బస్సు డివైడర్‌పైకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ప్రయాణికులు ఎవరూ కూడా గాయపడకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదానికి గురైన బస్సు మేడ్చల్ డిపోకు చెందింది. మేడ్చల్ నుంచి ఇస్నాపూర్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే పటాన్‌చెరు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకున్నారు. బస్సులో సాంకేతిక లోపం కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. అయితే ఆర్టీసీ బస్సులకు వరుసగా జరుగుతున్న ప్రమాదాలతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్న పరిస్థితి.



# ఆధారాలతోనే మాట్లాడుతున్నా..

## రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు.. 25 లక్షల దొంగ ఓట్లంటూ..

బిహార్ ఎన్నికల వేళ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి అధికార బీజేపీ, ఎలక్షన్ కమిషన్‌లపై విరుచుకుపడ్డారు. గతేడాది హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో భారీ స్థాయిలో ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. 100 శాతం పక్కా ఆధారాలతో ఈ ఆరోపణలు చేస్తున్నానని అన్నారు.

కాంగ్రెస్ గెలుపును ఓటమిగా మార్చేందుకు వ్యవస్థాగత స్థాయిలో అవకతవకలు చోటుచేసుకున్నాయని అన్నారు. 'హర్యానాలో రెండు కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 25 లక్షల ఓట్లు నకిలీవే' అంటూ ఢిల్లీలో తాజాగా నిర్వహించిన పత్రికా సమావేశంలో సంచలన ఆరోపణలు చేశారు. తన బృందం 5.21 లక్షల డూప్లికేట్ ఓటర్లను గుర్తించిందని అన్నారు. హర్యానాలోని ప్రతి ఎనిమిది ఓట్లలో ఒకటి నకిలీనేనని స్పష్టం చేశారు. తన ఆరోపణలపై ఓ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ కూడా ఇచ్చారు. ఒక బ్రెజిల్ నటి ఫొటోతో, సీమా, స్వీటీ, సరస్వతి వంటి పలు పేర్లతో ఏకంగా 22 సార్లు నకిలీ ఓట్లు వేశారని అన్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఎలక్షన్ కమిషన్ వర్గాలు రాహుల్ గాంధీ ఆరోపణల్ని కొట్టిపారేశాయి.

ఎన్నికల సమయంలో ఓటర్ జాబితాపై ఒక్క అప్పీల్ కూడా రాలేదని గుర్తు చేశాయి. హర్యానాలో 90 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అయితే, పంజాబ్ హర్యానా హైకోర్టులో మాత్రం కేవలం 22 ఎన్నికలకు సంబంధించిన పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అంటే, ఎన్నికల ఫలితాలకు న్యాయపరమైన సవాళ్లు పరిమితమనేందుకు ఇది సూచన అని ఈసీ వర్గాలు కామెంట్ చేస్తున్నాయి.



# కర్ణాటకలో రోడ్డు ప్రమాదం..

## నలుగురు తెలంగాణవాసుల మృతి

మానూర్: కర్ణాటకలోని హల్లిఖేడ్‌లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వ్యాను, కారు ఢీకొన్న ఈ ఘటనలో నలుగురు తెలంగాణవాసులు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన నవీన్ (40), రాచప్ప (45), కాశీనాథ్ (60), నాగరాజు (40)గా గుర్తించారు. వీరంతా గణగాపూర్ దత్తాత్రేయ ఆలయానికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే అవగాహన కుదిరింది: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఏం చేస్తుందో చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా యూసఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు, భారత రాష్ట్ర సమితికి మధ్య ఎలాంటి అవగాహనా ఒప్పందం జరగలేదని తేల్చిచెప్పారు. కేసీఆర్ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారని.. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి మధ్యనే అవగాహన కుదిరిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంతో పాటు జూబ్లీహిల్స్‌లోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు.



# చట్నీ పడిందని.. చంపేశారు..




## మా డిమాండ్లు పరిష్కరించే వరకు

# కళాశాలల బంద్ కొనసాగిస్తాం

హైదరాబాద్: తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేవరకు బంద్ కొనసాగిస్తామని తెలంగాణ ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య అధ్యక్షుడు రమేశ్‌బాబు అన్నారు. గత నాలుగు రోజులుగా బంద్ చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చర్చలకు పిలిచిందని చెప్పారు. "జేఎన్‌టీయూ, ఉస్మానియా పరిధిలో నిర్వహిస్తున్న పరీక్షలను కళాశాలలు బహిష్కరించాయి. కళాశాల విద్య కమిషనర్ దేవసేన ఎంత వేధిస్తున్నా భరించాం. ఆమెను ఆ విభాగం నుంచి బదిలీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరాం. ఫీజు బకాయిల్లో 50 శాతం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. మా డిమాండ్‌లను పరిష్కరించే వరకు బంద్ కొనసాగిస్తాం. ఎల్బీ స్టేడియంలో ఈనెల 8న కళాశాలల అధ్యాపకుల సభ నిర్వహిస్తాం. సుమారు 70వేల మంది దీనికి హాజరవుతారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల పరిష్కారానికి కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నాం. మూడు నెలలకు బదులు ఒక నెలలోనే కమిటీ రిపోర్టు అడగాలి. మార్చి నాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి. కాలేజీలపై విజిలెన్స్ దాడుల్లో నియంతృత్వ ధోరణి కనిపిస్తోంది. ఈ డిమాండ్లను పరిష్కరించకపోతే 10లక్షల మంది విద్యార్థులతో భారీ సభ నిర్వహిస్తాం" అని అన్నారు.

## చెత్త ఎవరిదో .. సత్తా ఎవరిదో తేల్చుకుందాం: రేవంత్‌కు కేటీఆర్ సవాల్



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్‌లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నివేదిక విడుదల చేశారు. 'జూబ్లీహిల్స్ ప్రగతి నివేదిక' పేరిట తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "రెండేళ్లలో నగరంలో ఒక్క ఫ్లైఓవర్, కొత్త రోడ్డు ఒకటి అయినా వేశారా..? సీఎం రేవంత్‌రెడ్డి నిన్న చేసిన వ్యాఖ్యలు నిరాశ, నిస్పృహకు సంకేతం. నాపై వ్యక్తిగతంగా విమర్శలు చెసినా.. సీఎం పదవిలో ఉన్న రేవంత్‌రెడ్డిని గౌరవిస్తా. హైదరాబాద్ అభివృద్ధికి మా పార్టీ ఏం చేసిందో.. రెండేళ్ల కాంగ్రెస్ ఏం చేసిందో చర్చకు రేవంత్ సిద్ధమా..? చెత్త ఎవరిదో.. సత్తా ఎవరిదో తేల్చుకుందాం.. చర్చకు రావాలి. కమాండ్ కంట్రోల్ సెంటర్, జూబ్లీహిల్స్ నివాసం, గాంధీభవన్, అసెంబ్లీ.. ఎక్కడైనా సరే చర్చకు సిద్ధం. పురపాలక, హోంశాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారు" అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు.

## ఛత్తీస్‌గఢ్ - తెలంగాణ సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టుల హతం..



ఛత్తీస్‌గఢ్ – తెలంగాణ సరిహద్దు బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం, మారిమల్ల అడవుల్లో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఆ ప్రాంతంలోని మావోయిస్టులను భద్రతా దళాలు చుట్టుముట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతమైనట్లు సమాచారం.

భద్రతా దళాలు సంఘటనా స్థలంనుంచి పెద్ద సంఖ్యలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఇంకా అదే ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. అయితే, మావోయిస్టుల మృతిపై పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.



# కార్తీక పౌర్ణమి.. పోటెత్తిన భక్తులు..

తెలుగు రాష్ట్రాల్లో కార్తీకపౌర్ణమిని అంతటా ఘనంగా జరుపుకుంటున్నారు. శివాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు జరుగుతున్నాయి.

ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి, అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నదిలో వదులుతున్నారు. భక్తులు దానధర్మాలు, నదీ స్నానాలు చేస్తూ పుణ్యం సంపాదించుకుంటున్నారు.

**నంద్యాల :** శ్రీశైలంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా మల్లన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండే పాతాళగంగలో పుణ్య స్థానాలు ఆచరించి స్వామిఅమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులు తీరారు. స్వామిఅమ్మవార్ల దర్శనానికి 4 గంటల సమయం, ప్రత్యేక దర్శాన్నికి 2 గంటల సమయం పడుతుంది.

**వరంగల్ :** కార్తీక పౌర్ణమి సందర్భంగా శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు.. ఆలయాల్లో దీపాలు వెలిగించి, పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. వరంగల్ వేయిస్తంబాల దేవాలయం, కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, రామప్ప దేవాలయం, కురవి వీరభద్రస్వామి, పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ కొనసాగుతుంది.

**నల్లగొండ :** ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు జరుగుతున్నాయి. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిటలాడుతున్నాయి. శివనామస్మరణంతో శివాలయాలు మారుమోగుతున్నాయి. తెల్లవారుజాము నుండే అలయాలకు చేరుకొని కార్తీక దీపాలు వెలిగించి, భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేస్తున్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు.. బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివారి దర్శనానికి బారులు తీరారు. బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, ఝూరాసంగం కేతకి సంగమేశ్వర, సంగారెడ్డి సోమేశ్వర ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది.


**భద్రాద్రి కొత్తగూడెం...** కార్తీక పౌర్ణమి సందర్భంగా భద్రాచలం వద్ద గోదావరి నదిలో భక్తుల పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు.

కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్నారు. మణుగూరు సబ్ డివిజన్ వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో శివాలయాలు కిటకిటలాడుతున్నాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, పూజలు చేస్తున్నారు.

హైదరాబాద్: సభ్యసమాజం ఎటు పోతుందో అర్థం కావడం లేదు. కేవలం చట్నీ బట్టలపై పడిందనే చిన్న కారణంతో ఒక వ్యక్తిని నలుగురు యువకులు అతి కిరాతకంగా హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ కళ్యాణపురి నివాసి మురళీ కృష్ణ (45) అనే వ్యక్తి సోమవారం రాత్రి ఎల్బీనగర్ వద్ద ఇంటికి వెళ్లేందుకు కారును లిఫ్ట్ అడిగాడు. ఆ కారులో నలుగురు యువకులు ఉన్నారు. అయితే, మార్గం మధ్యలో వారికి ఆకలి వేయడంతో ఉప్పల్‌లోని ఓ టిఫిన్ సెంటర్ దగ్గర వారంతా టిఫిన్ చేయడానికి ఆగారు. అయితే, అక్కడ అనుకోకుండా మురళీ కృష్ణ ప్లేట్‌లోని చట్నీ ఒక యువకుడిపై పడింది. దీంతో ఆ యువకులు మురళీ కృష్ణతో గొడవకు దిగారు. బలవంతంగా అతడిని కారులోకి ఎక్కించుకుని సుమారు రెండు గంటల పాటు కారులోనే తిప్పుతూ.. చిత్ర హింసలకు గురి చేశారు. అంతేకాకుండా, నాచారం సమీపంలోని ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో అతడిని విచక్షణారహితంగా పొడిచారు. నిందితుల నుంచి తప్పించుకునేందుకు మురళీ కృష్ణ ప్రయత్నించి చివరికి తన ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనపై కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.




జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలు బుధవారం ఆపరేషన్ ఛత్రును చేపట్టాయి. కిష్త్వాడ్ జిల్లాలో ముగ్గురు ఉగ్రవాదులు దాక్కున్నట్లు సమాచారం అందుకున్న భద్రతా బలగాలు ఉగ్రవాదులను చుట్టుముట్టాయి. దీంతో సైనికులకు, ఉగ్రవాదులకు మధ్య భారీగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. కిష్త్వాడ్‌లోని ఛత్రు ప్రాంతంలో ముగ్గురు ఉగ్రవాదులు కొన్ని నెలలుగా నక్కి ఉన్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే సమాచారం అందుకున్న వెంటనే భారత సైన్యంలోని వైట్ నైట్ కార్ప్స్, కశ్మీర్ పోలీసుల సంయుక్త బృందాలు తెల్లవారుజామున సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఉగ్రవాదులను గుర్తించిన భద్రతా దళాలు వారిని చుట్టుముట్టాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.




అమరావతి: ఏపీలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. 120 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం, ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, విజయనగరం జిల్లాలోని భోగాపురం, సత్యసాయి జిల్లాలోని చిలమత్తూరు, పల్నాడు జిల్లా నరసరావుపేట తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ దాడులు చేపట్టినట్లు తెలుస్తోంది.

## ఏపీలో అభివృద్ధి వేగం ఇక ఎప్పుడూ ఆగదు: మంత్రి నారా లోకేశ్



అమరావతి: ఏపీలో అభివృద్ధి వేగం ఇక ఎప్పుడూ ఆగదని మంత్రి నారా లోకేశ్ అన్నారు. బీపీసీఎల్ రామాయపట్నం పోర్టులో దేశంలోనే అతి పెద్ద రిఫైనరీ, పెట్రో కెమికల్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోందని చెప్పారు. ప్రాజెక్టుకు అవసరమైన భూమిని రికార్డు సమయంలో కేటాయించామన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. వేగంతో కూడిన సామర్థ్యమే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకతని మంత్రి పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో లోకేశ్ పోస్ట్ చేశారు.




అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి లండన్‌లో రెండు అంతర్జాతీయ పురస్కారాలను అందుకోవడంపై ఆమె సోదరుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. భువనేశ్వరికి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "లండన్‌లోని మే ఫెయిర్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రెండు విశిష్ట పురస్కారాలను నారా భువనేశ్వరి అందుకోవడం మా కుటుంబానికి, తెలుగు ప్రజలందరికీ గర్వకారణం. సమాజసేవలో చూపిన దృఢమైన నిబద్ధత, నైతిక విలువలతో కూడిన నాయకత్వానికి గుర్తింపుగా ఆమెకు 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025', హెరిటేజ్ ఫుడ్స్‌కు గోల్డెన్ పీకాక్ అవార్డులు లభించాయి. భువనేశ్వరి దూరదృష్టి, కృషి, నిజాయతీ, ప్రజల పట్ల ఉన్న సేవాభావానికి అంతర్జాతీయ స్థాయిలో లభించిన గొప్ప గౌరవం ఈ పురస్కారాలు. ఆమె విలువలు, సేవా స్ఫూర్తి మనందరికీ ఆదర్శం" అని బాలకృష్ణ పేర్కొన్నారు.

## తిరుమల లడ్డూ ప్రసాదంలో నాణ్యత పెంచాం: తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు

హైదరాబాద్: తిరుమల దేవదేవుడి పవిత్రతను పెంచాలనేది బోర్డు నిర్ణయమని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. "గతంతో పోలిస్తే తిరుమల అన్నప్రసాదాల్లో మార్పులు వచ్చాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన పదార్థాలతో రుచికరమైన భోజనం అందిస్తున్నాం. తిరుమలలో రోజూ 1.5లక్షల నుంచి 2లక్షల మంది భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరిస్తున్నారు. లడ్డూ ప్రసాదంలో కూడా చాలా మార్పులు వచ్చాయి. ప్రసాదాలు పది రోజులైనా నిల్వ ఉంటున్నాయని భక్తులు చెబుతున్నారు. తిరుపతి స్థానికులకు నెలకోసారి తొలి మంగళవారం 3వేల మందికి దర్శనం కల్పిస్తున్నాం. తిరుమలలోని కాటేజ్‌లకు గతంలో సొంత పేర్లు పెట్టుకున్నారు. వాటిని తొలగించి దేవుడి పేర్లు పెట్టాలని నిర్ణయించాం. మొదటి బోర్డు మీటింగ్‌లోనే అన్యమతస్థులను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నాం.. కొందరిని తొలగించాం. ఏఐ సాంకేతికత సాయంతో 2గంటల్లోనే భక్తులకు దర్శనం ఏర్పాటు చేయాలని అనుకున్నాం.. కానీ, ఒక వర్గం ఏఐపై వ్యతిరేకత వ్యక్తం చేసింది. నూతన ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో మళ్లీ ఏఐ ప్రాజెక్టును పట్టాలెక్కిస్తున్నాం. తిరుమల కొండపై రాజకీయాలు మాట్లాడితే చర్యలు తీసుకోవాలని తీర్మానించాం. టూరిజం ప్యాకేజీలను రద్దు చేసి ఆ టికెట్‌లను సామాన్య భక్తులకు ఇస్తున్నాం.


**తితిదే పరిధిలోని ఆలయాల్లో నిత్యాన్నదానం...** శ్రీనివాస సేతు పేరు బదులుగా తిరుపతి ఫ్లైఓవర్‌కు గరుడ వారధి అని పెట్టాం. కొండని ఆనుకొనివున్న స్థలంలో ముంతాజ్ హోటల్‌కి గత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సీఎం చంద్రబాబు సహకారంతో ఆ హోటల్‌ను అక్కడి నుంచి తీసేయించి వేరే చోటికి మార్చాం. తిరుమలలో దాదాపు 1500 దుకాణాలకు ఇష్టా రాజ్యంగా అనుమతులు ఇచ్చారు. వాటన్నింటినీ క్రమబద్ధీకరిస్తున్నాం. బ్రేక్ దర్శనాలు మొన్నటి వరకు 10.30కి ఉండేవి.. ఇప్పుడు వాటిని తిరిగి తెల్లవారుజాముకి మార్చాం. అలిపిరి టోల్‌గేట్ వద్ద కొత్త సాంకేతికత ఏర్పాటు చేస్తున్నాం. శ్రీవాణి ట్రస్ట్ కింద 5వేల ఆలయాలు నిర్మించాలని తీర్మానించాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆలయాలు, భజన మందిరాలు నిర్మిస్తాం. తితిదేకు 100 ఎలక్ట్రిక్ బస్సులు ఇస్తామని కేంద్రమంత్రి కుమారస్వామి హామీ ఇచ్చారు. వాటిని తిరుపతి, తిరుమల మధ్య నడపాలి అనుకుంటున్నాం. తితిదే పరిధిలో ఉండే ఆలయాల్లో నిత్యాన్నదానం ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రతి రాష్ట్ర రాజధానిలో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే రెండు రాష్ట్రాలు రాజధాని లో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఆమోదం తెలిపాయి. ఒంటిమిట్టలో 100 గదుల వసతి గృహం నిర్మాణం చేయలని నిర్ణయించాం.

**కరీంనగర్, దుబ్బాకలో శ్రీవారి ఆలయాల నిర్మాణం..** వెంకటేశ్వర గోశాల నిర్వహణ మెరుగుపరచడంపై నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశాం. నివేదిక వచ్చిన తరువాత కార్యాచరణ ఉంటుంది. సిమ్స్ ఆసుపత్రిలో మెడికల్ మాఫీయా నడుస్తుంది.. ఆసుపత్రే మెడికల్ షాప్స్ నిర్వహించాలని నిర్ణయించాం. తిరుపతి ఎయిర్‌పోర్టుకు శ్రీవెంకటేశ్వర ఎయిర్ పోర్ట్ అని నామకరణం చేయాలని కోరుతున్నాం. పేరుతో పాటు ఎయిర్ పోర్ట్‌ని ఆలయం సెట్ లాగా ఏర్పాటు చేస్తున్నాం. తిరుపతి ఎయిర్ పోర్ట్ అంటే వెంకటేశ్వర స్వామి ఆలయం గుర్తు వచ్చేలా తీర్చిదిద్దుతాం. తిరుమలపై అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. టికెట్ల జారీలో సైబర్ నేరాలకు పాల్పడిన వారిని తొలగించి.. సైబర్ సెక్యూరిటీ ల్యాబ్‌ని ఏర్పాటు చేశాం. అన్నమయ్య జన్మించిన తాళ్లపాకను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. తితిదే కొనుగోళ్ల విభాగంలో జరిగిన అవకతవకలపై ఏసీబీ విచారణకు ఆదేశించాం. రూ.30 కోట్లతో కరీంనగర్‌లో, రూ.4.5 కోట్లతో దుబ్బాకలో శ్రీవారి ఆలయాలు నిర్మించనున్నాం" అని బీఆర్ నాయుడు తెలిపారు.




## ధాన్యం కొనుగోలు డబ్బులు.. 24 గంటల్లోనే

అమరావతి : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమైన సంస్కరణ చేశామని.. రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో రైతులను ఆదుకోవాలని నిర్ణయించామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అనేక సందర్భాల్లో ఏ విధంగా దళారులను ప్రోత్సహించినా పరిస్థితులను మార్చేందుకు కృషి చేశామన్నారు. రైతులతో మాట్లాడి ఈ పరిస్థితుల్లో మార్పులు తెచ్చేందుకు ప్రయత్నించామని చెప్పారు. తేమ శాతంలో పారదర్శకత లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడేవారన్నారు. ఈసారి ఖరీఫ్ మాసానికి 51 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం కొనేందుకు సిద్ధం అయ్యామని తెలిపారు. అంటే రూ.12,200 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలుకు సిద్ధం అయినట్లు చెప్పారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను.. 6 కోట్ల గోతాలను కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం కొన్ని సందర్భాలలో 6 నెలలు నుంచి 9 నెలల వరకు బకాయిలు ఇవ్వలేదని గుర్తుచేశారు. దాదాపు రూ.1670 కోట్ల బకాయిలు గత ప్రభుత్వం వదిలి వెళ్ళిందని విమర్శించారు. దాదాపు 87 శాతం ధాన్యం కొనుగోలు డబ్బులు 48 గంటల్లో ఇచ్చామని తెలిపారు. ఈ సారి 24 గంటల్లోనే పేమెంట్ చేసేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఉదయం, 12 గంటలకు, 2 గంటలకు, 4 గంటలకు, 7 గంటలకు ధాన్యం అమ్మినా రోజు వారికి పేమెంట్ చేస్తున్నామని.. అంటే కేవలం 2 గంటల్లోనే డబ్బు చెల్లిస్తామన్నారు. సెలవు రోజుల్లో మాత్రం తదుపరి రోజు చెల్లిస్తామని మంత్రి చెప్పారు. మాయిశ్చర్ రీడింగ్ విషయంలో బ్లూ టూత్ ద్వారా లెక్కించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వాట్సప్ ద్వారా ధాన్యం కొనుగోలుకు అవకాశం ఇస్తున్నామని... ఈ సీజన్‌లో రైతులు ఇప్పటికే ఈ సౌలభ్యాన్ని వాడుతున్నారని మంత్రి తెలిపారు. నవంబర్‌లో 11 లక్షలు, డిసెంబర్‌లో 25 లక్షలు, జనవరిలో 8 లక్షలు, ఫిబ్రవరిలో 3 లక్షలు, మార్చిలో మరో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధం అవుతున్నట్లు వెల్లడించారు. జనవరి నుంచి జిల్లా హెడ్ క్వార్టర్‌లలో గోధుమ కేజీ 18 రూపాయలకు అందించాలని చూస్తున్నట్లు తెలిపారు. దీపం 2 పథకం విషయంలో నవంబర్ 30 వరకు 3వ విడత కొనసాగుతుందని స్పష్టం చేశారు. మొంథా తుఫాను బాధితులకు పౌరసరఫరాల శాఖ నిత్యావసరాలు అందించిందన్నారు. ఇప్పటికే స్మార్ట్ కార్డులు 92 శాతం పంపిణీ పూర్తి అయిందని అన్నారు. నెలాఖరున మిగిలిన కార్డులు వెనక్కి తీసుకుని... మనమిత్ర యాప్ ద్వారా కోరిన వారికి పరిశీలించి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కౌలు రైతులకు 50 వేలు టారపాలిన్‌లు ఉచితంగా అందిస్తామని మంత్రి అన్నారు. చాలా జిల్లాల్లో ఈ క్రాప్ పూర్తి అయిందని.. అసలు గతంలో వారు ఎంతమంది దగ్గర నుంచి కొనుగోలు చేశారో ఆ పార్టీ నేత చెప్పాలని డిమాండ్ చేశారు. 39 లక్షల 51 వేల ఎకరాలు ధాన్యం కొనుగోలు ఈ క్రాప్ కింద నమోదు అయినట్లు తెలిపారు. 85 లక్షల మెట్రిక్ టన్నులు క్రాప్ వస్తుందని భావిస్తున్నామన్నారు. పంట నష్టం నమోదు చేసి అందించినప్పుడు ధాన్యం కొనుగోలు చేయరని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నూటికి నూరు శాతం ఈ క్రాప్‌లో నమోదు అయిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. తమవి కాని ఆస్తులు రేషన్ కార్డు జారీలో చూపిస్తున్న మాట నిజమే అని అదంతా లెగసీ వల్ల వచ్చిందని.. దీనిపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కందిపప్పు విషయంలో ప్రైస్ ఇంటర్వెన్షన్ అవసరం లేదని భావిస్తున్నామన్నారు. గోధుమ 1 కేజీ కుటుంబానికి ఇచ్చే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పీడీఎస్ రైస్ విషయంలో 5 నిముషాల్లో నిర్ధారణ చేసి సీజ్ చేసే అవకాశం ఉంటుందని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.




శ్రీకాకుళం : జిల్లాలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పర్యటన కొనసాగుతోంది. ఈరోజు (బుధవారం) శ్రీకాకుళం పట్టణంలో ఉమెన్స్ కళాశాలలో అదనపు భవనాల ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలలో తన తల్లి కూడా చదివారని తెలిపారు. స్టేట్‌లో అధికంగా ఈ మహిళా కళాశాలలో విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. రూ. 99 లక్షలతో 5 అదనపు తరగతి గదులు నిర్మించామని తెలిపారు. పిల్లల మైండ్ అభివృద్ధి చెందాలంటే అందరూ ఆటలు ఆడాలని కేంద్రమంత్రి అన్నారు. కళాశాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పిల్లల నుంచి కోరుకునేది ఒక్కటే అని.. యూత్ అంతా రాణించాలని ఆకాంక్షించారు. పిల్లలంతా పెద్ద పెద్ద లక్ష్యంతో ముందుకు వెళ్లాలని అన్నారు. పిల్లలంతా చదువు సమయంలో చదువు పైనే దృష్టి పెట్టాలని సూచించారు. వేదిక ఎదురుగా విద్యార్థులతో కలిసి నేలపైన కూర్చుని మరీ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ముచ్చటించారు. అనంతరం కల్లేపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్రమంత్రి ప్రారంభించారు. కోతకు గురైన పెద్ద గనగల్లవానిపేట వద్ద సముద్ర తీరాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పరిశీలించారు.




## కూటమి బలం మరింత పెరుగుతోంది.. జగన్ బలం తగ్గుతోంది: ఆదినారాయణ రెడ్డి

విజయవాడ: కూటమి బలం క్రమంగా మరింత పెరుగుతోందని.. జగన్ బలం తగ్గుతోందని భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అన్నారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం కేసుల్లో అనేక మంది వైకాపా నేతలు ఇరుక్కున్నారన్నారు. ఇటీవల జరిగిన పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో వైకాపా బలం బాగా తగ్గిపోయిందని పేర్కొన్నారు. తాము జగన్‌కు చెక్ పెట్టబోతున్నామన్నారు. ఆయనకు అధోగతి తప్పదని.. ప్రజలే ఛీకొట్టే రోజులు దగ్గర్లో ఉన్నాయని విమర్శించారు. పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో వైకాపాను ప్రజలు తరిమికొట్టారని చెప్పారు. "కేంద్రం ఎంపిక చేసిన ఆరు రాష్ట్రాల్లో మనం కూడా ఉన్నాం. పూర్వోదయ పథకం కింద మన రాష్ట్ర ప్రాజెక్టులకు కూడా నిధులు వస్తాయి. దీని కింద రూ.65 వేల కోట్లు కేటాయిస్తారు. రాష్ట్రానికి 4 విమానాశ్రయాలు.. సాగరమాల కింద 4 పోర్టులు వస్తున్నాయి. మిగతా రాష్ట్రాల కంటే మనకే ఎక్కువ టిడ్కో ఇళ్లు మంజూరు చేస్తున్నారు. సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అయింది. జీఎస్టీ-2 ద్వారా ప్రజలకు అనేక లాభాలు కలుగుతున్నాయి" అని ఆదినారాయణ రెడ్డి అన్నారు.

## మంత్రి నారాయణ దుబాయ్ పర్యటన.. ప్రముఖ సంస్థల ఛైర్మన్లతో




దుబాయ్, నవంబర్ 5: ఏపీకి పెద్దఎత్తున పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు విదేశాల్లో పర్యటిస్తున్నారు. ప్రముఖ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలను కలుస్తూ పెట్టుబడులకు ఏపీ అనువైన ప్రాంతమని చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం సీఎం చంద్రబాబు దుబాయ్‌లో, మంత్రి లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటించి ఇన్వెస్ట్‌మెంట్స్‌పై ఫోకస్ పెట్టారు. ఇప్పుడు తాజాగా మంత్రి నారాయణ బృందం దుబాయ్‌లో పర్యటిస్తోంది. రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం మూడు రోజులుగా దుబాయ్‌లో మంత్రి నారాయణ బృందం పర్యటన కొనసాగుతోంది.

చురకలు

## సంపాదకీయం

# చైనాతో డీల్.. మళ్లీ ఫైటింగ్.. ఈ ట్రంప్ ఇక మారడంతే?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మాటలతో మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. ఇటీవల చైనాతో వాణిజ్య ఒప్పందానికి సంకేతాలు ఇచ్చిన ట్రంప్.. ఇప్పుడు మళ్లీ కఠిన హెచ్చరికలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

**డీల్ నుండి వార్నింగ్‌కు.. పాలిటిక్స్‌లో కొత్త మలుపు!...** ఇటీవల దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తో సుమారు రెండు గంటలపాటు గోప్యంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో వాణిజ్య టారిఫ్‌లు, అరుదైన ఖనిజాల సరఫరా, అలాగే తైవాన్ పరిస్థితిపై చర్చలు జరిగినట్టు సమాచారం.

**టారిఫ్‌ల తగ్గింపుతో సానుకూల సంకేతాలు...** ఆ తర్వాత ట్రంప్ చైనా మీద టారిఫ్‌లను 10 శాతం మేర తగ్గిస్తున్నట్టు ప్రకటించడం, రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలో కుదరనుందనే సంకేతాలు ఇవ్వడం, ప్రపంచ మార్కెట్లలో సానుకూల ప్రభావం చూపించింది.

**అకస్మాత్తుగా ఎందుకు హెచ్చరికలు?...** కానీ ఇప్పుడు అదే ట్రంప్ మళ్లీ చైనాకు వార్నింగ్ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. ఓ ప్రముఖ మీడియా ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి. "తైవాన్‌పై చైనా మిలిటరీ చర్య తీసుకుంటే ఏమవుతుంది అనేది వారికే తెలుసు. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నంతకాలం వారు జాగ్రత్తగా ఉంటారు" అని వ్యాఖ్యానించారు. "నేను ఎలాంటి రహస్యాలు బయటపెట్టను, కానీ జరిగే పరిణామాలు చైనాకు ఖచ్చితంగా తెలుసు," అని మరోమారు హెచ్చరించారు.

**జియో పాలిటిక్స్ లో ట్రంప్ వ్యూహం...** ఇక ఈ వ్యాఖ్యలు వస్తున్న సమయమే అమెరికా-చైనా మధ్య సంబంధాలు మళ్లీ సున్నిత దశలోకి వెళ్తున్నాయన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం, సాంకేతిక ఆంక్షలు, తైవాన్ సమస్య వంటి అంశాలు ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయి. చైనాతో మృదువుగా వ్యవహరించిన ట్రంప్ ఇప్పుడు అకస్మాత్తుగా గట్టిగా మాట్లాడటానికి కారణమేమిటన్నదే ఇప్పుడు విశ్లేషకుల చర్చ. కొందరి అభిప్రాయం ప్రకారం.. అమెరికా లో షట్ డౌన్ నడుస్తుండడంతో ట్రంప్ మళ్లీ "అమెరికా ఫస్ట్" నినాదాన్ని బలంగా వినిపిస్తూ దేశభక్తి భావనను పెంచే ప్రయత్నం చేస్తున్నారంటున్నారు. మరికొందరు, ఇది కేవలం చర్చలలో తమ బలాన్ని పెంచుకోవడానికి చేసే వ్యూహాత్మక చర్యగా భావిస్తున్నారు.

**ట్రంప్ స్టైల్ మారదు!..** మొత్తం మీద చైనాతో డీల్ ఒకవైపు.. మళ్లీ వార్నింగ్‌లు మరోవైపు ట్రంప్ పాలిటిక్స్ ఎప్పటిలాగే అంచనా వేయలేనిది. ఆయన చర్యలు, వ్యాఖ్యలు మరోసారి అంతర్జాతీయ వేదికపై అమెరికా-చైనా సంబంధాలపై కొత్త ఊపిరి రేపుతున్నాయి. కీలకంగా చెప్పాలంటే ట్రంప్ శైలీ మారదు.. నిన్న డీల్, ఈ రోజు ఫైట్. చైనాతో ఆయన రాజకీయ గేమ్ ఇంకా కొనసాగుతూనే ఉంది.

# నడిచే విజ్ఞాన సర్వస్వం కపిలవాయి లింగమూర్తి - నవంబర్ 6... కవి కేసరి వర్ధంతి



కపిలవాయి లింగమూర్తి (మార్చి 31, 1928 నవంబర్ 6, 2018) పాలమూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, సాహితీ పరిశోధకుడు. పద్య రచనతో ఆయన ప్రస్థానం ఆరంభమైనా కథా రచన, విమర్శ ప్రక్రియతో వెలుగులోకి వచ్చారు. జానపద సాహిత్యం, పాలమూరు జిల్లాలోని దేవాలయాలపై విస్తృత పరిశోధనలు చేశాడు. 70 కి పైగా పుస్తకాలు రచించాడు. ఈయనకు కవి కేసరి అనే బిరుదు ఉంది. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేటు అందుకున్న తొలివ్యక్తి కపిలవాయి లింగమూర్తి. ఆయన అచ్చంపేట తాలుకా, బల్మూర్ మండలం, జినుకుంటలో మాణిక్యమ్మ, వెంకటాచలం దంపతులకు మార్చి 31, 1928కు సరియైన ప్రభవ నామ సంవత్సరం మాఘ శుద్ధ నవమి నాడు జన్మించారు. ఆయనకు రెండున్నరేళ్ళ వయసులో తండ్రి మృతి చెందడంతో మేనమామ పెద లక్ష్మయ్య దగ్గర పెరిగారు. పాఠశాల విద్యను ఉర్దూ మాధ్యమంలో పూర్తి చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్ పరీక్షలు రాసి తెలుగులో విశారద ప్రమాణ పత్రాన్ని సంపాదించారు. అనంతరం ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి ఎం.ఏ. (తెలుగు) పట్టా పొంది 1954లో నాగర్‌కర్నూల్ జాతీయోద్యమ పాఠశాలలో తెలుగు పండితునిగా చేరారు. ఆ తర్వాత 1972 లో పాలెం శ్రీవేంకటేశ్వర ప్రాచ్య డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకుడుగా చేరి దశాబ్దం పాటు సేవలందించి 1983లో ఉద్యోగ విరమణ పొందారు. లింగమూర్తి నడిచే విజ్ఞాన సర్వస్వంగా పేరుపొందారు. పలుగ్రంథాలు, పరిశోధనలు రచించి సాహితీవేత్తగా పేరుపొందాడు. కపిలవాయికి తెలుగు విశ్వవిద్యాలయం 26.8.2014 న గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. 30.08.2014 రోజున విశ్వవిద్యాలయం 13వ స్నాత కోత్సవంలో చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. తెలంగాణ రాష్ట్రంలో తెలుగు యూనివర్సిటీ నుంచి తొలి గౌరవ డాక్టరేట్ పొందిన వ్యక్తిగా కపిలవాయికి ఈ ఘనత దక్కింది. 1954 నుంచి 1983లో పదవీ విరమణ పొందే వరకు నాగర్‌కర్నూల్ లోని జాతీయోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి, అక్కడే స్థిరపడ్డారు. అనేక స్థలచరిత్రలు, దేవాలయాల కథలకు ఆయన ప్రాణంపోశారు. మొత్తం 70 రచనలు ముద్రితమయ్యాయి. 11రచనలు ద్విముద్రితాలు, 25 రచనలు ముద్రించాల్సి ఉంది.

సమైక్యరాష్ట్రంలో తెలంగాణ కవులు, సాహితీ వేత్తలకు అన్యాయం జరిగింది. జీవోలు తెలుగులో రావాలి. పాఠశాలల్లో తెలుగు బోధించాలి అని సూచనలు చేశారు. ఆయన శతాధిక రచనలు చేశాడు. కపిలవాయి లింగమూర్తి కావ్యాలు, గీతాలు, శతకాలు, వచన సాహిత్యం, స్థల చరిత్రలు, బాల సాహిత్యం మొదలగు వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేశారు. ఈ రచనలపై పలువురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటికి వీరి రచనలపై వివిధ విశ్వ విద్యాలయాలలో ఆరు సిద్ధాంత గ్రంథాలు రూపొందినవి. 1992లో కవితా కళానిధి, పరిశోధనా పంచానన, 1996లో కవికేసరి, 2005లో వేదాంత విశారద,2010లో గురు శిరోమణి, 2012లో సాహిత్య స్వర్ణ సౌరభ కేసరి, సాహితీ విరాణ్మూర్తి తదితర బిరుదులు, సత్కారాలు పొందారు. కపిలవాయి లింగమూర్తికి సాహిత్య రంగంలో చేసిన విశేషకృషికి గుర్తింపుగా రాష్ట్ర స్థాయిలో అనేక సందర్భాలలో సన్మానాలు జరిగాయి. 1983లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వీరిని సన్మానించారు. తరువాత నారా చంద్రబాబు నాయుడు, వై.యస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నకాలం లోనూ వారిచే సన్మానాలు పొందారు. తెలంగాణ రాష్ట్ర సమితి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆయనను సన్మానించారు. నలుగురు ముఖ్యంత్రులచే సన్మానింపబడిన ఏకైక తెలుగు కవి, పరిశోధకులు కపిలవాయి లింగమూర్తి. ఇంకా తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభాపురస్కారం, బూర్గుల రామకృష్ణారావు ప్రతిభా పురస్కారం, బ్రౌన్ సాహిత్య పురస్కారం, నోరి నరసింహశాస్త్రి పురస్కారం, కందుకూరి రుద్రకవి పురస్కారం, పులికంటి సాహితీ పురస్కారం, బి.ఎన్.శాస్త్రి స్మారక పురస్కారం మొదలైన ఎన్నో సత్కారాలను పొందాడు. వెన్నెల సాహిత్య అకాడమీ కపిలవాయి లింగమూర్తి జీవితం, సాహిత్య సృజన, పరిశోధనలపై కవితా కళానిధి కపిలవాయి లింగమూర్తి పేరుతో ఓ డాక్యుమెంటరీని రూపొందించింది. దీనికి 2011లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ రెండో డాక్యుమెంటరీ చిత్రంగా నంది అవార్డును ప్రకటించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత - నవంబర్ 6...అంతర్జాతీయ పర్యావరణ దోపిడీని నిరోధించే దినోత్సవం

అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అనేది ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక లాభం కోసం సహజ వనరులను దోచుకోవడం, దుర్వినియోగం చేయడం. ఇది ప్రధానంగా అడవుల నరికివేత, ఖనిజ సంపదను పెద్ద స్థాయిలో తవ్వుకోవడం, నీటి వనరులను అతిగా వినియోగించడం వంటి రూపాలలో ఉంటుంది. ఈ దోపిడీ వల్ల స్థానిక జీవజాలం, స్థానిక జనాభా తీవ్రంగా ప్రభావితం అవుతుంది. తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు లేదా అభివృద్ధి చెందుతున్న దేశాలు, తమ పర్యావరణం మరియు వనరులను పరిరక్షించడానికి తగిన విధానాలను అనుసరించలేక పోతున్నాయి. ఇది ఆ దేశాల పర్యావరణాన్ని తీవ్ర స్థాయిలో నాశనం చేస్తోంది. ప్రపంచం మొత్తం పర్యావరణ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్లోబల్ వార్మింగ్, వాయు కాలుష్యం, నీటి ప్రదూషణ, జీవవైవిధ్యం నష్టం వంటి అనేక సమస్యలు మన జీవన విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలకు ప్రధాన కారణం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పర్యావరణ దోపిడీ. ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక ప్రయోజనాల కోసం ఇతర దేశాల సహజ వనరులను దోపిడీ చేయడం, తద్వారా స్థానిక ప్రజల జీవన విధానాలపై ప్రతికూల ప్రభావం చూపడం, పర్యావరణ దోపిడీకి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఈ సమస్యను అరికట్టేందుకు మరియు పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్ట దినాన్ని పాటిస్తారు. ఈ సందర్భంలో అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అంటే ఏమిటి, దాని ప్రభావాలు, నివారణ చర్యలు, మన బాధ్యతలు వంటి అంశాలను పరిశీలించడం అవసరం. అడవుల నరికివేత, భారీ పరిశ్రమల నెలకొల్పటం, రసాయనాల వాడకం వంటివి అనేక జంతువుల, వృక్షజాలం నివాసాలను ధ్వంసం చేస్తాయి. వీటి వల్ల అనేక జీవజాతులు అంతరించి పోతాయి. జీవవైవిధ్యం కనుమరుగవడం వల్ల పర్యావరణ సమతుల్యతలో గణనీయమైన మార్పులు వస్తాయి. పరిశ్రమల నుంచి ఉద్గారాలు, వ్యవసాయ రసాయనాలు, మరియు ఇతర వ్యర్థ పదార్థాలు నదులు, సముద్రాలు, వాయు మండలాన్ని కలుషితం చేస్తాయి. ఇది పర్యావరణానికి మాత్రమే కాకుండా, మన ఆరోగ్యానికీ ప్రమాదకరం. దీని వలన వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, భూసమర్థవంతత తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వనరులను అతిగా





వినియోగించడం, చెట్లను నరికివేయడం, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను పెంచడం వలన వాతావరణంలో వేడి పెరుగుతోంది. దీని కారణంగా గ్లోబల్ వార్మింగ్ అనే సమస్య పెరిగి వాతావరణంలో అతివృష్టి, కరువు వంటి ప్రతికూల మార్పులు చోటు. చేసుకుంటున్నాయి. వాతావరణ మార్పు వల్ల వరదలు, కరువులు, అగ్ని ప్రమాదాలు వంటి సహజ వైపరీత్యాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఈ ప్రక్రియలతో పర్యావరణ నాశనం తక్షణమే కనిపించక పోయినా, దీర్ఘకాలంలో వీటి ప్రతికూల ప్రభావం పెద్ద స్థాయిలో ఉంటుంది. కాలుష్యం వల్ల మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయి. వాయు కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు, నీటి కాలుష్యం వల్ల నీటి ద్వారా వ్యాప్తిచెందే వ్యాధులు ప్రబలుతున్నాయి. శరీరంలో విష పదార్థాలు చేరటం వల్ల కేన్సర్, జన్యు వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీని అరికట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. పర్యావరణ పరిరక్షణ కోసం పలు అంతర్జాతీయ ఒప్పందాలు కుదిరాయి. టోక్యో ప్రోటోకాల్, పారిస్ ఒప్పందం వంటి ఒప్పందాలు ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు దేశాలు ఒక ప్రణాళికను అనుసరిస్తున్నాయి. ఈ ఒప్పందాలు పర్యావరణ పరిరక్షణకు దేశాల మధ్య సహకారాన్ని పెంపొందిస్తున్నాయి. ప్రతి దేశం పర్యావరణ పరిరక్షణ కోసం స్వంత చట్టాలను రూపొందిస్తోంది. వనరులను అధికంగా వినియోగించే సంస్థలపై నియంత్రణ విధించేలా చట్టాలు అమలు చేస్తున్నాయి. కాలుష్య నియంత్రణ, వనరుల పరిరక్షణ, రక్షణాత్మక చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు చట్టాలను రూపొందిస్తున్నాయి.

**పర్యావరణ అవగాహన కార్యక్రమాలు:** పర్యావరణ పరిరక్షణపై ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరియు ఇతర సంస్థలు జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. పర్యావరణ సమస్యలను ప్రజలకు వివరించడం, అవగాహన కల్పించడం వల్ల ప్రజలు తమ జీవనశైలిని సవరించు కోవడానికి ఆసక్తి చూపిస్తారు. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తి, పవనశక్తి వంటి పునరుత్పాదక ఇంధనాలను వినియోగించడాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ వనరులు పర్యావరణానికి హానికరమైన కర్బన ఉద్గారాలను తగ్గించడంలో సహాయ. పడతాయి. ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణలో తన వంతు బాధ్యతను నిర్వర్తించాలి. వాహనాలను తక్కువగా వినియోగించడం, పునర్వినియోగ పదార్థాలు ఉపయోగించడం, నీటి వనరులను ఆదా చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చు. పర్యావరణానికి మేలు చేసే మొక్కలను నాటి, వాటిని సంరక్షించడం ద్వారా వాయు కాలుష్యం తగ్గించవచ్చు. పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తులను ఎంచుకోవడం, ప్లాస్టిక్ వంటి పదార్థాల వాడకాన్ని తగ్గించడం, మన పరిసరాల్లోని వారికి పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించడం చేపట్టాలి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ ఒక తీవ్రమైన సమస్యగా మనముందుంది. దీనిని అరికట్టడానికి ప్రభుత్వాలు, సంస్థలు, మరియు ప్రజలు కలిసి కృషి చేయాలి. పర్యావరణాన్ని కాపాడడంలో ప్రతి ఒక్కరి బాధ్యత అత్యంత కీలకం. మనం పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన జీవనం అందించ గలుగుతాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# విలక్షణ నటుడు సంజీవ్ కుమార్ - నవంబర్ 6... సంజీవ్ కుమార్ వర్ధంతి

ఒక విలక్షణమైన నటుడు. రంగస్థలం అంటే అతనికి ప్రాణం. సినిమాల్లోకి రావాలని ప్రయత్నిస్తున్న సమయంలో రాజశ్రీ సంస్థ వారు జరిపిన స్క్రీన్ టెస్ట్‌లో విఫలమయ్యాడు. అతడే ఆ తర్వాత జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడుగా రెండుసార్లు 'భారత్' అవార్డులను అందుకోవడం విశేషం. ఆయనే సంజీవ్‌కుమార్. సంజీవ్ కుమార్ అసలు పేరు హరిహర్ జెఠాలాల్ జరీవాలా (హరిభాయ్ అని కూడా వ్యవహరించ బడేవాడు. ఇతడు గుజరాత్ లోని సూరత్ లో ఒక గుజరాతీ పటేల్ కుటుంబంలో జన్మించాడు. ఇతని బాల్యం సూరత్‌లో గడచింది. తరువాత ఇతని కుటుంబం ముంబాయికి తరలి వెళ్ళింది. అక్కడ ఒక ఫిలిం స్కూలులో సంజీవ్ కుమార్ శిక్షణ పొందాడు. తద్వారా బాలీవుడ్‌లో నటుడిగా స్థిరపడ్డాడు. ఇతడు తన నట జీవితాన్ని నాటకరంగం ద్వారా ప్రారంభించాడు. మొదట ఇతడు ముంబాయిలోని "ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్", పిమ్మట "ఇండియన్ నేషనల్ థియేటర్" సంస్థల నాటకాలలో వేషాలు వేశాడు. రంగస్థల నటుడిగా ఇతడు 22 ఏళ్ల వయసులో ముసలి వేషాలు వేసేవాడు. 1952లో శశిధర్ ముఖర్జీ బెంగాలి సినిమా 'బసు పరివార్' చిత్రాన్ని హిందీలో 'హమ్ హిందుస్తానీ' పేరుతో పునర్నిర్మించారు. సునీల్ దత్, ఆశాపరేఖ్ జంటగా నటించిన ఈ చిత్రం ద్వారా సంజీవ్ కుమార్ బాలీవుడ్‌కు పరిచయ మయ్యాడు. ఇతనితోపాటే ప్రేమ్ చోప్రా కూడా వెండితెరకు చేరువయ్యాడు. ఇతని సినిమా ప్రస్థానం 1960లో హమ్ హిందుస్తానీ అనే సినిమాలో ఒక చిన్న పాత్ర ద్వారా ఆరంభమైంది. హీరోగా హిందీ సినిమాలో పరిచయం కావడానికి సంజీవ్ కుమార్‌కు ఐదేళ్లు పట్టింది. 1965లో నిశాన్ అనే సినిమా ద్వారా కథా నాయకుడి వేషాలు వేయడం మొదలు పెట్టాడు. 1968లో సంఘర్ష్ సినిమాలో ప్రముఖ నటుడు దిలీప్ కుమార్‌తో కలిసి నటించాడు. తరవాత 'స్మగ్లర్', 'పతి పత్ని', 'హుస్న్ అవుర్ ఇష్?', 'బాదల్' వంటి సినిమాల్లో నటించినా సంజీవ్ కుమార్‌కు పెద్దగా గుర్తింపు రాలేదు. హిందీ సినిమాలలోనే కాక మారాఠీ, తెలుగు, పంజాబీ, సింధీ, తమిళ, గుజరాతీ సినిమాలలో కూడా నటించాడు. ఇతడు గుల్జార్, ఎ.కె.హంగల్, హృషీకేశ్ ముఖర్జీ, యశ్ చోప్రా, సుభాష్ ఘాయ్, సత్యజిత్ రే మొదలైన దర్శకులతో పనిచేశాడు. అరుణా ఇరానీ, జయ బాధురి, ఎల్.విజయలక్ష్మి,రాఖీ, లీనా చంద్రావర్కర్, సులక్షణా పండిట్, మౌసమీ చటర్జీ, యోగీతా బాలీ, అపర్ణా సేన్, షర్మిలా ఠాగూర్ మొదలైన నటీమణుల సరసన నటించాడు. ఇతడు నటించిన షోలే చిత్రంలో ఠాకూర్ పాత్ర ఇతడికి మంచి పేరు తెచ్చిపెట్టింది. నయాదిన్ నయీరాత్ సినిమాలో తొమ్మిది పాత్రలను ధరించాడు. ఈ పాత్రలను తమిళం (నవరాత్రి)లో శివాజీ గణేశన్, తెలుగు (నవరాత్రి)లో అక్కినేని నాగేశ్వరరావు పోషించారు. బాలీవుడ్‌లో ప్రవేశించిన తొలిరోజుల్లో లఘు బడ్జెట్ సి-గ్రేడ్ చిత్రాల్లో నటించాడు. 1965లో 'నిషానా' సినిమాతో హీరో అవతారమెత్తిన సంజీవ్ కుమార్ అచిరకాలంలోనే 'ఖిలోనా' వంటి విభిన్న సినిమాల్లో అద్భుత నటనా వైదుష్యాన్ని చూపి, భవిష్యత్ ప్రస్థానానికి పునాదులు నిర్మించు కున్నాడు. రాజిందర్ సింగ్ బేడి నిర్మించిన 'దస్తక్' సినిమా ఉత్తమ కథానాయకునిగా సంజీవ్ కుమార్‌కు జాతీయ పురస్కారాన్ని అందించింది. తరువాత గుల్జార్ దర్శకత్వం వహించిన 'కోషిష్', 'పరిచయ్' సినిమాలు విభిన్న పాత్రలను ప్రసాదించి సంజీవ్ కుమార్‌లోని అసలు సిసలైన నటుణ్ణి వెలికి తీశాయి. గుల్జార్ పర్యవేక్షణలోనే వచ్చిన 'ఆంధీ', 'మౌసమ్' సినిమాలు సంజీవ్ కుమార్ నట ప్రస్థానాన్ని సుస్థిరం చేశాయి. తరువాత గుల్జార్ దర్శకత్వంలో వచ్చిన 'కోషిష్' సినిమా సంజీవ్ కుమార్‌కు ఉత్తమ నటుడిగా జాతీయ బహుమతి తెచ్చిపెట్టింది. ఇక 'షోలే' సినిమాలో ఠాకూర్ బలదేవ్ సింగ్ పాత్రలో ఆయన ఒదిగిపోయాడు. ఆయనకు పుట్టుకతోనే గుండెలో లోపం వుండేది. అది జన్యుపరంగా సంక్రమించినదే. 1976లో తొలిసారి గుండెపోటు వచ్చినప్పుడు అమెరికాలో బైపాస్ చికిత్స చేయించు కున్నారు. అయితే 1985 నవంబరు 6న సంజీవ్ కుమార్‌కు తీవ్రమైన గుండెపోటు వచ్చింది. దాంతో బ్రతికే అవకాశం లేకుండా



పోయింది. అయితే ఆరోగ్యాన్ని సరిగ్గా పట్టించుకోక 47 సంవత్సరాలకే బ్రహ్మచారిగా మిగిలి తనువు చాలించాడు. గుజరాత్ రాష్ట్రం సూరత్ లో ఒక వీధికి ఇతని స్మృత్యర్థం "సంజీవ్ కుమార్ మార్గ్" అని నామకరణం చేశారు. ఇతనిపేరుతో సూరత్‌లో ఒక పాఠశాల నెలకొల్పారు. 2013, మే 3వ తేదీ భారతప్రభుత్వం ఇతనిపై ఒక తపాలాబిళ్ల విడుదల చేసింది. 14 ఫిబ్రవరి 2014లో ఇతని స్వంత పట్టణం సూరత్‌లో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి, ప్రస్తుత భారత ప్రధాని నరేంద్ర మోడీ 108 కోట్ల విలువైన సమావేశ మందిరాన్ని "సంజీవ్ కుమార్ ఆడిటోరియం" పేరుతో ప్రారంభించాడు. ఇతని పేరుతో "సంజీవ్ కుమార్ ఫౌండేషన్" ఒక జాతీయ స్థాయి సేవా సంస్థ ఏర్పాటు చేయబడింది. ఈ సంస్థ బాలల విద్య, ఆరోగ్య, సాంస్కృతిక అభ్యున్నతికై పనిచేస్తున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**



# త్రైమూర్త్య నిలయం... అశ్వత్థ వృక్షం

కార్తీక మాసంలో ఉసిరి చెట్టును, విజయదశమి రోజున శమీ వృక్షాన్ని పూజించడం సాంప్రదాయం. అలాగే రావిచెట్టును ప్రతి నిత్యం పూజించేవారికి దారిద్ర్యం తొలగిపోతుందని పెద్దల ఉవాచ. మనసులోని కోరికను చెప్పుకుని రావి చెట్టుకు అనునిత్యం ప్రదక్షిణలు చేసి పూజిస్తే కోరిన కోరికలు నెరవేరు తాయని నమ్మకం. సంతానయోగం కలుగు తుందని విశ్వాసం. రావి చెట్టును త్రిమూర్తుల నిలయంగా, పరమ పవిత్రమై నదిగా భావిస్తారు. ఎందుకంటే ఈ చెట్టు కిందనే బుద్ధుడికి జ్ఞానోదయం అయిందని నమ్మకం. కాబట్టి, దీనిని 'బోధి చెట్టు'గా సూచిస్తారు. సంప్రదాయ భారతీయ సాహిత్యం రావి 'వృక్షాన్ని 'అశ్వత్థ' వృక్షంగా వర్ణిస్తుంది. రావి చెట్టును ఋగ్వేదంలో దేవునిగా సూచించబడుతుంది. యజుర్వేదం ప్రకారం ప్రతి యాగములో అత్యం త ప్రామాణిక మైనదిగా పరిగణించ బడుతుంది. అధర్వణ వేదంలో అన్ని దేవతల నివాసంగా వర్ణించ బడింది.

**"మూలతో బ్రహ్మరూపాయ ధృతి విష్ణు రూపిణే, అగ్రతో శివ రూపాయ, వృక్ష రాజాయ నమోనమః అని మంత్రం.**

మహా భారతంలో కృష్ణుడు తనను తాను రావి చెట్టుగా అభివర్ణించినాడు. (వృక్షాలలో నేను అశ్వత్థ వృక్షాన్ని భగవ ద్గీత) అందువల్ల పూర్వ కాలం నుండే రావి చెట్టు ఆరాధన వుంది. దేవాలయాల్లో రావి, వేప చెట్టు కలిసే ఉంటాయి. "రావి" చెట్టుని శ్రీ "మహావిష్ణువు"గానూ, "వేప" చెట్టుని "లక్ష్మీదేవి"గాను భావించాలని శాస్త్రాలు, వేదాలు చెపుతున్నాయి. ఈ జంట వృక్షాలను పూజించి, ప్రదక్షిణం చేయడం ద్వారా అనేక దోషాలు తీరి దంపతు లు పరిపూర్ణ దాంపత్యాన్ని పొందుతారు. రావిచెట్టు దేవతా వృక్షంగా పరిగణించ బడుతోంది. రావిచెట్టు సాక్షాత్తు విష్ణు స్వరూపంగా పూజింప బడుతోంది. ఈ చెట్టుక్రిందే శ్రీ కృష్ణుడు చివరి దశలో ఈ చెట్టు క్రిందే విశ్రమించి వైకుంఠంకు చేరాడు. అందుకే శనివారం మాత్రమే ఆ చెట్టును తాకాలని పండితులు సూచిస్తున్నారు. రావిచెట్టుకు బ్రహ్మదేవునితో కూడా సంబంధం ఉంది. చావు పుట్టుకలు లేని బ్రహ్మదేవుడు మరణించిన వారి ఆత్మలను తనలో కలుపుకునే చెట్టుగా రావి చెట్టు ఉన్నది. రావి చెట్టు కింద కర్మ క్రతువులను జరుపుటకు కూడా కారణం ఇదే. రావి చెట్టు ఎన్నడూ ఒకేసారి ఆకు విడువదు. ఆకులు పడిపోయే కొలదీ కొత్త ఆకులు చిగురిస్తూ నూతన జన్మను తీసుకొంటాయి. ఇది జన్మ, మరణ చక్రం అని సూచిస్తుంది. అందు వలన దీనిని ఆధ్యాత్మిక వాస్తవికతకు సంబంధించిన చెట్టుగా భావిస్తుంటా రు. కొందరి నమ్మకాల ప్రకారం ఈ భూమి మీద ఉన్న ప్రతి రావి చెట్టు ఆకు ఒక ప్రాణంగా చెప్పబడుతున్నది. రావి చెట్టు ఎన్నటికీ చనిపోదు.. అది శాశ్వతంగా ఉంటుంది. దాని శాశ్వత స్వభావం కూడా శాశ్వతాత్మతో సం బంధం కలిగి ఉంటుంది. ఇది శాశ్వతమై, మరణం లేనిదిగా ఉంటుంది. శని దోషం ఉన్న వారు రావిచెట్టుకి పూజ చేయాలి. నమస్కరించి, కౌగిలిం చుకుంటే అనేక దోషాలు పోతాయి. బుద్ధగయ లోని బోధివృక్షం క్రీ.పూ.288 నాటిదని అంచనా వేశారు. (పుష్పించే వృక్షాలలో వయసు అంచనా కట్టబడిన వాటిలో ఇది అత్యంత పురాతనమైనది కావచ్చును). భారత దేశం, నేపాల్, దక్షిణ చైనా, ఇండో చైనా ప్రాం తాలలో ఈ చెట్టు అధికంగా పెరుగు తుంది. పొడి ప్రాంతాలలోనూ, తేమ ప్రాంతాలలోనూ పెరిగే పెద్ద చెట్టు. ఇది సుమారు 30 మీటర్లు ఎత్తు వరకు పెరుగుతుంది. దీని కాండం వ్యాసం 3 మీటర్ల వరకు పెరుగుతుంది. త్రిమూర్త్య నిలయమైన రావిచెట్టు ను కార్తీక మాసంలో పూజించడం సనాతన సంప్రదాయ ఆచారం. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కళాశాలను బతికిస్తున్నారు

మల్యాల: మల్యాల మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాలుగేళ్ల కిందట విద్యార్థుల సంఖ్య 150. ఇందులో తరగతులకు హాజరయ్యేది మాత్రం 50 మందే. ప్రస్తుతం మొదటి సంవత్సరంలో 105 మంది, రెండో సంవత్సరంలో 115 మంది చదువుతున్నారు. ఈ మార్పు వెనక అధ్యాపకులు, ప్రిన్సిపల్ సమష్టి కృషి ఉంది. విద్యార్థుల సంఖ్య తగ్గకుండా, వారు నిత్యం కళాశాలకు హాజరయ్యేలా చూడటంతో పాటు నాణ్యమైన బోధన ఇందుకు దోహదపడింది.

**ఆకలి తీరుస్తూ.. అండగా నిలుస్తూ**

దృశ్య, శ్రవణ విధానంలో బోధిస్తే చాలా కాలం గుర్తుండిపోతుందన్న ఆలోచనతో ప్రిన్సిపల్ శివరామకృష్ణ సొంత డబ్బుతో ప్రొజెక్టర్‌ను కొనుగోలు చేశారు. యానిమేషన్ వీడియోలతో పాఠాలు బోధిస్తున్నారు. ఒక్కో అధ్యాపకుడు 15–20 మంది విద్యార్థులను దత్తత తీసుకొని ప్రతి రోజూ కళాశాలకు హాజరయ్యేలా చూస్తున్నారు. విద్యార్థుల గైర్హాజరు, చదువులో పురోగతిపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు సమాచారం అందిస్తుంటారు.

తల్లిదండ్రులు లేని, పేద విద్యార్థుల చదువుకు మలబార్ గోల్డ్ సంస్థ అందించే ఆర్థిక సాయం కోసం అధ్యాపకులే స్వయంగా దరఖాస్తు చేస్తున్నారు. కళాశాల నుంచి రెండేళ్ల కిందట 42 మంది, గతేడాది



28 మంది విద్యార్థులు రూ.8 వేల నుంచి రూ.10 వేల ఆర్థిక సాయం పొందారు. ఈ సంవత్సరం 32 మంది దరఖాస్తు చేశారు.

వార్షిక పరీక్షల సమయంలో దాతల సాయంతో కళాశాలలో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.

దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థుల రవాణా ఖర్చులను అధ్యాపకులే సమకూరుస్తున్నారు.

విద్యార్థులకు కిచిడీ అందించడానికి ముడి సామగ్రి సమకూర్చడానికి సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు ముందుకొచ్చారు.

పేరెంట్ టీచర్ సమావేశానికి అధ్యాపకులు స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్నారు.

**పాఠాలు గుర్తుండిపోతున్నాయి**

ప్రొజెక్టర్ ద్వారా యానిమేషన్ వీడియోల ద్వారా బోధించే పాఠాలు గుర్తుండిపోతున్నాయి. అధ్యాపకులు వివిధ రకాల బోధనా సామగ్రిని మాతో తయారు చేయించడంతో సబ్జెక్టుపై మరింత అవగాహన పెరుగుతోంది. అధ్యాపకుల ఆర్థిక సాయంతో బల్వంతాపూర్ నుంచి 6 కిలోమీటర్ల దూరంలోని కళాశాలకు వస్తున్నా.

గంగాభవాని, బైపీసీ రెండో సంవత్సరం

**విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ**

ఒక్కో అధ్యాపకుడు 15 నుంచి 20 మంది చొప్పున దత్తత తీసుకున్నాం. గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేస్తాం. కళాశాల జనావాసాలకు దూరంగా ఉండటంతో మధ్యాహ్న భోజనానికి ఇళ్లకు వెళ్తుంటే సమయం వృథా అవుతోంది. సత్యసాయి సేవాట్రస్టు నిర్వాహకులు కిచిడీ అందించడానికి ముందుకొచ్చారు. ఇటీవల మంజూరైన రూ.16 లక్షలతో అవసరమైన వసతులు కల్పిస్తాం.


శివరామకృష్ణ, ప్రిన్సిపల్

# ఆటలకు చోటేది.. పోటీలకు నిధులేవి?

జగిత్యాల : 'క్రీడల అభివృద్ధే లక్ష్యం, క్రీడలతోనే ఆరోగ్యం' ఇవన్నీ వివిధ వేదికలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చెప్పే మాటలు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మైదానాలు, క్రీడా సామగ్రి అంతంతే. నిధుల కేటాయింపు అలసత్వంతో ఆటలకంటూ ఓ పీరియడ్ ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు మరచిపోతున్నారు. దీంతో విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆరోగ్యం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. చాలామందికి క్రీడల్లో ప్రవేశం లేకుండానే విద్యార్థి దశ ముగు స్తోంది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచేందుకు అవకాశం కల్పించే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని క్రీడాకారులు అభ్యర్థిస్తున్నారు.

**బాలబాలికల విభాగాల్లో..**

ఉమ్మడి జిల్లాలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్బాల్, హ్యాండ్‌బాల్, నెట్బాల్, సాఫ్ట్‌బాల్, యోగా, క్రికెట్, అథ్లెటిక్స్ తదితర పోటీలపై ఆసక్తి ఉంది. దీంతో 14 ఏళ్లు, 17 ఏళ్లలోపు బాల, బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల జగిత్యాల జిల్లాలో కథలాపూర్, మెట్పల్లిలో ఖోఖో.. లక్ష్మీపూర్‌లో బాస్కెట్బాల్ పోటీలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించగా.. ఆసక్తి, ప్రాధాన్యత, ప్రాచుర్యం తదితర పరిస్థితులకనుగుణంగా మండలాలను గుర్తించి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. మిగిలిన చదరంగం, టెండికాయిట్, బ్యాడ్మింటన్, ఈత



తదితర క్రీడలకు పెద్దగా పోటీ లేకపోవడంతో ఎంపికలతోనే సరిపెడుతున్నారు. మొత్తం 50 వరకు క్రీడాంశాలుండగా.. ఉమ్మడి జిల్లాలో పోటీలు, ఎంపికలు చేపట్టే క్రీడల సంఖ్యను వేళ్ల మీద లెక్కపెట్టే పరిస్థితులుండటం గమనార్హం.

**దాతలు ముందుకొస్తేనే నిర్వహణ**

జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నుంచి ఎంతోకొంత నిధులు మంజూరవుతుండగా,.. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు పైసా లేకుండా పోతుంది. వీటి నిర్వహణకు రూ.వేలల్లో నిధులు వెచ్చించాల్సి రావడంతో దాతలపై ఆధారపడటం తప్పనిసరిగా మారింది.

ఇటీవల కథలాపూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి 14, 17 ఏళ్లలోపు విభాగంలో బాల, బాలికలకు ఖోఖో పోటీలు నిర్వహిస్తే ఒక్కో విభాగంలో నాలుగు జిల్లాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. 192 మంది క్రీడాకారులు, న్యాయ నిర్ణేతలు, పీడీలు, పీఈటీలు, నిర్వాహకులు కలిపి మొత్తం 250 మందికి భోజనం ఖర్చు రూ.20 వేలు అయింది. సమ దుస్తులు ఒక్కో దానికి రూ.300 చొప్పున రూ.60 వేలు, బహుమతులకు మరో రూ.5 వేలు, నిర్వహణ కోసం టెంట్లు, మైక్, తాగునీరు తదితరాలకు రూ.10 వేలు కలిపి సుమారు రూ.లక్ష వరకు వెచ్చించాల్సి వస్తోంది.

# ఉప్పుడు మిల్లులు.. తప్పుడు నిర్వహణ



నల్గొండ: మిర్యాలగూడలో ఐదేళ్ల క్రితం ఓ మిల్లులో ధాన్యాన్ని పెద్ద బాయిలర్‌లో పోసిన తర్వాత ఒక్కసారిగా ఒత్తిడి పెరిగి పెద్ద శబ్ధంతో పేలింది. ప్రమాద ఘటనలో ఒక కార్మికుడు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఆకాశహార్మ్యాలను తాకే భారీ రైస్‌మిల్లులను నిర్మించిన వ్యాపారులు బాయిలర్ల వినియోగంలో నిర్లక్ష్యం పాటిస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదు. బాయిల్డ్(ఉప్పుడు) మిల్లుల ద్వారా ఇప్పటి వరకు సమీప ప్రభావిత గ్రామాల ప్రజలకు వాయు, జలకాలుష్యం, ధాన్యం ఉడకబెట్టిన వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లేవి. ప్రస్తుతం ధాన్యం మరాడించే సమయం ప్రారంభమైన నేపథ్యంలో యాజమాన్యం బాయిల్డ్ మిల్లుల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిందే. లేకుంటే ఆస్తి, ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉంది.

**నిబంధనలు తూచ్..!**

ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా గరిష్ఠంగా 200 వరకు రైస్ మిల్లులున్నాయి. ప్రతి రెండు నెలలకొకసారి తప్పనిసరిగా బాయిలర్లను సర్వీసింగ్ చేయాలి. కానీ యజమానులు వీటి నిర్వహణను గాలికొదిలేశారనే ఆరోపణలున్నాయి. 'ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్' ఆధ్వర్యంలో ఏడాదిలో ఒకసారి మొక్కుబడిగా తనిఖీలు చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ప్రతీ యజమాని కచ్చితంగా ఐటీఐ పూర్తిచేసిన, బాయిలర్స్ శాఖ గుర్తించిన ఆపరేటర్లను ఏర్పాటు చేసుకోవాలి. 24 గంటలు నడిచే మిల్లులో మాత్రం ఎనిమిది గంటలకో ఆపరేటర్ చొప్పున ముగ్గురిని నియమించాలి. వీరికి ఒక్కొక్కరికి రూ.20వేల జీతం ఇవ్వాల్సి ఉంటుంది. వేతనభత్యాలు భరించలేమనే సాకుతో మిల్లర్లు ఎక్కువగా బిహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి తక్కువ వేతనాలకు వచ్చే కూలీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అధికారికంగా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ అధికారులకు ఐటీఐ నిపుణులను ఏర్పాటు చేసుకున్నాని నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తున్నారని సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా కార్మికుల చేత 12 గంటల పాటు పనిచేయిస్తున్నారు.జిల్లాకు ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. 40 మెట్రిక్ టన్నులు పైబడిన మిల్లులకు ఒక అధికారి, 39 టన్నుల సామర్థ్యం కలిగిన వాటికి మరో ఇన్‌స్పెక్టర్ ఉండాలి. కానీ జిల్లాలో ఒకరు మాత్రమే పనిచేస్తున్నారు.

**తనిఖీలు చేస్తున్నాం** – భీమ్‌రావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్, నల్గొండ

బాయిలర్ ఆపరేటర్లు స్టీమ్, డ్రయర్లను ఆన్ చేసి అక్కడే ఉండి పర్యవేక్షించాలి. కానీ వదిలేసి వెళ్తున్నారు. ధాన్యం ఉడికే సమయంలో తగినంత నీరు లేకపోతే పేలుడు సంభవించే అవకాశం ఉంటుంది. ఏడాదికి ఒకసారి తనిఖీ చేస్తున్నాం. గత ఆరేళ్లల్లో ఒక కేసు కూడా నమోదు కాలేదు. కాలం చెల్లిన బాయిలర్లు తీసివేసి కొత్తవాటిని ఏర్పాటు చేసుకోవాలని మిల్లర్లకు ఆదేశాలు ఇచ్చాం. ఐటీఐ అర్హత కలిగిన ఆపరేటర్లను నియమించుకోవాలి. లేనిపక్షంలో మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

# ఆహారశుద్ధి.. స్వయం సమృద్ధి



జగిత్యాల : ఏడాది పొడవునా కళకళలాడే పంటలు.. అందుబాటులో పారిశ్రామిక, మానవ వనరులు.. ఎగుమతి అవకాశాలు.. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో ఆహారశుద్ధి పరిశ్రమలకు అన్ని విధాలా అనుకూల పరిస్థితులు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై అందించే రుణాలు.. అన్నీ బాగున్నా పరిశ్రమల స్థాపనకు అడుగులు పడటం లేదు..

**రాయితీపై రుణాలు**

ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన, ఎంఎస్ఏఈ, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమలు, టీఐపాస్ పథకాలు అమలు చేస్తున్నాయి. రూ.50 లక్షల నుంచి రుణం పొందవచ్చు. రూ.లక్షకు రూ.35 వేల వరకు రాయితీ ఉంది. రూ.కోటి కంటే ఎక్కువ తీసుకుంటే రూ.10 లక్షల రాయితీ వర్తిస్తుంది. ఉమ్మడి జిల్లాలో వివిధ పథకాల ద్వారా 8 వేల మంది మధ్య, చిన్నతరహా ఆహారశుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేశారు.

**జిల్లాల వారీగా అవకాశాలు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కూరగాయలు, పండ్లు, పప్పు దినుసుల ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలున్నాయి. పప్పుల శుద్ధి, వెజిటేబుల్ డ్రైయింగ్ పరిశ్రమ, జ్యూస్ తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయొచ్చు. పాడి పరిశ్రమ ఆధారంగా పన్నీరు, ఐస్‌క్రీమ్, ఛీజ్, బటర్ మిల్క్ వంటి పాల ఉత్పత్తుల తయారీకి వీలుంది. 70 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

కరీంనగర్‌లో వరి, మొక్కజొన్న, టమాట, మిర్చి ఇతర కూరగాయ పంటలు సాగవుతున్నాయి. మొక్కజొన్న పిండి యూనిట్లు, బేకరీల వినియోగానికి అవసరమయ్యే ఫుడ్ గ్రెయిన్ పిండి యూనిట్లు, కార్న్ ఆయిల్, కార్న్, స్నాక్స్ తదితర పరిశ్రమల స్థాపనకు అనుకూలం. ఎండు మిర్చిని శుభ్రపరిచే యూనిట్లు, మిరప పొడి, పప్పు, కారం, కిచెన్ మసాలా బ్రాండ్ల తయారీ యూనిట్లు స్థాపించవచ్చు. వీటితో లక్ష మందికి పైగా ఉపాధి లభిస్తుంది.

పెద్దపల్లి జిల్లాలో 2.78 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, ఇతర పంటలు సాగవుతున్నాయి. ఏటా 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తోంది. బియ్యం రవ్వ, అటుకులు, పిండి, మరమరాలు, పశువుల దాణా తయారీ పరిశ్రమలకు అవకాశం ఉంది. పెద్దపల్లి, రామగుండం రైల్వే స్టేషన్లతో రవాణా సౌకర్యం అందుబాటులో ఉంది. ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుతో జిల్లాలో ప్రత్యక్షంగా 40 వేలు, మరోక్షంగా మరో 50 వేల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయి.

జగిత్యాలలో వరి, పసుపు, మామిడి, మొక్కజొన్న, పప్పులు సాగవుతున్నాయి. మామిడి జ్యూస్, జామ్, ఫ్రూట్ బేవరీస్, జామ్, సాస్, పచ్చడి ప్యాకింగ్, ఊరగాయ, చట్నీల తయారీకి అవకాశాలున్నాయి. మామిడి ఆధారిత పరిశ్రమలతో ప్రత్యక్షంగా 80 వేల మందికి, పరోక్షంగా 50 వేల మందికి పని దొరుకుతుంది. జిల్లాలో 30 వేల ఎకరాల్లో పసుపు సాగవుతుండగా పాలిషింగ్, పొడి, రంగులు, ఔషధాల పరిశ్రమలకు అవకాశం ఉంది.

**ఇవీ ప్రతిబంధకాలు**

రాయితీ పోగా మిగిలిన మొత్తాన్ని రుణంగా ఇవ్వాల్సి ఉంటుంది. బ్యాంకర్ల కొర్రీలతో చాలా యూనిట్లు గ్రౌండింగ్ కావడం లేదు.

అనుమతుల ప్రక్రియ అత్యంత క్లిష్టంగా ఉండటం పరిశ్రమల ఏర్పాటుకు ప్రతిబంధకంగా మారింది.

నైపుణ్యం.. అవసరం

పరిశ్రమలకు అవసరమైన వసతులు సమకూర్చాలి. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

రైతు, స్వయం సహాయక సంఘాలు, ఎఫ్‌పీవోలకు ముడి సరకుల సరఫరా బాధ్యతలు అప్పగించాలి.

సహకార, ఇతర వాణిజ్య బ్యాంకుల ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు రుణాలివ్వాలి.

**అవగాహన కల్పిస్తున్నాం**

పరిశ్రమల ఏర్పాటు, ప్రభుత్వ రాయితీలపై గ్రామీణాభివృద్ధి శాఖ, లీడ్‌బ్యాంకు ద్వారా మహిళా సంఘాలు, ఎఫ్‌పీవో(రైతు ఉత్పాదక సంస్థ)లకు అవగాహన కల్పిస్తున్నాం. పొలాసలోని ఇంక్యుబేషన్ కేంద్రం ద్వారా ఉప ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నాం. పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేయాలి.వై.యాదగిరి, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్, జగిత్యాల

# వడ్లగూడెం గిరి.. ఆధ్యాత్మిక సిరి

అశ్వారావుపేట : ఆ కొండపై ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. స్వయంభుగా వెలిసిన దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, అనుబంధంగా పలు కోవెలలతో అలరారుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో ప్రకృతి రమణీయ క్షేత్రంగా విలసిల్లుతున్న వడ్లగూడెం భక్తుల కొంగు బంగారంగా నిలుస్తోంది. కార్తిక మాసం, శివరాత్రి సందర్భాల్లో భక్తులతో సందడిగా మారుతోంది.

దమ్మపేట మండలం ముష్టిబండ రెవెన్యూ పరిధిలో వడ్లగూడెం ఉంది. తెలంగాణ కన్నా ఏపీ ప్రాంతవాసులకే అనుబంధం ఎక్కువ. కొండపై దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంతోపాటు గణపతి ఆలయం, నవగ్రహాలు, కనకదుర్గా అమ్మవారి కోవెల, హనుమాన్ ఆలయం, రంగనాథస్వామి ఆశ్రమం, సాయిబాబా గుడి, సత్యనారాయణస్వామి ఆలయం, కల్యాణ మండపాలతో ఆధ్యాత్మిక భవ్యక్షేత్రంగా మారింది. కొండపై నివాస గృహాలే లేవు. ఉన్నవన్నీ ఆలయాలే.

వడ్లగూడెం కొండపై నుంచి చూస్తే ఏపీలోని సీతానగరం, దగ్గర్లోని పామాయిల్ పరిశ్రమ, ఆలయాలు, అటవీ క్షేత్రాలు, ఆయిల్‌పామ్ తోటలు ప్రకృతి రమణీయత ఆకట్టుకుంటోంది.వందేళ్లుగా పూజలందుకుంటున్న స్వయంభు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం 25 ఏళ్లుగా ప్రసిద్ధికెక్కింది. ఏటా కార్తిక మాసం, శివరాత్రికి మూడు రోజులు వేలాదిగా వచ్చే భక్తజనంతో గిరి ప్రాంతం కోలాహలంగా ఉంటుంది. అన్నదానంలో సుమారు 15 వేల నుంచి 20 వేల మంది పాల్గొంటారు. ఆలయ అభివృద్ధికి హాస్యనటుడు బ్రహ్మానందం విరాళాలు ఇచ్చారు. సోమవారం అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు.

సాయిబాబా ఆలయం, రంగనాథస్వామి ఆశ్రమంతో ఆధ్యాత్మిక క్షేత్రానికి కొత్త కళ వచ్చిందంటారు. సత్యనారాయణస్వామి ఆలయ నిర్మాణం కొద్ది నెలల్లో పూర్తి కానుంది. పక్కనే కల్యాణ మండపం పూర్తైతే ఇదొక ఆధ్యాత్మిక క్షేత్రంగా భాసిల్లుతుంది. కొండ దిగువ ప్రదేశంలో కొలను, బోరు ఏర్పాటు చేశారు. ఇన్ని ఆలయాలు ఒకేచోట భక్తులను ఆకర్షిస్తున్నాయి.

# మూడు రోజులైనా.. దొరకని జాడ..!

చింతకాని: చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన సీపీఎం సీనియర్ నేత, రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సామినేని రామారావు హత్య జరిగి మూడు రోజులైనా నిందితుల జాడ పోలీసులకు చిక్కనట్లే తెలుస్తోంది. హత్య సుపారీ గ్యాంగ్ పనే అని పోలీసులు ఇప్పటికే ఒక నిర్ధారణకు వచ్చినా.. ఆ దశగా విచారణ ఒక్క అడుగు కూడా ముందుకు సాగకపోవడం గమనార్హం. ఈ కేసు వారికి ఓ సవాల్‌గా మారింది.

హత్య జరిగిన సమయానికి ముందు, తరువాత సమీపంలోని సెల్ టవర్ సిగ్నల్ ఆధారంగా ఆ ప్రాంతంలో ఉన్న ఫోన్ల జాబితాను సేకరించారు. దానిని జల్లెడపట్టే పనిలో పోలీసులు ఉన్నారు. హత్యపై గ్రామంలో చర్చలూ సాగుతున్నాయి.

హత్యకు రెండు రోజుల ముందు ఓ వ్యక్తి గ్రామంలో సంచరించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. గ్రామంలోని ఓ దుకాణం వద్ద నిందితుడు సిగరెట్ కొనుగోలు చేసినట్లు సమాచారం. హత్యకు రెండు రోజుల ముందు నుంచి గడ్డం, పెద్ద జుట్టుతో ఉన్న ఓ కొత్త వ్యక్తి గ్రామంలో తిరిగాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. హత్య అనంతరం నిందితుడు ముఖానికి జేబు రుమాలును మాస్క్‌లా ధరించి సమీపంలోని బీసీ కాలనీ మీదుగా రైలు కట్టపైపు వెళ్లినట్లు కొందరు పోలీసుల దృష్టికి తెచ్చారు. పోలీసులు ఆ దిశగా విచారణ చేపట్టినా



ఫలితం దక్కలేదు.

గ్రామస్థుడి సహకారం లేకుండా హత్య జరిగే అవకాశం ఉందా..? అన్న చర్చా నడుస్తోంది. రామారావు కదలికలు, ఇంటి మ్యాప్, పక్కనే ఉన్న డాబాపైకి వెళ్లి దాగే విధానం, దాని వెనుక ఉన్న మెట్ల నుంచి హత్య జరిగే ప్రాంతానికి వెళ్లే క్రమం, అనంతరం పెరటి నుంచి నుంచి బీసీ కాలనీ మీదుగా రైలు కట్ట వద్దకు పారిపోయిన క్రమంలో.. స్థానికుడి సహకారం ఉందన్న వాదనా వినిపిస్తోంది.

పాతర్లపాడులో ఇద్దరు ఏసీపీలు, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలతో పాటు చింతకాని, కొణిజర్ల, వైరా పోలీస్ స్టేషన్‌కు చెందిన సివిల్ పోలీసులు, 19 మంది సత్తుపల్లి టీఎస్ఎస్‌పీకి చెందిన బెటాలియన్ సిబ్బంది గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. కేసు పురోగతిపై సీపీ సునీల్‌దత్ ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

# యువతా.. మీరే మేలుకోవాలి

ఖమ్మం : వారి శాఖ పేరులో 'శ్రమ' ఉన్నా తీరులో అదెక్కడా కనిపించదు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని యువత ఉపాధి కల్పనకు దోహదపడే సదవకాశం చేతుల్లో ఉన్నా, చేతల్లో ఎంతమాత్రం చూపటంలేదు. విద్యార్థులు, ఉపాధి దారులు వెతుక్కోవటంలో సోదర శాఖలు అంతోఇంతో తపన పడుతున్నా, ఆ తాపత్రయే జిల్లా పరిశ్రమల శాఖలో కనిపించటం లేదు. దాదాపు ఏడాది వ్యవధిలో డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ) పథకం ద్వారా కేవలం ఇద్దరికే ఉద్యోగాలు చూపగలిగారంటే పనితీరు అర్థం చేసుకోవచ్చు.

**ఏమిటీ డీఈఈటీ**

నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 2024, డిసెంబరు నెలలో డీఈఈటీ పేరుతో వెబ్‌సైట్ ఆవిష్కరించింది. 2019లో ఓ ప్రైవేటు సంస్థ నుంచి ఈ వెబ్‌సైట్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. పరిశ్రమల సహకారంతో పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు వెబ్‌సైట్‌తో పాటు మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. నైపుణ్యవంతులైన నిరక్షరాస్యులు మొదలు పీజీ, పీహెచ్‌డీ విద్యార్హత కలిగిన వారందరూ దరఖాస్తుకు అర్హులే. మొత్తంగా జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగులు, పరిశ్రమలకు మధ్య వారధిలా వెబ్‌సైట్ పనిచేయాలి. క్షేత్ర స్థాయిలో మాత్రం భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**పరిశ్రమల శాఖ ఏం చేయాలి?**

1. యాప్‌పై విద్యార్థుల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ తదితర కాలేజీల్లో సదస్సులు ఏర్పాటు చేయాలి. రిజిస్ట్రేషన్ నమోదులో సహకరించాలి.

2. జిల్లాలోని చిన్న, మధ్యతరహా పరిశ్రమలు డీఈఈటీ గూటికిందకు వచ్చేలా చూడాలి. ఖాళీలను ఎప్పటికప్పుడు తెలియజేసేలా ప్రోత్సహించాలి. 3. ఖాళీల సమాచారాన్ని యువతకు చేరవేసి, ఉద్యోగ కల్పనకు సహకరించాలి.

4. జిల్లా ఉపాధి కల్పన, కార్మిక శాఖలతో కలిసి విస్తృత ప్రచారం చేయాలి. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలను భాగస్వామ్యం చేయాలి.

**ఏం చేశారు?**

కలెక్టర్ చేతుల మీదుగా ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. విద్యార్థులతో కేవలం ఒకటే సమావేశం నిర్వహించి మిన్నకున్నారు. నిర్దేశిత అర్హతలు పరిగణలోకి తీసుకున్నా జిల్లాఓ ఇంకా చాలా పరిశ్రమలు పేర్లు నమోదు చేసుకోలేదు. వారితో సమావేశాలు నిర్వహించి, ప్రోత్సహించే ప్రయత్నమే కరవైంది.

పది నెలలు దాటినా రెండే కొలువులు చూపగలిగారు. సమాచారం చేరవేయటం అటుంచి ఈ వైఫల్యంపై సమీక్షించుకున్న దాఖలాలే లేవు.వెబ్‌సైట్‌ను నిరుద్యోగ యువత, విద్యార్థుల్లోకి తీసుకెళ్లే ప్రయత్నమే లేదు. జనరల్ మేనేజర్ పోస్టు ఇన్‌ఛార్జి బాధ్యతలు కావటం, కిందిస్థాయి ఉద్యోగులకు పూర్తిస్థాయి అవగాహన లేకపోవటంతో ఆసక్తి కరవైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా మార్గదర్శకం కరవైంది.

'విద్యా సంస్థలతో కలిసి అవగాహన సమావేశం నిర్వహించాం. విద్యా సంస్థలకు వెళ్లి సదస్సులు నిర్వహించాలన్నా, విస్తృత ప్రచారం చేయాలన్నా నిధులలేమి ఆటంకంగా మారింది.'

జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు

జిల్లాలో డీఈఈటీ వెబ్‌సైట్‌లో నమోదైన నిరుద్యోగులు: 5,866

నమోదైన పరిశ్రమలు: 33

ఇప్పటివరకు కల్పించిన ఉద్యోగాలు: 2

ప్రస్తుతం ఉద్యోగ ఖాళీలు: 50

గురువారం 6 నవంబర్ 2025

# అ'విశ్రాంత' నిరీక్షణ

మేడిపల్లి మండలంలో అయిదు నెలల క్రితం ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు తనకు రూ.35 లక్షల వరకు ప్రయోజనాలు వస్తాయని భావించారు. కారు, గృహ రుణాలకు సంబంధించిన ఈఎంఐలను ఒకేసారి చెల్లించి కూతురు పెళ్లి చేద్దామని ప్రణాళికలు వేసుకున్నారు. ఇప్పటికీ ప్రయోజనాలు అందక, కొద్దిపాటి అప్పులు తీరక ఆవేదన చెందుతున్నారు.

కోరుట్లలో విద్యుత్తు శాఖలో పని చేస్తున్న ఉద్యోగి రెండు నెలల్లో విరమణ పొందనున్నారు. 20 నెలల కిందట ఉద్యోగ విరమణ చేసిన వారికి ఇప్పటికీ ప్రయోజనాలు రావడం లేదనీ, తనకూ అలాగే అందవేమోనని దిగులు చెందుతున్నారు. రిటైర్మెంట్ అనంతరం కొన్నాళ్లపాటు అమెరికాలోని కుమారుడి వద్దకు వెళ్దామంటే రావాల్సిన ప్రయోజనాలు నిలిచిపోతాయేమోనన్న మీమాంసలో ఉన్నారు.

న్యూస్‌టుడే, మేడిపల్లి(జగిత్యాల): ఉద్యోగ విధుల నుంచి తప్పుకున్నాక వచ్చే ఆర్థిక ప్రయోజనాలు విశ్రాంత జీవనంలో ఆసరాగా నిలుస్తాయనుకుంటే నిరాశే మిగులుతోంది. వాటి కోసం ఎదురుచూసే వారి సంఖ్య పెరుగుతోంది. పిల్లల పెళ్లిళ్లు, ఇతర అవసరాల కోసం చేతికందాల్సిన సొమ్ము అందక విశ్రాంత ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వం రిటైర్మెంట్ వయసు 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. వయో పరిమితి పెంపుతో రాష్ట్రంలో 2021 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉద్యోగ విరమణలు ఆగిపోయాయి. తిరిగి ప్రారంభమయ్యాక గత 19 నెలల్లో జగిత్యాల జిల్లాలో 672 మంది ఉద్యోగ విరమణ పొందారు. రోజుకు సరాసరి ఒకరు చొప్పున రిటైర్ అవుతున్నారు. వీరిలో క్యాడర్‌ను బట్టి ఒక్కో విశ్రాంత ఉద్యోగికి రూ.30 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు నగదు ప్రయోజనాలు అందాల్సి ఉంది. ఈ లెక్కన రూ.200 కోట్ల నుంచి రూ.530 కోట్ల వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.



**న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్న బాధితులు**

ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వంతో చర్చలు జరిపిన నేపథ్యంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్ డబ్బులు కొంత మొత్తంలో జమ చేశారని ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. రిటైర్మెంట్ ప్రయోజనాల చెల్లింపు కోసం కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నగదు రహిత వైద్య సేవలందడం లేదనీ, ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ ప్రయోజనాలు రావడం లేదని విశ్రాంత ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

రావాల్సిన ప్రయోజనాలు (రూ.లక్షల్లో)

కమ్యూటేషన్: 7 నుంచి 15

జీపీఎఫ్: 10 నుంచి 12

గ్రాట్యుటీ: 10

ఫైనల్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్: 3 నుంచి 5

ప్రభుత్వ జీవిత బీమా (టీజీఎల్ఐసి): 5

గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీం (జీఐఎస్): రూ.20 వేలు

**17న కుటుంబాలతో మహాధర్నా**

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఉద్యమాలు చేసే దుస్థితి నెలకొంది. ఈ నెల 10లోగా విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనాలు అందించాలి. లేదంటే 17న ఉద్యోగుల కుటుంబసభ్యులతో కలసి మహాధర్నా నిర్వహిస్తాం. సొమ్ము సకాలంలో రాకపోవడంతో అప్పులు కట్టలేక, పెళ్లిళ్లు చేయలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. హరి అశోక్‌కుమార్, పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ కార్యదర్శి

# నాణ్యత లేమి.. తనిఖీలు మాని..!

భానుపురి : ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆహారశాలలపై తనిఖీలు నామమాత్రం అవుతున్నాయి. మరోవైపు వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరించి రంగులు, టేస్టింగ్ సాల్ట్‌ను కలుపుతున్నారు. శుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. ఇది ప్రజారోగ్యం పాలిట శాపంగా మారుతోంది. ఇష్టమొచ్చినట్లు కల్తీ వ్యాపారం చేస్తున్నా ఆహార తనిఖీ విభాగం అధికారులు(ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు) పట్టించుకోవటం లేదు. వారి నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఫిర్యాదు చేస్తేనే దాడులు..** ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 263 ఆహారశాలలపై దాడులు నిర్వహించారు. 52 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయగా, 133 ఆహారశాలలకు జరిమానా విధించా రు. అడపాదడపా తనిఖీలు చేపట్టడంతో ఆహారశాలల నిర్వాహకులు నాణ్యత పాటించడం లేదు. పుర అధికారులే ఎవరైనా ఫిర్యాదు చేసే వాటిపై దాడులు జరిపి జరిమానా విధిస్తున్నారు. కానీ ఆహార తనిఖీ విభాగం అధికారులు ఎవరూ తమకు తాము స్పందించడం లేదు. **వేధిస్తున్న ఖాళీలు** సిబ్బంది కొరత కారణంగా అధికారుల తనిఖీలు మొక్కుబడిగా మారాయి. జిల్లాకు ఇన్‌ఛార్జి అధికారులను నియమించడం వల్ల పనిభారంతో చర్యలు తీసుకొనే పరిస్థితి ఉండటం లేదు. వాస్తవానికి ఫుడ్‌సేఫ్టీ అధికారి ప్రతి నెలా ఆయా హోటళ్లు, దాబాలు, కిరాణా దుకాణాల్లో తరచూ తనిఖీలు నిర్వహించి 12 వరకు నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించాలి. కానీ ఉమ్మడి నల్గొడ జిల్లాలో అలా జరగటం లేదు. **కఠినంగా వ్యవహరిస్తాం**- జ్యోతిర్మయి, ఫుడ్ కంట్రోల్ అధికారిణి, నల్గొండ ఇక నుంచి ఉమ్మడి జిల్లాలో ఆహారశాలలపై తనిఖీలు ముమ్మరం చేస్తాం.

# కేసులు తేలట్లే.. దస్త్రాలు కనిపించట్లే!

హైదరాబాద్ : నగరంలో బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ నుంచి.. కేసు దర్యాప్తు పూర్తిచేయటం పోలీసులకు సవాల్‌గా మారింది. మెగాసిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీస్‌స్టేషన్లు పెంచారు. దానికి తగినట్టు సిబ్బందిని కేటాయించక పోవటంతో ఇబ్బందిగా మారింది. 700-800 మంది ఏఆర్ పోలీసులకు శిక్షణనిచ్చి శాంతిభద్రతల విభాగంలో కొనసాగిస్తున్నారు.

**బదిలీలతో సమస్య జటిలం**

ఉన్నతాధికారులు మారినప్పుడల్లా క్షేత్రస్థాయిలో సిబ్బంది బదిలీలతో సమస్య జటిలమవుతోంది. స్థానికంగా అవగాహన వచ్చి దర్యాప్తుపై దృష్టి సారించేలోపు స్థానచలనం తప్పట్లేదంటూ ఒక ఇన్‌స్పెక్టర్ ఆవేదన వెలిబుచ్చారు. పండగలు, ఉత్సవాలు, ఊరేగింపులు, ప్రముఖుల బందోబస్తులో సగకాలం పూర్తవుతుందని.. మిగిలిన సమయంలో కేసు పురోగతి పరిశీలించేలోపుగానే మరో బాధ్యతలు అప్పగించటమో, బదిలీపై వెళ్లటమో జరుగుతోంది. దాని ప్రభావం దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణపై పడుతోంది. తాజాగా నగరంలోని ఒక డీసీపీ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అక్కడ దస్త్రాలన్నీ చిందరవందరగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. వాటిలో పాత దస్త్రాలు ఎన్ని మాయమయ్యాయనేది గుర్తించటం కష్టమేనంటూ పోలీసు అధికారి ఆందోళన వెలిబుచ్చారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా సిబ్బంది లేకపోవటంతో ఒత్తిడి పెరుగుతోంది. అదనంగా 2-3వేల మందిని తీసుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు సమాచారం.



# ఏ'మండీ'.. పట్టించుకోరు!



హైదరాబాద్ : రెండు దశాబ్దాల తర్వాత జియాగూడ కబేళా ఆధునికీకరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రభుత్వ నిధులతోనే ప్రాజెక్టును చేపట్టాలని ఏడు నెలల కిందట సర్కారు జీహెచ్ఎంసీని ఆదేశించింది. అప్పట్నుంచి కమిషనర్ కార్యాలయంలో దాదాపు పదిసార్లు కబేళా పనులు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించగా.. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. నమూనా రూపొందించడం తమ వల్ల కాదంటూ సీనియర్ ఇంజినీర్లు చేతులెత్తేస్తున్నారు. టెండరు ప్రక్రియను ఎప్పటికప్పుడు వాయిదా వేస్తున్నారు.

**రోడ్డుపై నడవలేని దుస్థితి..**పురానాపూల్ వద్ద మూసీ నది ఒడ్డున సుమారు 9 ఎకరాల విస్తీర్ణంలో జియాగూడ మేకలమండీ ఉంది. మాంసం వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, కబేళా కార్మికులు, ఇతరత్రా కలిపి 5వేల మంది ఉపాధి పొందుతుంటారని అంచనా. నగరంలో ఉపయోగించే మాంసంలో 80శాతం జియాగూడ కబేళా నుంచి సరఫరా అయ్యేదే. క్రయ విక్రయాలతోపాటు జంతువులను పెద్దసంఖ్యలో వధించే కబేళా వల్ల.. మేకలమండీ దుర్వాసనతో నిండిపోతుంది. టన్నుల కొద్దీ మాంసం వ్యర్థాలు, చెత్త రోడ్లను ముంచెత్తుతుంది. మధ్యాహ్నం 12గంటల వరకు వ్యర్థాల తరలింపు జరుగుతూనే ఉంటుందని, అప్పటి వరకు..అటువైపు వెళ్లాలంటేనే.. భయపడాల్సిన పరిస్థితి.

**కమిషనర్ ఆగ్రహం..**

సీనియర్ ఇంజినీరు భాస్కర్‌రెడ్డి ముఖ్య ఇంజినీరుగా జీహెచ్ఎంసీలో సుమారు 20 మంది సీనియర్ ఇంజినీర్లతో ప్రాజెక్టుల విభాగం ఏర్పాటైంది. సీఎం ఏడాది కిందట శంకుస్థాపన చేసిన రూ.7వేల కోట్ల ప్రాజెక్టులు (పైవంతెనలు, రోడ్ల విస్తరణ), జియాగూడ కబేళా, ఇతరత్రా పనులన్నీ ఆయన పరిధిలోనే ఉన్నాయి. కానీ.. వాటిలో ఏ ఒక్క పనికూడా ఇప్పటి వరకు పట్టాలెక్కలేదు. జియాగూడ కబేళా పనులకు గత సర్కారు హయాంలోనే అభివృద్ధి ప్రణాళిక తయారైందని, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా, కొత్త డిజైన్లను రూపొందించకుండా ఇంజినీర్లు కాలయాపన చేస్తున్నారనే విమర్శలున్నాయి. తాజాగా కమిషనర్ ఆర్వీ.కర్ణన్ ఇంజినీర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వారం.. ప్రత్యేక పారిశుద్ధ్యం



పెద్దపల్లి : పల్లెలు సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. సీజనల్ వ్యాధుల కట్టడి, పరిసరాల పరిశుభ్రత పెంపు, ఆదాయ ఆర్జన వంటి అంశాలు మెరుగు పరిచేందుకు ఈ నెల 3 నుంచి 11 వరకు వారం రోజులు అధికారులు పల్లెబాట పట్టనున్నారు. సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కరించనున్నారు. ఈ విషయం పల్లెలకు కొంత ఊరటనిచ్చినప్పటికీ.. నిధులు కేటాయిస్తే మరింత ప్రయోజనం కలగనుంది. **నిధులపై ఆందోళన**గ్రామపంచాయతీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిత్యం అమలుకు నిధుల సమస్య వెంటాడుతోంది. పాలకవర్గాలు లేకపోవడంతో మంజూరులో నిరాశే ఎదురవుతోంది. నెలల తరబడి ఈ సమస్య ఉండటంతో ప్రతి చిన్న పనికి దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలకు మరమ్మతు పనులు చేసినా నిధులు విడుదల కాలేదు. డీజిల్‌కు డబ్బులు లేక చాలా చోట్ల ట్రాక్టర్లు మూలనపడి ఉన్నాయి. ప్రత్యేక నిధులు కేటాయిస్తేనే కార్యక్రమం లక్ష్యం ఫలిస్తోంది.

**రోజువారీ కార్యక్రమాలు ఇలా..**

ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించి.. ట్రాక్టర్లలో డంపింగ్‌యార్డుకు తరలించటం. సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డు నిర్వహణ పరిశీలించనున్నారు. మాంసాహారం విక్రయించే దుకాణాలు నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధించటం.

ఖాళీ స్థలాల్లోని ప్లాస్టిక్ వస్తువులు, వ్యర్థాలు, పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు తొలగింపు.. స్వశానవాటిక శుభ్రం చేయటం.

మురుగు కాలువలు, పల్లె ప్రకృతి వనం, క్రీడామైదానాల్లో స్వచ్ఛత చర్యలు. తాగునీటి పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు. వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కల్లో చనిపోయిన వాటి స్థానంలో కొత్తవి నాటడం. శతశాతం ఇంటి పన్ను వసూళ్లకు కృషి చేయటం.. నెలాఖరులోపు ఆన్‌లైన్‌లో పొందుపరచటంపై అవగాహన కల్పించటం.**అన్ని రకాల పౌరసేవలు సకాలంలో పూర్తి చేయటం.**

ఆన్‌లైన్‌లో లేని వాణిజ్య దుకాణాలకు నోటీసులు జారీ చేసి పునరుద్ధరించటం. 15లోపు లైసెన్స్ ఫీజులు ఆన్‌లైన్‌లో పొందుపరచటం.విద్యుత్తు సమస్యలను గుర్తించి.. సరిచేయటం. శిథిలావస్థ స్తంభాలను తొలగించటం. త్రీ ఫేజ్ సమస్యల పరిష్కారానికి కృషి.

# ఏమైంది.. యువ వికాసం..?

నల్గొండ : యువత స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం అమలుపై ప్రభుత్వం నుంచి స్పష్టత కరవైంది. దరఖాస్తులు సమర్పించి ఆరు నెలలు పూర్తవుతున్నా.. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో యువతలో నిరుత్సాహం కనిపిస్తోంది. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాయితీ రుణాల మంజూరు పత్రాలను పంపిణీ చేయాల్సి ఉండగా.. ఆఖరి క్షణంలో ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. రాయితీ రుణాల పంపిణీపై సందిగ్ధత నెలకొనడంతో దరఖాస్తుదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. యువ వికాసం పథకానికి జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ సామాజిక వర్గాల నుంచి మొత్తం 79,493 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రాయితీ రుణాల మంజూరుకు ప్రణాళికలు రూపొందించడంతో చాలా మంది రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల యూనిట్లకే ప్రాధాన్యమిచ్చారు. దరఖాస్తులను ఆయా పంచాయతీలు, మున్సిపాలిటీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్, రుణ బకాయిలను తనిఖీ చేసి ఇచ్చిన నివేదికలు, స్థానిక ఎమ్మెల్యేలు సూచించిన జాబితా ఆధారంగా మండల, జిల్లా స్థాయి కమిటీలు లబ్ధిదారుల ఎంపిక కసరత్తు చేశారు. ఎంపిక ప్రక్రియను నిలిపివేయాలని జిల్లా అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో రుణాల మంజూరుకు బ్రేక్ పడింది. వచ్చిన దరఖాస్తుల్లో ముందుగా రూ.50 వేలు, రూ.లక్ష యూనిట్లను ఇచ్చేందుకు ప్రణాళిక చేశారు. ప్రారంభంలో వెయ్యి యూనిట్లను ఇచ్చేందుకు జాబితాను సిద్ధం చేశారు. తర్వాత ప్రభుత్వం వాయిదా వేయడంతో జాబితా పక్కన పెట్టారు. పథకంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అన్ని కులాల నిరుద్యోగులు ప్రభుత్వం ఏం చేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

# కలుషిత ముప్పు.. కలగాలి కనువిప్పు

సూర్యాపేట : ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తుండటంతో చలికాలం వానాకాలన్ని తలపిస్తోంది. పొద్దున ఎండ, సాయంత్రం వర్షం కురవడం.. వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకోవడంతో ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం జిల్లాలో మిషన్ భగీరథ పథకంతో పాటు స్థానిక సంస్థల ద్వారా చాలా గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. జలాశయాలు, ట్యాంకులు, నల్లాల వద్ద నీటి నమూనాలను సేకరించి తప్పనిసరిగా పరీక్షలు చేయాల్సి ఉంది. నాణ్యత లోపించినట్లు నిర్ధారణ జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలి. గ్రామాల నుంచి నగరాల వరకు అనేక చోట్ల ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రజా కుళాయిల నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. నీటి నాణ్యత, పర్యవేక్షణ విషయాన్ని అధికారులు పూర్తిగా మరిచారన్న విమర్శలున్నాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

గ్రామ పంచాయతీ సంబంధిత సిబ్బందితో ఏటా నీటి నాణ్యత నిర్ధారణ



పరీక్షలు చేయాలి.గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ అధికారులు పరీక్షలు నిర్వహించాలి.

నీటి ట్యాంకులను శుభ్రం చేయాలి. వివరాలు నమోదు చేయాలి.

ఫిల్టర్ బెడ్‌లు, గృహాల వద్ద ఉండే నల్లాల నుంచి నమూనాలు సేకరించాలి.మంచినీటిని సరఫరా చేసే పైపులకు లీకేజీ సమస్యలు ఉంటే తక్షణ మరమ్మతు చేపట్టాలి.ప్రతిరోజు క్లోరిన్ కిట్లద్వారా నీటి పరీక్షలు నిర్వహించాలి.నీరు కలుషితం కాకుండా చర్యలు

యాదగిరి, జిల్లా పంచాయతీ అధికారి గ్రామాల్లో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రణాళిక రూపొందించి స్థానిక నీటి వనరుల్లో పరీక్షలు చేయడం, ట్యాంకులను శుభ్రం చేయించడం, క్లోరినేషన్ వంటి ప్రక్రియ చేపట్టనున్నాం. అన్ని పంచాయతీల్లో బ్లీచింగ్, ఇతర రసాయాలను సిద్ధంగా ఉంచాం. పైపులైన్లకు లీకేజీ ఏర్పడిన వెంటనే గ్రామపంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బంది సమన్వయంతో మరమ్మతులు చేస్తున్నాం.

# శునకం వణికిస్తోంది..!

సూర్యాపేట : రోజురోజుకూ వీధి కుక్కలు పెరుగుతున్నా.. వాటి సంతతి నియంత్రణపై సంబంధిత అధికారులు దృష్టిసారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎక్కడో ఒకచోట వీటి బారినపడి బాధితులు చికిత్స పొందుతూనే ఉన్నారు. వీటి సంతతి పెరగకుండా చర్యలు చేపట్టాలని రెండేళ్ల క్రితం హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. క్షేత్రస్థాయిలో అధికారులు నేటికీ సరైన చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో కుక్కకాటు బాధితులు ఏటా పెరుగుతున్నారు. శునకాల నియంత్రణ విషయంలో అధికారులు ప్రణాళిక ప్రకారం వ్యవహరించక పోవడంతో నానాటికీ వీటి బారిన పడుతున్న వారు అధికమవుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు 32,168 మంది శునకాల బారిన పడి గాయాలపాలయ్యారు. ఎవరూ మృత్యువాత పడలేదు. ఈ లెక్కన చూసుకుంటే నల్గొండ జిల్లాలో రోజుకు 55 మంది, సూర్యాపేట-57, యాదాద్రి జిల్లాలో 4 చొప్పున గాయపడుతున్నారు. చిన్నారుల నుంచి వృద్ధులపై ఎక్కడో ఒకచోట వీధి కుక్కలు దాడులు చేస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు సూర్యాపేట జిల్లాలో అధికంగా బాధితులు ఉన్నారు. వీధి కుక్కల నియంత్రణ విషయంలో చర్యలు చేపట్టాలని కోర్టులు ఆదేశాలు జారీ చేస్తున్నా.. చాలాచోట్ల అమలు కావడం లేదు.



సంతతి పెరగకుండా శునకాలకు చికిత్స చేయాల్సి ఉండగా.. కొన్ని రోజులకే పరిమితమవుతోంది. కొన్ని శునకాలకు చికిత్స చేసి మిగతా వాటిని వదిలేస్తున్నారు.వీధుల్లో గుంపులుగా ఉంటున్న కుక్కలు ఒంటరిగా వెళుతున్న చిన్నారులపై దాడులు చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. ఈ కారణంగా చిన్నారులను ఒంటరిగా బయటకు పంపాలంటే వారి కుటుంబ సభ్యులు జంకాల్సిన పరిస్థితి నెలకొంది. మాంసం విక్రయదారులు ఇష్టారాజ్యంగా వ్యర్థాలను పడేయడంతో వాటిని తినేందుకు కుక్కలు రోడ్లపై గుంపులుగా చేరుతున్నాయి. ఆ మార్గంలో ద్విచక్ర వాహనదారులు వెళితే వెంటపడుతున్నాయి. వీటి బారినుంచి రక్షించుకునే క్రమంలో వాహనాలు అదుపుతప్పి ఎంతోమంది గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి.

రాత్రి సమయంలో గుంపులుగా స్వైర విహారం చేస్తున్న శునకాలు ఆ మార్గంలో ఎవరైనా వస్తే దాడులకు పాల్పడుతున్నాయి. రాత్రి సమయంలో వీధుల్లో ఒంటరిగా కాలినడకన వెళ్లలేని దుస్థితి నెలకొంటోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణాల్లో కుక్కల సంతతి పెరగకుండా చర్యలు తీసుకుంటామని పుర అధికారులుకు తెలిపారు.

చురకలు



# డిజిటల్‌మయం.. అవగాహనే ముఖ్యం

నిర్మల్ :కోటపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి రూ.500తో డీటీహెచ్ రీఛార్జి చేసుకున్నారు. ఎంతసేపు ఎదురుచూసినా పేమెంట్ పెండింగ్ అని వస్తోంది. తీరా ఖాతాలో చూస్తే సొమ్ము చెల్లించినట్లు చూపిస్తోంది. రీఛార్జి మాత్రం పూర్తవలేదు.

చెన్నూరు పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో ఇటీవల ఇద్దరు వ్యక్తులు వచ్చి రూ.5 వేల దుస్తులు కొనుగోలు చేశారు. చరవాణి ద్వారా చెల్లింపులు చేసి వెళ్లిపోయారు. తీరా దుకాణదారు ఖాతాలో చూసుకుంటే డబ్బు జమకాలేదు. సీసీ కెమెరా ఆధారంగా పోలీసులు ఆరా తీసి, సదరు వ్యక్తులను గుర్తించి వారికి విషయాన్ని చెప్పి తిరిగి డబ్బులు తీసుకోవాల్సి వచ్చింది.

న్యూస్‌టుడే, చెన్నూరు: ప్రస్తుతం మారుమూల పల్లెల్లోనూ డిజిటల్ చెల్లింపులు పెరిగాయి. స్మార్ట్ ఫోన్లు, అంతర్జాల సేవలు చౌకగా అందుబాటులోకి రావడంతో ప్రజలు త్వరగా ఆన్‌లైన్ లావాదేవీలకు అలవాటు పడ్డారు. బ్యాంకులు ప్రత్యేక యాప్‌లు అందుబాటులోకి తీసుకొచ్చాయి. కాకపోతే కొన్ని సాంకేతిక సమస్యలతో చెల్లింపుల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు వినియోగదారులను వ్యాపారులను అయోమయానికి గురిచేస్తున్నాయి.

**అప్రమత్తత అవసరం**



లావాదేవీలు విఫలమైన సమయంలో వచ్చే సందేశాలను పూర్తిగా చదివితే సమస్య అర్థమవుతోంది. పల్లెల్లో చాలా మందికి ఆంగ్ల భాషలో వచ్చే సందేశాలు చదవడం, అర్థం చేసుకోవడం రాదు. సాంకేతిక సమస్యలపై ఫిర్యాదు చేయడానికి ప్రతీ యూపీఐ యాప్‌లో దిగువన సపోర్ట్ అండ్ హెల్ప్ అనే ఆప్షన్ ఉంటుంది. దాన్ని ఎంపిక చేసుకోగానే ఫిర్యాదు స్వీకరిస్తుంది. లావాదేవీల వివరాలు, తలెత్తిన సమస్యను నమోదు చేస్తే మూడు రోజుల్లో నగదు ఖాతాలో జమవుతుంది. యాప్‌లో కస్టమర్ కేర్ నంబర్ల కోసం ఆన్‌లైన్‌లో వెతికితే సైబర్ నేరగాళ్ల వలలో పడే ప్రమాదం ఉంది.

**నగదు పోతే ఫిర్యాదు చేయాలి**

సాధారణంగా యాప్‌ల ద్వారా లావాదేవీలు విఫలమైనప్పుడు ఖాతా నుంచి వెళ్లిపోయిన సొమ్ము తిరిగి రావడానికి 27 నుంచి 72 గంటల సమయం పడుతుంది. అలా జరగని పక్షంలో నేరుగా సంబంధిత బ్యాంకుకు వెళ్లి లిఖితపూర్వక ఫిర్యాదు చేయాలి. వారంలో పరిష్కారం కాకుంటే ఆయా బ్యాంకుల అంబుడ్స్‌మెన్లకు ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తారు.


**కారణాలివి** ఆన్‌లైన్ చెల్లింపులకు అంతరాయం లేని అంతర్జాల సేవలు ఉన్నప్పుడే యాప్‌లు సమర్థంగా పనిచేస్తాయి. మధ్యలో అంతర్జాల వేగం తగ్గినా, పూర్తిగా ఆగిపోయినా విఫలమవుతుంటాయి. పేమెంట్ యాప్ ఏదైనా కేవలం బ్యాంకులు, ఖాతాదారుల మధ్య వారధిగా పనిచేస్తుంది. చెల్లింపులు జరిగే సమయంలో రెండు బ్యాంకుల సర్వర్లు సరిగా పనిచేస్తేనే పేమెంట్ సాఫీగా పూర్తవుతుంది. సర్వర్, నెట్‌వర్క్‌లో అంతరాయం ఏర్పడితే చెల్లింపులు నిలిచిపోతాయి.

# భూ రక్షణ.. సంపద సృష్టి..

నిర్మల్ : ప్రస్తుత రోజుల్లో భూముల ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నారు. అలాంటి సర్కారు భూముల రక్షణకు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. నీటిపారుదలకు సంబంధించిన వాటిని సంరక్షించాలని నిర్ణయించి శాఖ అధికారులను సంప్రదించారు. ఇందుకోసం కడెం, సోన్ మండలాల్లో ఉన్న వాటిని శాఖకు కేటాయించారు. రెండేళ్ల క్రితం ఆ చోట్లలో మొక్కలు నాటగా ప్రస్తుతం ఏపుగా పెరిగి పచ్చదనంతో అలరారుతోంది.

**ఆదాయ వనరుగా..**

కడెం మండల కేంద్రంలో అయిదు ఎకరాలు, సోన్ మండలం సాకెరలో



రెండు ఎకరాల భూమిని నీటిపారుదల శాఖ అధికారులు డీఆర్డీవోకు కేటాయించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రెండేళ్ల క్రితం ఉసిరి, జామ, సీతాఫలం, మునగ, వెదురు, మామిడి, నిమ్మ, టేకు, అరటి తదితర మొక్కలు నాటారు. రెండు చోట్ల కలిపి మొత్తం 5వేల మొక్కలు ఏర్పాటు చేశారు. ఇందుకు ఇప్పటి వరకు రూ. 25 లక్షల వరకు వ్యయం చేశారు. వీటి నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీ కార్యదర్శులతోపాటు, ఒక వాచ్‌మెన్, ఇతరత్రా పనులను ఉపాధి కూలీలతో చేయిస్తున్నారు. రెండేళ్లలోనే ప్రస్తుతం జామకాయలు చెట్లకు విరివిగా కాశాయి. పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖల ఇంజినీరింగ్ అధికారుల సౌజన్యంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. నాటిన మొక్కలను కంటికి రెప్పలా కాపాడటంతో 99 శాతం బతికాయి. వాటిని విక్రయించగా వచ్చే ఆదాయాన్ని పంచాయతీలకు సమకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ విషయమై డీఆర్డీవో విజయలక్ష్మిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. విలువైన భూముల రక్షణతోపాటు పంచాయతీలకు ఆర్థిక తోడ్పాటునందించాలన్న ప్రధాన ఉద్దేశంతో 'సంపద వనాలు' పేరిట వీటిని ఏర్పాటు చేశామని చెప్పారు.

# ఆగేవి తక్కువ.. ప్రయాణికులు ఎక్కువ



గోదావరిఖని : పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రామగుండం ప్రాంత రైల్వే ప్రయాణికులకు సరిపడా రైళ్లు అందుబాటులో లేవు. ఢిల్లీ ప్రధాన రైలు మార్గంలో కీలకమైన రామగుండం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా రైళ్ల నిలుపుదల లేకపోవడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సిమెంట్ ఫ్యాక్టరీల్లో పనిచేసే ఉద్యోగులు చాలా మంది వివిధ రాష్ట్రాలకు చెందిన వారున్నారు. దీంతో పాటు వ్యాపారులు కూడా ఇతర రాష్ట్రాలకు చెందిన వారున్నారు. వారికి అనుగుణంగా సూపర్‌ఫాస్టు రైళ్లను నిలపాలని చాలా కాలంగా డిమాండ్ ఉన్నా రైల్వే అధికారులు స్పందించడం లేదు. రామగుండం రైల్వే స్టేషన్ నుంచి రోజుకు 94 రైళ్లు ప్రయాణిస్తుంటాయి. కేవలం 35 రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. ఇందులో కొన్ని వీక్లీకి ఉన్నాయి. రోజు వారీగా నడిచే సూపర్‌ఫాస్టు, ఎక్స్‌ప్రెస్‌లు కొన్నింటికి మాత్రమే హాల్టింగ్ ఉంది.

**ఆదాయం అధికమే**

రామగుండం రైల్వే స్టేషన్ నుంచి రోజు 1500 మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తున్నారు. రోజు రూ.3 లక్షల వరకు ప్రయాణికుల ద్వారా ఆదాయం వస్తుంది. మరిన్ని రైళ్లను ఆపితే ఆదాయం పెరిగే అవకాశం ఉంది. కొవిడ్ సమయంలో రద్దు చేసిన కొన్ని రైళ్లను ఇటీవల పునరుద్ధరించారు. కాజీపేట-బల్లార్ష మార్గంలో అతిపెద్ద రైల్వేస్టేషన్లలో రామగుండం ఒకటి.

**అందుబాటులోకి రాని సూపర్‌ఫాస్టులు**

రామగుండం రైల్వేస్టేషన్‌లో సూపర్‌ఫాస్టు రైళ్లను నిలపడం ద్వారా ప్రయాణికులకు మరింత సౌకర్యం ఉంటుంది. ప్రస్తుతం నడుస్తున్న బల్లార్ష నుంచి కాజీపేట వరకు ఉన్న రైలును సికింద్రాబాద్ వరకు పొడిగించాలని కోరుతున్నారు. తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు ఇక్కడి నుంచి చాలా తక్కువ సౌకర్యం ఉంది. కాగజ్‌నగర్ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

డిమాండ్ ఉన్న రైళ్లు

స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్

గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ మిలినీయం సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్

గయా వీక్లీ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్

జైపూర్ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్

నవజీవన్ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్

# చదువుపై అతివల ఆసక్తి



కరీంనగర్ : 'ఇల్లాలి చదువు.. ఇంటికి వెలుగు' అన్నట్లుగా నిరక్షరాస్యులు చదువుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. పట్టణాల్లోని మహిళా సంఘాల సభ్యులందరికీ రాయడం, చదవడం రావాలనే లక్ష్యంతో 'ఉల్లాస్' కింద పేర్లు నమోదు చేశారు. వీరందరికీ ఆయా ప్రాంతాల్లోనే రాత్రి బడి ఏర్పాటు చేసి అక్షరాస్యత పెంచేలా కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిసింది. కరీంనగర్ నగర పాలక సంస్థతోపాటు మూడు పురపాలికల్లో మొత్తం 17,778 మంది మహిళలు ఉల్లాస్ పథకం ద్వారా చదువు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

**మెప్మా ఆధ్వర్యంలో పేర్ల నమోదు..**

జిల్లాలోని మెప్మా ఆధ్వర్యంలో పట్టణాలు, నగరాల్లో మహిళా సంఘాల సభ్యులలో చదువు రాని వారిని గుర్తించారు. ఏయే స్థాయిలో చదువుకున్నారో వివరాలు సేకరించారు. వీరి వివరాలను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేశారు. దాని ఆధారంగా చదువు చెప్పించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకునే వీలుంది. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో 32,777 మంది మహిళల లక్ష్యం నిర్దేశించగా, 79,182 మంది మహిళలు పేర్లు నమోదు చేసుకున్నారు.

**ఉన్నత చదువులకు టాస్**

స్వశక్తి సంఘాల్లోని మహిళలు చదువును మధ్యలో వదిలేసిన వారు ఉన్నత విద్య చదవడానికి టాస్ పథకం ద్వారా దూరవిద్యలో ప్రవేశాలు తీసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. పదోతరగతిలోపు చదివిన వారు పైచదువులు కొనసాగించడం, పదోతరగతి పాసైన వారు ఇంటర్, ఇంటర్ పూర్తి చేసిన వారు డిగ్రీ చేసేలా చర్యలు చేపట్టారు.

జిల్లావ్యాప్తంగా 2,348 మందిని ఈ ఏడాది ఉన్నత చదువులు చదివించాలని నిర్ణయించగా 5,283 మంది మహిళలు ముందుకొచ్చారు.

ఇందులో పదోతరగతిలో 1,935, ఇంటర్ కోసం 3,348 మంది మహిళలు ఉన్నత విద్య కోసం ప్రవేశాలు తీసుకుంటున్నారు.

ఓ వైపు సంఘాల్లోనే ఉంటూ చదువులో రాణించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. దీనికి ఆర్పీలు, సీవోలు, సంఘాల సభ్యులు సహకరిస్తున్నారు.

రాష్ట్రంలోనే ఉల్లాస్ నమోదులో మొదటి స్థానంలో, టాస్ నమోదులో రెండో స్థానంలో ఉన్నామని మెప్మా పీడీ స్వరూపారాణి చెప్పారు. పట్టణాల్లో అర్హత ఉన్న వారందరిని నమోదు చేశామని, ఉన్నత చదువులకు ఫీజు కట్టించి ప్రవేశాలు చేయించామని వివరించారు.

# నమ్మినోళ్లే.. ముంచేటోళ్లు..!



కొత్తగూడెం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో చోటుచేసుకుంటున్న దొంగతనాలు, దోపిడీలు, మోసాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వీటిని అరికట్టడానికి క్షేత్రస్థాయిలో పోలీసు యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. కేటుగాళ్లు పగలూరాత్రీ అనే తేడా లేకుండా దొంగతనాలు, దోపిడీలతో రెచ్చిపోతున్నారు.

**పగలు రెక్కీ.. రాత్రి దోపిడీ**

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో చోటుచేసుకుంటున్న దొంగతనాలు, దోపిడీలతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. పగలు రెక్కీ నిర్వహించి రాత్రుల్లో దోపిడీలకు పాల్పడుతున్నారు. ఉభయ జిల్లాల్లో 2023లో 338 దోపిడీలు జరగ్గా అందులో 288 రాత్రిపూట చోటుచేసుకోవటం గమనార్హం. దోపిడీలతో పాటు దొంగతనాలు సైతం ఉభయ జిల్లాల ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.

నమ్మితే కొందరు నిండా ముంచుతున్నారు. అధికారుల సంతకాల పోర్జరీలు, నకిలీ బంగారం తాకట్టుపెట్టి రుణాలు పొందటం, ఒకే భూమిని అనేక మందికి విక్రయించటం, బ్యాంకు, ఏటీఎం, క్రెడిట్‌కార్డు, చీటింగ్ కేసులు తదితరాల రూపంలో కేటుగాళ్లు నమ్మిన వారిని తప్పుదోవ పట్టించి జేబులు నింపుకొన్నారు. ఉభయ జిల్లాల్లో చిట్టీపాటల పేరిట అమాయక ప్రజల నుంచి రూ.కోట్లు వసూలుచేసి ఐపీలు పెట్టిన సందర్భాలున్నాయి.

**పోర్జరీలు, మోసాలే అధికం..**2023లో ఖమ్మం జిల్లాలో పోర్జరీలు, మోసాలకు సంబంధించిన నేరాలు 483, భద్రాద్రి జిల్లాలో 276 నమోదయ్యాయి. వీటిలో చీటింగ్ కేసులు ఖమ్మం.. 194, భద్రాద్రి.. 113 ఉన్నాయి. జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) తాజాగా వెల్లడించిన గణాంకాల ప్రకారం 2023లో ఉభయ జిల్లాల్లో 591 దొంగతనాలు, 338 దోపిడీలు, 759 మోసాలు నమోదు కావటం కలవరపరుస్తోంది .2023లో మొత్తమ్మీద 591 దొంగతనాలు జరగ్గా.. ఖమ్మం జిల్లాలో 335, భద్రాద్రిలో 256 నమోదయ్యాయి. వివిధ రకాల వాహనాలు 227 చోరీకి గురయ్యాయి. ఖమ్మం జిల్లాలో 133, భద్రాద్రి జిల్లాలో 94 ఉన్నాయి.

# రోయింగ్‌లో మెరిశారు

హుస్నాబాద్ : ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు రోయింగ్‌లో రాణిస్తున్నారు. చదువుతో పాటు తమకు ఇష్టమైన క్రీడలో పతకాల పంట పండిస్తున్నారు.రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని సత్తా చాటుతున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 13 నుంచి కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు మరోసారి ఎంపికయ్యారు.

హుస్నాబాద్ పట్టణ పరిధిలోని ఆరెపల్లికి చెందిన కాశబోయిన మురళి, లలిత దంపతుల కుమారుడు అభిజిత్ యాదవ్ హైదరాబాద్ హకీంపేటలోని క్రీడా పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. చిన్నప్పటి నుంచి ఆటలపై మక్కువ చూపడంతో తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించారు. ఈ క్రమంలోనే క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు నిర్వహించిన ఎంపిక పోటీలకు తీసుకువెళ్లగా చక్కని ప్రతిభ చూపి ఎంపికయ్యారు. అక్కడ 4వ తరగతిలో చేరాక రోయింగ్‌పై ఉన్న ఆసక్తిని గుర్తించిన శిక్షకులు సూతం ప్రోత్సహించారు. నైపుణ్యాలు, మెలకువలు నేర్పించారు.

ప్రతిభ చూపి పతకాలు సాధించారు

అభిజిత్ గతంలో హైదరాబాద్, పుణె, పంజాబ్, కేరళ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించారు. సిద్దిపేట పట్టణానికి చెందిన విద్యార్థి జశ్వంత్, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వివేక్, మహబూబ్‌నగర్‌కు చెందిన రాంచరణ్‌తో కలిసి డబుల్స్, క్వాడ్రపుల్ విభాగాల్లో బంగారు, వెండి పతకాలు అందుకున్నారు. తాజాగా ఈ నెల 13 నుంచి 16 వరకు కేరళలోని అలెప్పీలో జరిగే ఇంటర్ కాయ్ నేషనల్ రోయింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఇందులో వివేక్‌తో కలిసి డబుల్స్, వివేక్, రాంచరణ్, నాగరాజుతో కలిసి క్వాడ్రపుల్ విభాగాల్లో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొననున్నారు.

కొల్చారం వాసి రాంచరణ్ మెదక్ జిల్లా కొల్చారం మండలం కొంగోడు గ్రామానికి చెందిన గూడూరి రాంచరణ్ హకీంపేటలోని స్పోర్ట్సు స్కూల్‌లో 10వ తరగతి చదువుతూ రోయింగ్‌లో రాణిస్తున్నారు. గత మే నెలలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో జరిగిన పోటీల్లో క్వాడ్రపుల్ విభాగంలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. తాజాగా కేరళలో జరిగే పోటీలకు ఎంపికయ్యా రు. అభిజిత్, నాగరాజు, వివేక్‌తో కల్సి క్వాడ్రపుల్ విభాగంలో పాల్గొననున్నారు.

# పెద్దాసుపత్రుల్లో సేవల సుస్తీ

కోరుట్ల : కోరుట్ల ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్టు వంటి కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కలిసి 40 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. మెట్‌పల్లి ఆసుపత్రిలో సివిల్ సర్జన్లు మూడు, డిప్యూటీ సివిల్ సర్జన్లు నాలుగు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నిత్యం 300 వరకు ఓపీ నమోదవుతుండగా 9 మంది వైద్యులు పరీక్షించి మందులు అందజేస్తున్నారు. ఎముకల వైద్య నిపుణుడు లేకపోవడంతో రోడ్డు ప్రమాద క్షతగాతులను జగిత్యాల ఆసుపత్రికి పంపిస్తున్నారు.

**పరికరాలు నిరుపయోగం**

కోరుట్లలో రూ.16.80 కోట్లతో 100 పడకల ఆసుపత్రి భవనాన్ని నిర్మించి 2023లో ప్రారంభించారు. ఆసుపత్రి నూతన భవనంలో ఒకటి, రెండో అంతస్థులో ఐసీయూ, ఆపరేషన్ థియేటర్, పిల్లల వార్డు, ఇతర వార్డులు వృథాగా ఉన్నాయి. సీఏఆర్ఎం, ఎక్స్‌రే యంత్రా



లు, ఆక్సిజన్ ప్లాంట్లు మంజూరైనా టెక్నీషియన్లు లేక నిరుపయోగంగా మారాయి. మెట్‌పల్లి సామాజిక ఆసుపత్రిలో చేపట్టిన భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ప్రస్తుత భవనం సరిపోక అటు వైద్యులు, ఇటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

పలు చోట్ల పెచ్చులూడటమే కాకుండా వర్షానికి ఉరుస్తోంది. వైద్యులకు సరిపడా గదులు లేవు. రక్తనిల్వ కేంద్రానికి గది లేక పరికరాలు మూలన పడ్డాయి. ఎక్స్‌రే గది గోడలు తడిగా మారుతున్నాయి.

**వరండాలోనే రోగుల బారులు**

మెట్‌పల్లిలో వరండాలోనే ఓపీకి, రక్త పరీక్షలకు, మందు గోలీలకు రోగులు బారులు తీరుతున్నారు. నిత్యం 300 వరకు ఓపీ నమోదవుతుండగా జ్వరం కేసులు ఎక్కువగా రావడంతో ముప్పై పడకలకు బదులు 80 పడకలు వేసి సేవలందిస్తున్నారు.జగిత్యాల జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పారిశుద్ధ్యం లోపించింది. సాధారణ ఆసుపత్రిలో రోజూ 400కు పైగా ఓపీ ఉంటోంది. 60 మంది వైద్యులున్నా సిబ్బంది కొరత ఉంది.జిల్లాకేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 300కు పైగా ఓపీ ఉండగా 50 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో రోడ్డు గుంతలమయగా మారడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.


# ఏ భవనం చూసినా.. ఏముంది గర్వకారణం

భువనగిరి : యాదగిరిగుట్ట మండలంలోని మర్రిగూడెం గ్రామ పంచాయతీ శిథిల భవనంలో కొనసాగడం ప్రమాదాన్ని సూచిస్తోంది. గుండ్లపల్లి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరగా ఇటీవల మరమ్మతులు చేయించినా భయాన్నే కలిగిస్తోంది. యాదగిరిగుట్ట ప్రాథమిక పాఠశాల భవనం పక్కన ఉన్న అదనపు గది పూర్తిగా శిథిలమై ఎప్పుడు కూలుతుందో తెలియడం లేదు.

జిల్లాలోని పంచాయతీ కార్యాలయాలు శిథిల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వానలకు పైకప్పుల పెచ్చులు ఊడి ప్రమాదకరంగా మారాయి. కొద్దిపాటి వర్షం వచ్చినా గోడలు, స్లాబ్ తడిసి ముద్దవుతుండటంతో దస్త్రాలు, ఇతర సామగ్రిని భద్రపరిచేందుకు సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. గ్రామ సభలు, ఇతర సమావేశాలు చెట్ల కిందే నిర్వహిస్తున్నారు.

2018లో కొత్తగా ఏర్పడిన వాటికి సొంత భవనాలు లేక ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, సామాజిక భవనాల్లో కొనసాగుతున్నాయి. పాత భవనాల్లో మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ఒకటికి, రెంటికి కార్యదర్శులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని మహిళా కార్యదర్శులు వాపోతున్నారు. పంచాయతీ భవన నిర్మాణాలకు ఎన్ఆర్ఈజీఎస్‌లో నిధులు మంజూరైనా.. పలుచోట్ల నిర్మించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. మరికొన్ని చోట్ల శంకుస్థాపనల వరకే పరిమితమయ్యాయి.

జిల్లాలో పూర్వం 421 జీపీలు ఉండేవి. సాయినగర్ రంగారెడ్డి జిల్లాలో విలీనమైంది. 420 పంచాయతీలుండగా 30 శిథిలావస్థకు చేరుకున్నాయి. కొత్తగా ఏర్పడిన ఏడు పంచాయతీలకు సొంత భవనాలు లేవు. అవికూడా ఇతర చోట్ల కొనసాగుతున్నాయి. మిగిలినవన్నీ సొంత భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. వాటిలో కూడా కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం 37 జీపీల భవన నిర్మాణాలు కొనసాగు



తున్నట్లు డీఆర్‌డీవో టి.నాగిరెడ్డితో చెప్పారు.

ఆత్మకూరు మండలంలో కొరటికల్, రేపాక, పుల్లాయిగూడెం, పోతిరెడ్డి పల్లి, రాయిపల్లి, సర్వేపల్లి గ్రామ పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎన్ఆర్ఈజీఎస్ కింద కొత్త భవనాలు నిర్మించేందుకు అనుమతులు వచ్చినా నిర్మాణాలు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. సారగండ్లగూడెలో ప్రాథమిక పాఠశాల భవనంలో కొనసాగుతోంది.

జిల్లాలో గ్రామపంచాయతీలు : 427

పక్కా భవనాల్లో కొనసాగుతున్నవి: 390

శిథిల భవనాలు : 30

అద్దె, ఇతర భవనాల్లో ఉన్నవి : 37

నిర్మాణాల్లో ఉన్నవి : 37

# పనుల ప్రారంభం లాంఛనమే..

నక్కపల్లి : రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి తలమానికంగా నిలవనున్న ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అలుపెరగని కృషి చేస్తోంది. దాదాపు రూ.లక్షన్నర కోట్లతో ఏర్పాటవుతున్న ఈ పరిశ్రమకు సంబంధించి కేంద్ర పర్యావరణ శాఖ తాజాగా అనుమతులు జారీ చేసింది. 14 నెలల కాలంలోనే అన్ని అనుమతులు రావడం గమనార్హం. పనుల ప్రారంభానికి పునాదిరాయి వేయడం లాంఛనం కానుంది.నక్కపల్లి మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు సేకరించిన 4300 ఎకరాల్లో వేంపాడు, డీఎల్‌పురం, చందనాడ తదితర రెవెన్యూల పరిధిలో మిత్తల్ ఉక్కు కోసం తొలి విడతగా 2020 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ప్రజాభిప్రాయ సేకరణ ఇప్పటికే పూర్తయింది. ఈ పరిశ్రమను రెండు విడతల్లో కలిపి సుమారు ఐదు వేల ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. మిగిలిన భూమి కోసం వేంపాడు, నెల్లిపూడి, ఉద్దండపురం తదితర ప్రాంతాల్లో గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

డీఎల్‌పురంలో తీరాన్ని ఆనుకుని సరకు రవాణా, దిగుమతుల కోసం క్యాప్టివ్ పోర్టు, ఉద్యోగుల నిమిత్తం 500 ఎకరాల్లో టౌన్‌షిప్ నిర్మించనున్నారు. గుల్లిపాడు రైల్వేస్టేషన్ నుంచి కంపెనీకి ప్రత్యేక రైల్వేలైను ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. భూములు కేటాయించిన ప్రాంతా



ల్లో మౌలిక వసతుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్లు, కాలువల నిర్మాణంతోపాటు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు భారీ పైపులైను నిర్మాణాలు చేస్తున్నారు. తాజాగా పర్యావరణ అనుమతులు రావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

తొలివిడతలో ఏడాదికి 80 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమను మూడేళ్లలో సిద్ధం చేయాలన్న సంకల్పంతో యాజమాన్యం చర్యలు చేపడుతోంది. విస్తరణ ద్వారా ఉక్కు ఉత్పత్తి స్థాయి గరిష్ఠంగా 2.4 కోట్ల టన్నులకు పెరగనుంది. తద్వారా అనుబంధ పరిశ్రమలు వస్తాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఈలోగా నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తే స్థానిక యువతకు మేలు జరుగుతుంది. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖ వేదికగా జరిగే భాగస్వామ్య సదస్సులో మిత్తల్ ఉక్కుకు భూమి పూజ చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

# కపాలంలో కల్లోలం..!!

అనకాపల్లి : 1. గాజువాక ప్రాంతానికి చెందిన 20 ఏళ్ల యువకుడికి మెదడుపోటు (స్ట్రోక్) రావడంతో మూతి, కాలు వంకర పోయి ఇటీవల కేజీహెచ్‌లో చేరాడు. చిన్న వయసు నుంచే మాదక ద్రవ్యాలు, మద్యానికి అలవాటు పడడంతోనే ఈ పరిస్థితి తలెత్తినట్టు వైద్యులు గుర్తించారు. చేతికందిన కొడుకు మంచాన పడడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.


2. 60 ఏళ్ల వృద్ధుడు స్ట్రోక్ బారిన పడి కేజీహెచ్‌లో చేరాడు. ఆయనకు నలుగురు కుమారులు ఉన్నా, ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆలనాపాలనా చూసే వారు లేక, తీవ్ర ఆందోళనతో ఒత్తిడి పెరిగి మెదడు పోటు వచ్చిందని, దాంతో కాలు, చేయి పడిపోయాయని కేజీహెచ్ న్యూరాలజీ విభాగం వైద్యులు పేర్కొన్నారు.

ఇలా కేజీహెచ్‌లోని పలు విభాగాలకు ప్రతి నెలా స్ట్రోక్ కేసులు వస్తున్నాయి. బాధితుల్లో 70 శాతం పురుషులు, 30 శాతం మహిళలు ఉంటున్నారు.

**స్ట్రోక్ రెండు రకాలు:**

రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టడం వల్ల వచ్చే స్ట్రోక్‌ను ఇన్‌ఫ్రాక్ట్‌గా పిలుస్తారు. మొత్తం బాధితుల్లో 85 శాతం ఇదే సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. మెదడులో రక్తనాళాలు చిట్లిపోవడం(సెరిబ్రల్)తోనూ స్ట్రోక్ వస్తుంది. బాధితుల్లో 15 శాతం మందికి ఇదే తరహా సమస్య ఉంటుంది.

**కారణాలు..:** వయసు మీరడం, జీవనశైలిలో మార్పులు, పొగ తాగడం, మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం, మధుమేహం, రక్తపోటు, ఒత్తిడి పెరగడం, వ్యాయామం లేకపోవడం, స్థూలకాయంతో పాటు, నిద్రలో గురక పెట్టే వారు స్ట్రోక్ బారిన పడుతున్నారు. నోటిలో




కురుపులు, దంత సమస్యలు, వాయు కాలుష్యం, కట్టెల పొయ్యి పొగ పీల్చడం వంటివి మెదడుపోటుకు కారణమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

**ఇవీ లక్షణాలు..**

మూతి వంకర పోవడం, కాలు, చేయి పడిపోవడం, మాట సరిగా రాకపోవడం వంటి తీవ్ర లక్షణాలతో పాటు, తలనొప్పి, వాంతులు, కంటిచూపు తగ్గడం, తూలి పడిపోవడం వంటి సాధారణ లక్షణాలు కనిపిస్తాయి.

ఇదీ లెక్క

307

13 నెలల వ్యవధిలో కేజీహెచ్ న్యూరాలజీ విభాగానికి మెదడు పోటుతో వచ్చిన కేసులు.

పురుషులు: 211

మహిళలు: 96

మెరుగైన వైద్యంతో నివారణ..

ఇటీవల కేజీహెచ్‌కు స్ట్రోక్ బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. బాధితులను 3 నుంచి 4 గంటల వ్యవధిలో ఆసుపత్రిలో చేర్పించి, మెరుగైన వైద్యం అందిస్తే ఫలితం ఉంటుంది. కేజీహెచ్‌లో చేరే వారికి అవసరమైన రోగ నిర్ధారణ పరీక్షలు పూర్తి చేసి, రూ.50 వేల విలువ చేసే థ్రాంబోలైసిస్ అనే సూది మందు ఇస్తున్నాం. దీంతో పక్షపాత ఇబ్బందుల నుంచి రోగిని రక్షిస్తున్నాం.

డాక్టర్ ఎస్.గోపి, న్యూరాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

# ఎస్సీ, ఎస్టీల ఇళ్లల్లో సౌర వెలుగులు



గురుద్వారా : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ విద్యుత్తు వినియోగదారుల ఇళ్లపై సౌర విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. దీంతో ఈపీడీసీఎల్ పరిధిలోని ఆయా కేటగిరీల వినియోగదారులకు మేలు చేకూరనుంది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి మిద్దెపై సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసి తద్వారా విద్యుత్తు సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ కేటగిరీల వినియోగదారులకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్తును ప్రభుత్వం భరిస్తోంది. సోలార్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా సంస్థకు ఆర్థిక భారం నుంచి కాస్త ఉపశమనం కలగడమే గాక సౌర విద్యుదుత్పత్తికి ఆస్కారం ఉంటుంది.

**ఈపీడీసీఎల్ పరిధిలో..:**


సంస్థ పరిధిలోని 30 డివిజన్లలో ప్రస్తుతం 2,27,408 మంది ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులు ఉన్నారు. వీటిలో ఒక్కో ఇంటికి రెండు కిలోవాట్ సామర్థ్యం గల సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేస్తారు. వీటికోసం మొత్తం రూ.1.20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.60 వేలు రాయితీ రూపంలో అందిస్తుంది. మిగతాది నాబార్డ్ ద్వారా వచ్చే రుణంతో ఈపీడీసీఎల్ భరిస్తుంది. ఇందులో వినియోగదారుడు చేయవలసిందల్లా సోలార్ ఏర్పాటు తమకు సమ్మతమని సంస్థకు అంగీకార పత్రం ఇస్తే చాలు.

1 కిలోవాట్ సౌర పలకలు ఏర్పాటు చేయాలంటే 100 చదరపు గజాలు విస్తీర్ణం కావాలి. అలా రెండు కిలోవాట్లకు 200 చదరపు గజాలు కాగా తద్వారా నెలకు రూ.200, ఏడాదికి రూ.2,400 అద్దెగా తిరిగి చెల్లిస్తుంది. ఈ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను నెడ్‌క్యాప్ సంస్థకు అప్పగించారు. 30 డివిజన్లకు సంబంధించి ఇప్పటివరకు 14 డివిజన్లకు టెండర్లు పూర్తయ్యాయి. ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బంది ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు వెళ్లి వారిని ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటివరకు 1.33 లక్షల గృహ వినియోగదారులు అంగీకారం తెలిపారు. సమ్మతి తెలిపినందుకు చదరపు గజానికి నెలకు రూ.1 చొప్పున వినియోగదారుడికి తిరిగి అద్దె రూపంలో చెల్లిస్తుంది.

**ఏడాదికల్లా పనులు పూర్తి: దైవప్రసాద్, సీజీఎం, ఈపీడీసీఎల్**

ఈ పథకంతో ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్తు వినియోగదారులకు మేలు చేకూరుతుంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో వినియోగదారుల నుంచి అంగీకారం పొందడం జరిగింది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన డివిజన్లలో ఏడాది కల్లా పనులు పూర్తి చేస్తాం. ఈ విధానంతో వినియోగదారుడికి సంస్థ అద్దె రూపంలో కొంత మొత్తాన్ని చెల్లిస్తుంది.

# అందిపుచ్చుకుంటే అద్భుతం




అచ్యుతాపురం : గ్లోబల్ ఆలోచనలకు కేంద్ర బిందువుగా భారత్‌ను నిలపాలనే లక్ష్యంతో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. విద్యార్థులకు భాగస్వామ్యం కల్పిస్తూ భావి భారత్ ఆవిష్కరణకు బాటలు వేస్తోంది. యువతలో కృత్రిమ మేధస్సు (ఏఐ)పై ఆవిష్కరణాత్మక ఆలోచన, పారిశ్రామిక దృక్పథాన్ని పెంపొందించేందుకు అంతర్జాతీయ స్థాయిలో సమాలోచనలు చేస్తోంది. ఇప్పటికే అటల్ టింకరింగ్ ల్యాబ్స్, అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం) 1.0, ఇన్‌స్పైర్, ప్రయాస్, ఉన్నతి వంటి ఎన్నో వినూత్న కార్యక్రమాలను రూపొందించింది. తాజాగా యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఏఐ ఛాలెంజ్‌ను ప్రకటించింది. ఈ పోటీలో పాల్గొనే విద్యార్థులు నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఏఐ ఆధారిత పరిష్కారాలు చూపాల్సి ఉంటుంది. ఎంపికైన ప్రాజెక్టులను వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న గ్లోబెల్ ఏఐ సమ్మిట్‌లో ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తారు.

యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఏఐ ఛాలెంజ్‌లో పాల్గొనేందుకు 13 – 21 ఏళ్లలోపు యువతీయువకులు అర్హులు. కృత్రిమ మేధ పరిజ్ఞానం, సృజనాత్మకత ఆలోచనలు, బాధ్యతాయుత వినియోగ పద్ధతులకు సంబంధించిన ఆలోచనలు చేస్తే.. రూ.85 లక్షల వరకు నగదు బహుమతి అందుకోవచ్చు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఢిల్లీ ఆధ్వర్యంలో జరిగే ఏఐ నిపుణుల వర్క్‌షాపులో పాల్గొనే అవకాశాన్ని సొంతం చేసుకోవచ్చు.

వ్యక్తిగతంగా/ ఇద్దరు కలిసి బృందంగా దరఖాస్తు చేసుకునేందుకు వీలుంది. ప్రజలు, సామాజిక సాధికారత, ప్రాథమిక రంగాలు (వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా), స్మార్ట్ ఎకో సిస్టమ్స్, గ్రీన్ ఎనర్జీ, సుస్థిర నగరాలు, ఓపెన్ ఇన్నోవేషన్ అంశాల్లో ప్రాజెక్టులు తయారు చేయాల్సి ఉంటుంది. ప్రాథమిక ఎంపిక, ప్రాజెక్టు మెరుగుదల, ఇంటర్వ్యూ ద్వారా విజేతలను ఎంపిక చేస్తారు.

ప్రథమ బహుమతిగా మూడు బృందాలకు రూ.15 లక్షలు, ద్వితీయ బహుమతిగా మూడు బృందాలకు రూ.10 లక్షలు, ప్రత్యేక బహుమతిగా రెండు బృందాలకు రూ.5 లక్షల చొప్పున అందజేస్తారు. 13–17 ఏళ్లలోపు వారికి తల్లిదండ్రుల ఖాతాలో, 18 – 21 ఏళ్ల వారికి బృంద సారథి ఖాతాలో నగదు బహుమతి మొత్తం జమ చేస్తారు.

సమ్మిట్‌కు హాజరయ్యే వారికి ప్రయాణం, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. ప్రాజెక్టు నిపుణులు అంగీకరిస్తే ప్రభుత్వం దత్తత తీసుకునే అవకాశం ఉంటుంది. యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఛాలెంజ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 30లోగా ఆన్‌లైన్‌లో https:/// impact.indiaai.gov.in% దరఖాస్తు చేయవచ్చు.

ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ప్రాజెక్టు... ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ప్రత్యేక ప్రాజెక్టు రూపొందించాం. అద్దురోడ్డుకు చెందిన విద్యార్థిని బొలిశెట్టి వర్షిత పేరుతో యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఛాలెంజ్‌కు దరఖాస్తు చేశాం. ప్రత్యేక అవసరాలున్న పిల్లలు, బుద్ధిమాంద్యం ఉన్న వారిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును ఎంచుకున్నాం. మిక్స్‌డ్ రియాలటీ సాంకేతికతతో పనిచేసే హెడ్ సెట్‌ను తయారుచేశాం. దీన్ని పెట్టుకుంటే అంతా ప్రత్యక్షంగా కళ్ల ముందున్నట్లు కనిపించడంతో వారి ఆలోచనలు, కదలికల్లో మార్పునకు అవకాశం ఉంటుంది. ధర్మిరెడ్డి ప్రసాద్, ఛైర్మన్, ప్రశాంతి విద్యా సంస్థలు, అచ్యుతాపురం

# ఇంటిపట్టునే కొలువు



కర్నూలు : డిగ్రీలు, పీజీలు, ఇంజినీరింగ్ చదివిన యువతులు ఉద్యోగాలు చేస్తూ వివాహమైన తర్వాత అత్తవారి ఇంటికి వెళ్తున్నారు. అక్కడ ఉద్యోగం చేసే అవకాశం లేక చాలామంది ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఇలాంటివారు ఇంటివద్దే ఉద్యోగం చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వారి విద్యార్హతలను గుర్తించేందుకు కౌశలం సర్వే చేపట్టింది. సమగ్ర వివరాలు సేకరించేలా తగిన ఆదేశాలు ఇచ్చింది.

**1,20,321 మంది వివరాల సేకరణ**

ఉమ్మడి జిల్లాలో వర్క్‌ఫ్రం హోం కింద 2,00,037 మంది వివరాలు సేకరించాలని నిర్ణయించారు. సచివాలయ సిబ్బంది ఆగస్టులో కౌశలం సర్వే చేపట్టారు. మూడు నెలల్లో 1,20,321 మందిని సర్వే చేసి వారి విద్యార్హత ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేశారు. ఇంకనూ 79,716 మందిని సర్వే చేయాల్సి ఉంది. తాము ఇంటి నుంచే పనిచేస్తామని మరో 48,269 మంది ముందుకొచ్చారు. ఆ వివరాలను సిబ్బంది సేకరించాల్సి ఉంది.

**ఎలాంటి ఉద్యోగాలు చూపుతారు**

పది, ఇంటర్, డిగ్రీ, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన 18–50 ఏళ్లలోపు వయస్సువారిని అర్హులుగా గుర్తిస్తారు. పది, ఇంటర్ చదివిన వారికి సంబంధించి ఎలాంటి ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ.. ఆపై చదువులు చదివినవారి నుంచి విద్యార్హతల ధ్రువపత్రాలను స్కాన్ చేసి కౌశలం యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

కౌశలం సర్వే పూర్తైన తర్వాత నిరుద్యోగ యువతీ యువకుల నైపుణ్యాలు గుర్తించేందుకు పరీక్ష నిర్వహించనున్నారు. దీని ఆధారంగా ఎంపిక చేస్తారు. వారికి డిజిటల్ మార్కెటింగ్, ఈ–కామర్స్, ఐటీ తదితర రంగాల్లో శిక్షణ ఇస్తారు. ప్రత్యేకంగా వివిధ ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేసి అవగాహన కల్పిస్తారు. అనంతరం ఇంటి నుంచి పనులు చేసేలా అవకాశం కల్పిస్తారు. ఇలా ప్రభుత్వం వారి భవిష్యత్తుకు భరోసా ఇస్తుంది.

**అధికారుల పర్యవేక్షణ కరవు..**

ఉమ్మడి జిల్లాలో 1,188 సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయం పరిధిలో మూడు నెలలకు వంద మందిని మాత్రమే సర్వే చేశారు. అంటే నెలకు 33 మంది వివరాలే సేకరించారు. గ్రామ, వార్డు సచివాలయ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించకపోవడంతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

# కల్యాణ వేదిక.. గుత్తేదారుల వేడుక

కర్నూలు : ప్రైవేటు కల్యాణ మండపాల అద్దెలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇంటి వద్ద వసతి లేని సామాన్యులు ప్రైవేటు ఫంక్షన్ హాళ్లలో వివాహాలు, శుభకార్యాలు జరిపించడం భారంగా మారింది. ఈ పరిస్థితిని గుర్తించిన ఎన్టీ రామారావు.. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కల్యాణ మండపాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దశాబ్దాలపాటు ప్రజలకు సేవలు అందించిన వీటిని గత వైకాపా ప్రభుత్వం గుత్తేదారులకు ధారాదత్తం చేసింది.

**అడిగినంత ఇవ్వాల్సిందే..**

బేతంచెర్ల సమీపంలో నిర్మించిన తితిదే కల్యాణ మండపం శిథిలావస్థకు చేరుకుంది. నాలుగేళ్ల కిందట దీనిని ఓ వ్యక్తికి లీజుకు ఇచ్చారు. ఒక వివాహానికి రోజుకు రూ.6 వేలతో పాటు సామగ్రి, విద్యుత్తు, లేబర్ ఛార్జీల పేరుతో రూ.30,500 వరకు వసూలు చేస్తున్నారన్న



ఆరోపణలున్నాయి.

**లీజు పేరుతో..** ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 10 తితిదే కల్యాణ మండపాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో అత్యధిక కల్యాణ మండపాలను లీజుకు ఇచ్చారు. వీటిని దక్కించుకున్న గుత్తేదారులు.. నిర్వాహకుల నుంచి భారీగా సొమ్ము వసూలు చేస్తున్నారే తప్ప వసతులు మాత్రం సమకూర్చడం లేదు.

పత్తికొండ, ఆదోని, నందికొట్కూరు, బండిఆత్మకూరు మండలం పార్నపల్లి (నంద్యాల సమీపంలో), ఎర్రగుంట్ల, కోవెలకుంట్ల, బేతంచెర్లలోని ఫంక్షన్ హాళ్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరులోని కల్యాణ మండపాల్లో చేపట్టిన ఆధునికీకరణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

# నవనందులు.. కార్తిక వెలుగులు

నంద్యాల : నల్లమల.. కార్తిక శోభతో అలరారుతోంది. మహానంది క్షేత్రంతో పాటు నంద్యాల చుట్టూ నవనందులు వెలిశాయి. కార్తిక మాసంలో ప్రతి సోమవారం, కార్తిక పౌర్ణమి రోజున భక్తులు సూర్యాస్తమయంలోపు పాదయాత్రగా వెళ్లి నవ నందీశ్వరులను దర్శించడం ఆనవాయితీ. ముందుగా నంద్యాల గుడిపాడిగడ్డలోని భ్రమరాంబాదేవి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలోని సాక్షి గణపతిని దర్శించుకుంటారు. అన్ని నందులను దర్శించి తిరిగి గుడిపాడిగడ్డలోని స్వామిని దర్శించుకుంటేనే యాత్ర సఫలమవుతుందని భావిస్తారు.

**ప్రథమ నంది** నంద్యాల పట్టణంలోని చామకాల్వ గట్టున ప్రథమ నందీశ్వరాలయం ఉంది. గర్భాలయంలో కొలువుదీరిన కేదారేశ్వరలింగం భక్తులకు దర్శనమిస్తుంది. స్వామివారి ఆశీస్సులు అందుకోవడం ద్వారా కేదార్‌నాథ్‌లోని కేదారేశ్వరస్వామిని దర్శించుకున్నంత ఫలం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. ఇక్కడే మరోపక్క కేదారేశ్వరిమాత కొలువుదీరి ఉంటారు.

**శివనంది (రుద్రనంది)**

బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామాన్ని ఆనుకొని ఉంది. ఈ క్షేత్రాన్ని శివనంది లేదా రుద్ర నందీశ్వరాలయంగా పిలుస్తారు. ఇక్కడి శివలింగం మిగతా క్షేత్రాల్లోని శివలింగాల కంటే ఎత్తుగా ఉంటుంది. నంద్యాల పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది.

**సూర్యనంది**

మహానంది– నంద్యాల ప్రధాన రహదారిలోని తమడపల్లె నుంచి దక్షిణం వైపు రెండు కిలోమీటర్ల దూరంలో సూర్యనంది క్షేత్రం ఉంది.**నాగనంది**

నంద్యాల ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో నాగనంది ఉంది. కార్తిక మాసంలో విశేష పూజలు జరుగుతాయి.

**గరుడనంది** మహానంది క్షేత్రంలోని ఆలయానికి పడమటి దిశలో ప్రధాన రహదారికి వంద గజాల దూరంలో ఉంది. ఈ ఆలయానికి



విమాన గోపురాన్ని ఇటీవల కాలంలో నిర్మించారు. ఇక్కడే గోర్లయ్య మఠం ఉంది.

**మహానంది** ఈ పుణ్యక్షేత్రంలో పరమశివుడు గోవుపాద రూపంలో వెలిశారు. అందుకే మహానందీశ్వరుడిని గోపాద లింగేశ్వరుడిగా పిలుస్తారు. స్వామివారు ఇక్కడ స్వయంభువుగా వెలిశారు. ఆలయం కిందిభాగం నుంచే జలాలు నిత్యం ప్రవహిస్తూ ఉంటాయి. ఈ నీటితో సుమారు రెండు వేల ఎకరాల భూములు సాగవుతుంటాయి.

**సోమనంది**

నంద్యాల పట్టణం.. ఆత్మకూరు బస్టాండు సమీపంలో సోమ నందీశ్వరాలయం ఉంది. చంద్రుడు మహేశ్వరలింగాన్ని ప్రతిష్ఠించడంతో ఈ పేరు వచ్చిందని ప్రతీతి.

**కృష్ణనంది (విష్ణునంది)**

ఈ క్షేత్రం నల్లమల అడవిలో.. ప్రకృతి రమణీయతతో అలరారుతోంది. కడమలకాల్వ గ్రామం నుంచి.. అటు మహానంది మండల కేంద్రం తిమ్మాపురం నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

**వినాయకనంది**

ఈ క్షేత్రం సైతం మహానందిలోని ఆలయాల్లో అంతర్భాగంగా నిర్మితమైంది. మహానందీశ్వర స్వామివారి ఆలయానికి దక్షిణం వైపున స్వామివారు వినాయక నందీశ్వరుడిగా వెలిశారు. ఇక్కడ పరమశివుడి కోసం వినాయకుడు తపస్సు చేసి ప్రతిష్ఠించడంతోనే వినాయక నందీశ్వరాలయంగా గుర్తింపు పొందింది.

# అనుసంధానానికి ఎన్నేళ్లో ?

రాయదుర్గం: ఏళ్ల తరబడి రైల్వే వంతెనలకు అనుసంధాన దారులు నిర్మించకపోవటంతో రైల్వేగేట్ల వద్ద తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం మేర నిధులతో వంతెనలు, అనుసంధాన రోడ్లను నిర్మించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం అనుసంధాన రోడ్లను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం చెబుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం తమవద్ద నిధులు లేవని రైల్వే శాఖనే అనుసంధాన దారులు నిర్మించాలని పేర్కొంటుండటంతో నిర్మాణాల్లో జాప్యం ఏర్పడుతుంది. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్‌జామ్‌తోపాటు ప్రమాదాలు జరుగుతున్న విషయం విదితమే.

**తరచూ ప్రమాదాలు** వారం కిందట ముదిగుబ్బలో పాతూరు రైల్వే గేటును మినీ బస్సు ఢీకొన్న ఘటనతో ప్రమాదం చోటుచేసుకుంది. రాయదుర్గం పట్టణం అనంతపురం రోడ్డులోని రైల్వే గేటు వద్ద పట్టణానికి చెందిన ఓ ఆటో రైల్వే గేటు వద్ద లిఫ్టింగ్ బ్యారర్(బూమ్‌ని) ఢీకొట్టడంతో అది విరిగింది. దీంతో సకాలంలో గేట్లు వేయక, సిగ్నల్ పనిచేయక రైళ్ల రాకపోకల్లో ఆలస్యం జరిగింది.




డి.హిరేహాళ్ మండలం హిర్దేహాళ్ వద్ద కాపలా లేని రైల్వే గేటు వద్ద స్థానిక ఆర్టీసీ బస్సును రైలు ఢీకొన్న ప్రమాదంలో పలువురు మృత్యువాతపడ్డారు. గతంలో కణేకల్లు రోడ్డులో గేటు సక్రమంగా పడకపోవటంతో రాకపోకలు నిలిపి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఇటీవల కొత్తగా నిర్మిస్తున్న రైల్వే లైన్లలో గేట్లు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. రాయదుర్గం నుంచి కదిరిదేవరపల్లి వరకు ఎక్కడా రైల్వే గేట్లు లేవు.

చోదకులు సంయమనం పాటించాలి

**– ఉమామహేశ్వర్, రాయదుర్గం స్టేషన్ మాస్టర్**

రైల్వే గేట్లవద్ద గేటు వేసిన తర్వాత రైళ్లు వెళ్లేదాకా ప్రజలు సహనంతో సంయమనం పాటించాలి. అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలి. సకాలంలో రైళ్లు గమ్యస్థానాలకు చేరేందుకు గేట్లు తప్పని సరిగా వేయాల్సి ఉంటుంది.

# అడ్డుకునేదెవరు.. తరలించేయ్

కళ్యాణదుర్గం : జిల్లాలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నదులు, వాగులు, వంకలను తవ్వేస్తున్నారు. ఇసుకను ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా తెలిసినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నిత్యం వందల ట్రాక్టర్లలో జిల్లా కేంద్రం, కర్ణాటకతోపాటు ఇతర ప్రాంతాలకు టన్నులకొద్ది ఇసుక తరలిపోతోంది.

**దూరాన్ని బట్టి ధర నిర్ణయం**

కళ్యాణదుర్గం నియోజకవర్గం సరిహద్దు గ్రామాలైన మానిరేవు, ఓబుళాపురం, కాలువపల్లి, ఆత్మకూరు, బాలవెంకటాపురం, నూతిమడు గుతండా గ్రామాల మధ్య పెన్నా పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమంగా లక్షల క్యూబిక్ మీటర్ల మేర తవ్వేస్తున్నారు. దూరాన్ని బట్టి ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.4,200 నుంచి రూ.4,800 వరకు విక్రయిస్తున్నారు. ఇటీవల వర్షాలు కురిసి పెన్నాలో నీరు చేరినా ఇతసుక తోడకం మాత్రం ఆగడం లేదు. తవ్వకాలు ఇలాగే జరిగితే వ్యవసాయ క్షేత్రాల్లోని బోరుబావుల్లో నీటిమట్టం తగ్గిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇసుక తవ్వకాలపై ప్రశ్నించి, అడ్డుకుంటే తమపై అక్రమార్కులు దాడులకు తెగబడుతున్నారని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఇసుకను తోడేయడంతో భారీ స్థాయిలో గుంతలు ఏర్పడ్డాయి.



**సెలవు రోజుల్లో తెగింపు**

కుందుర్పి మండలంలోని కొలిమిపాళ్యం, అల్లాపురం, బసాపురం, యర్రగుంట, తూముకుంట తదితర గ్రామాల సమీపాల్లోని వాగులు, వంకల్లో ఇసుకను తవ్వి కర్ణాటక సరిహద్దు గ్రామాలకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.3,200 నుంచి రూ.3,800 వరకు విక్రయిస్తున్నారు. కొందరు నాయకులు ఇదే పనిని వృత్తిగా మార్చుకున్నారు. రాత్రివేళ, సెలవు రోజుల్లో ఎవరు ఉండరనే ఉద్దేశంతో తవ్వకాలు చేస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

**నిఘా ఉంచి అడ్డుకుంటాం**

వసంత్‌బాబు, కళ్యాణదుర్గం ఆర్డీవో

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. ఏ ప్రాంతంలోనూ తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. ప్రత్యేక నిఘా ఉంచి అధికారులతో దాడులు చేయిస్తాం. ఇసుక తరలించే వాహనాలను సీజ్‌చేసి, బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం.

# ప్రయోగాలకు త్రీడీ ముద్ర

తిరుపతి : దీర్ఘకాల అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి ఉపశమనం కలిగించే పరిశోధనలు చేస్తున్నారు శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విభాగం విద్యార్థినులు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వివిధ వ్యాధులపై పరిశోధకురాలు హర్షిణి ప్రయోగాలు చేయగా.. శరీరంపై గాయాలను నయం చేయడానికి స్కాఫ్‌ఫోల్డ్స్ టిష్యూలను రూపొందించారు ఎం.ఫార్మసీ విద్యార్థిని కృష్ణతేజశ్విని. వీటి తయారీకి ఒకరు బయోసిరమిక్, బయోమెటీరియల్స్‌ను వినియోగిస్తే, మరొకరు గండపురా (వింటర్ గ్రీన్‌ప్లాంటు) మొక్క ఆకుల నుంచి తీసిన ఆయిల్‌ను వినియోగించారు. వీరి పరిశోధనలను వివరించారిలా..

**పుండ్లను నయం చేసేలా..**పుండ్లు, కాలిన గాయాలు నయం కావడానికి కొంత సమయం పడుతుంది. మధుమేహ బాధితులకు చాలా సమయం కావాలి. ఇవి పెద్దవైనప్పుడు నయం చేయడానికి మన శరీరం నుంచి కానీ, ఇతరుల శరీరం నుంచి కానీ కావాల్సిన చర్మాన్ని తీసి గాయాలపై అమరుస్తారు. ఇదెంతో ఖర్చుతో కూడుకున్న పని. కొన్నిసార్లు దుష్ప్రభావాలు ఎదురవుతాయి. దీని పరిష్కారానికి బయోసిరమిక్, బయోమెటీరియల్లను వినియోగించి త్రీడీ ప్రింటింగ్‌తో స్కాఫ్‌ఫోల్డ్స్ టిష్యూ రూపొందించా. ఇప్పటివరకు విరిగిన ఎముకలు అతుక్కోవడానికే వీటిని వినియోగించేవారు. మన శరీరంలో ఉండే కొలాజిన్ ప్రొటీన్ చర్మం, ఎముకలు, కండరాలు, నరాలను బలోపేతం చేస్తుంది. మధుమేహం బాధితుల్లో కొలాజిన్ అంత శక్తిమంతంగా పని చేయదు. గాయాలను స్కాఫ్‌ఫోల్డ్ త్వరగా నయం చేస్తుంది. ఎలుకలపై చేసిన ఈ ప్రయోగం విజయవంతం కావడంతో దీనిపై పేటెంట్ పొందేందుకు దరఖాస్తు చేసుకున్నా.

ఎం.హర్షిణి, పరిశోధక విద్యార్థిని

**వింటర్ గ్రీన్ ఆయిల్‌తో..**పుండ్లు, గాయాలు నయం చేయడానికి రకరకాల పూత మందులు వినియోగిస్తుంటాం.

# పొదుపు రుణం.. కష్టతరం!

కొత్తచెరువు : డ్వాక్రా సంఘాల్లో రాజకీయ జోక్యం, సిబ్బంది అక్రమాలతో లావాదేవీలు అస్తవ్యస్తంగా మారి గందరగోళానికి దారి తీస్తున్నాయి. గ్రామస్థాయిలో సంఘాలపై పర్యవేక్షణ కొరవడి కొంత మంది లీడర్లు సభ్యులు చెల్లించిన కంతు మొత్తాన్ని స్వాహా చేయడం వెలుగులోకి వచ్చాయి. కొందరు యానిమేటర్లు, సీసీలు స్త్రీనిధి రుణాల్లో స్వాహా పర్వానికి పాల్పడి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ నమోదుల్లో వ్యత్యాసాలు వెలుగు చూసినా నేటికి చర్యలు శూన్యం. ఈ నేపథ్యంలో కొందరు బకాయిలు చెల్లించక పోవడంతో ఆయా మండలాలను ఎన్‌పీఏ కింద చేర్చారు. దీంతో రెండు నుంచి నాలుగైదేళ్లుగా స్త్రీనిధి రుణాలు మంజూరు కావడం లేదు. బయట అధిక వడ్డీలకు అప్పులు చేయలేక.. రుణాల కోసం ఎదురు చూస్తున్నామని మహిళలు వాపోతున్నారు.

**ఒక్క మండలంలోనే రూ.20 లక్షలకు పైగా**

స్త్రీనిధి రుణాల చెల్లింపులో జిల్లా ఎన్‌పీఏ నివేదిక మేరకు 9 మండలాలకుగాను ఒక్కో మండలంలో రూ.20 లక్షలకుపైగా మొండి బకాయిలు పేరుకున్నాయి. చెల్లింపులు 90 రోజులు దాటిన మొండి బకాయి మొత్తం రూ.3.57 కోట్లు ఉంది. అలాగే రూ.10 లక్షల చొప్పున బకాయిలు పేరుకున్న మండలాలు 14 ఉండగా వీటిలో రూ.2.29 కోట్లు మొత్తం రూ.5.86 కోట్లు మొండి బకాయిలు పేరుకున్నాయి. బుక్కపట్నం రూ.95.91 లక్షలు, ముదిగుబ్బ రూ.68.62, నల్లచెరువు రూ.37.60, కొత్తచెరువు రూ.33.11, మడకశిర రూ.31.67, కదిరి రూ. 23.95, నల్లమాడ రూ.23.51 లక్షల మేర మొండి బకాయిలు పేరుకున్నాయి.

**ఎన్‌పీఏ పరిమితి పెంచాం – నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ**

స్త్రీనిధి రుణాల చెల్లింపులో జాప్యం కారణంగా రూ.20 లక్షలకుపైగా మొండి బకాయిలు పేరుకుపోయిన 15 మండలాలు ఎన్‌పీఏ కింద నిలిచిపోయాయి. దీంతో ఆ మండలాల్లోని సంఘాలకు రుణాలు మంజూరు లేదు. ప్రస్తుతం మారిన నిబంధనల మేరకు ఎన్‌పీఏ పరిమితిని రూ.35 లక్షలకు పెంచాం. జిల్లాలో ఒకటి, రెండు మండలాలు తప్ప ఇతర మండలాలకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తాం.

జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 1,311

స్వయం సహాయ సంఘాలు: 33,400

మహిళా సంఘాల సభ్యులు : 3,51,922

# సంతల జోరు.. వసూళ్లలో హుషారు




అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లాలోనే అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు పెద్దది. రుసుం వసూళ్లు కూడా ఎక్కువే. గత ఏడాది కంటే ఈసారి ఆదాయం మరింత పెరిగింది. ఇక్కడ నిత్యం చీనీ సంత జరుగుతుంది. శనివారం గొర్రెలు, మేకల సంత, ఆదివారం పశువుల సంత నిర్వహిస్తారు. యార్డుకు ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.5.10 కోట్లు ఆదాయ లక్ష్యం కాగా గత అక్టోబరు నాటికి రూ.3 కోట్లు వసూలైంది.

**1,40,359 టన్నుల విక్రయాలు**

అనంతలో చీనీ మార్కెట్ ఏటా జనవరి నుంచి సెప్టెంబరు వరకు జరుగుతుంది. అడపాదడపా అక్టోబరులో కూడా మార్కెట్‌కు కొద్దిగా చీనీకాయలు వస్తాయి. కేవలం రెండు నెలలు మాత్రమే సంత మూతపడుతుంది. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు మొత్తం 1,40,359 టన్నుల చీనీ కాయలు విక్రయించారు. రూ.180.48 కోట్ల వ్యాపారం జరిగింది. ఇప్పటివరకు యార్డుకు రుసుం రూపేణా రూ.3 కోట్లు వసూలైంది. అందులో చీనీ సంతలో రూ.1,80,48,714, గొర్రెలు, మేకల సంతలో రూ.65,83,632, పశువుల సంతలో రూ.46,04,030, ఇతర రూ.7,63,626 ఆదాయం వచ్చింది.

**లక్ష్యాన్ని అధిగమిస్తాం–** రాఘవేంద్రకుమార్, ఇన్‌ఛార్జి ఎంపికశ్రేణి కార్యదర్శి (అనంతపురం)అనంత మార్కెట్‌యార్డుకు ఈ ఆర్థిక సంవత్సరం రూ.5.10 కోట్లు రుసుం వసూళ్లు లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికే రూ.3 కోట్లు వసూలైంది. పశువుల సంతల్లో కొంత ఆదాయం తగ్గినా.. చీనీ, గొర్రెల సంతలతో బాగుంది. ఇంకా 5 నెలల్లో రూ.2.10 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో పూర్తి లక్ష్యాన్ని అధిగమిస్తాం.

# కాలుష్య కోరల్లో తటాకాలు



హిందూపురం: హిందూపురం పట్టణంలో అంతర్భాగమైన శ్రీకంఠపురం, కొట్నూరు చెరువులు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. పట్టణంలోని మురుగునీరు నిత్యం అందులోకి చేరుతోంది. వీటి బాగోగులు చూడాల్సిన అధికారులు, పాలకులు పట్టించుకోవటం లేదు. గతంలో ఈ చెరువుల కింద ఆయకట్టు రైతులు వందల ఎకరాల్లో వివిధ పంటలు పండించేవారు. ఓ వైపు తటాకాలు ఆక్రమణకు గురికావడం.. మరోవైపు నీరు కలుషితమై పంటల సాగుకు ఆమోదయోగ్యం కాక అన్నదాతలు నష్టపోతున్నారు. బోర్లు తవ్వినా కలుషిత నీరు వస్తుండటంతో రైతులు భూములను బీడుగా వదిలేస్తున్నారు.

**కాలువ సైతం..**

పెన్నార్‌కుముద్వతీ ప్రాజెక్టు నుంచి కొట్నూరు చెరువుకు వర్షాకాలంలో వరద నీటిని మళ్లించేందుకు యాభై ఏళ్ల కిందట 8 కిలోమీటర్ల మేర కుడికాలువ నిర్మించారు. ప్రస్తుతం ఈ కాలువలో మురుగు నీరు ప్రవహించి కొట్నూరు చెరువులో కలుస్తున్నాయి. శ్రీకంఠపురం చెరువుది ఇదే స్థితి. లక్ష్మీపురం, మోడల్‌కాలనీ, శ్రీకంఠపురం ప్రాంతాల నుంచి వచ్చే మురుగు మొత్తం శ్రీకంఠపురం చెరువులోకి చేరుతోంది.

**మురుగు శుద్ధిప్లాంటు ఏర్పాటు ఎప్పుడు?**

హిందూపురం పట్టణంలోని మురుగునీటిని శుద్ధిచేసేందుకు ప్లాంటు మంజూరైందని గతంలో సంబంధిత అధికారులు తెలిపారు. అయితే ఇప్పటి వరకు దీనికి సంబంధించిన ఎలాంటి పనులు ప్రారంభం కాకపోవటం గమనార్హం.

**అధికారులకు సూచించాం**

– శైలేష్, డీఈ ఇరిగేషన్, హిందూపురం

పట్టణంలోని మురుగునీరు చెరువులకు చేరకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే మున్సిపల్ అధికారులను కోరాం. మరోసారి వారి దృష్టికి తీసుకెళ్తాం. చెరువుల్లో జలాలు కలుషితం కాకుండా తగిన చర్యలు చేపడతాం.

కొట్నూరు చెరువు ఆయకట్టు :700 ఎకరాలు

రైతులు : 1,000 మంది

శ్రీకంఠపురం చెరువు ఆయకట్టు : 300 ఎకరాలు

రైతులు : 350 మంది

# పేదలకు ఆవాస యోగం

పుట్టపర్తి : పల్లెల్లో సొంతిల్లు లేని పేదలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (పీఎంఏవై-జీ) ప్లస్ ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల్లో గృహం లేని నిరుపేదలను గుర్తించడానికి రెండు నెలల కిందట అధికారులు సమగ్ర సర్వే చేశారు. రాష్ట్రంలో నేటికి సొంతిల్లు లేని నిరుపేదలు ఉన్నారని సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. ఆ మేరకు పీఎంఏవైజీ 2-0 కింద ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించింది. గతంలో దరఖాస్తు చేసుకోని వారు నవంబర్ 5వ తేదీ వరకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. స్థలం ఉన్న వారందరికీ ఇళ్లు మంజూరు చేయనున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 47,341 దరఖాస్తులు అందాయి. వీటిలో అత్యధికంగా మడకశిర నియోజకవర్గం నుంచి 15,663 దరఖాస్తులు రాగా అత్యల్పంగా హిందూపురం నుంచి 2,984 మాత్రమే అందాయి.

ఇవి ఉంటేనే..సొంత స్థలం ఉండాలి. స్థలం పట్టా, రిజిస్ట్రేషన్, పొజిషన్ పత్రాల్లో ఏదైనా ఒకటి ఇవ్వాలి. రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం, భార్య, భర్త ఆధార్ జిరాక్స్ దరఖాస్తుకు జతపరచాలి.

**అర్హులందరికీ ఇళ్లు మంజూరు** – వెంకటనారాయణ, హౌసింగ్ పీడీ



పల్లెల్లో అర్హులందరికి పీఎంఏవైఈలో దరఖాస్తు చేసుకుంటే, పరిశీలించి మంజూరు చేస్తాం. ఇప్పటికే 47 వేల దరఖాస్తులు అందాయి. ఈ నెల 5వతేదీ వరకు అవకాశం ఉంది. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# ఈ- శ్రమ్ కార్డులు.. భద్రతకు భరోసా

కళ్యాణదుర్గం : సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే వారితోపాటు వలస కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తూ, సంక్షేమ పథకాలు అందించాలనే సుప్రీకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం 2021 ఆగస్టు 26న 'ఈ- శ్రమ్' పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో పేర్లు, వివరాలు నమోదు చేసుకున్న కార్మికులకు ఉచితంగా యూఏఎన్ గుర్తింపు కార్డులను జారీ చేస్తారు. దేశంలో ఎక్కడైనా ఈ కార్డు చెల్లుబాటు అయ్యేలా యూనివర్శల్ అకౌంట్ నంబరు(యూఏఎన్)ను అందజేస్తున్నారు. అనంతపురం జిల్లావ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగాల్లో సుమారు 10 లక్షల కార్మికులున్నారు. ఈ-శ్రమ్ కోసం ఇప్పటివరకు 8 లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా.. కార్డులు సైతం జారీ చేశారు. పుట్టపర్తి జిల్లావ్యాప్తంగా మొత్తంగా 3.10 లక్షల మంది కార్మికుల్లో కేవలం 1.10 లక్షల మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోగా.. వారికీ కార్డులు అందాయి.

**నమోదు ఎలాగంటే..?**సంఘటిత, అసంఘటిక రంగాల్లో పనులు చేసే కార్మికులు 21 సంవత్సరాల నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన వారు భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా లేదా సమీపాల్లోని కామన్




సర్వీస్ సెంటర్ల ద్వారా, సచివాలయాల్లో, కార్మిక శాఖ అధికారులు, చరవాణిలో సెల్ఫ్ రిజిస్ట్రేషన్ కోసం నమోదు చేసుకోవచ్చు. దీనికి ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబరు, నామిని ఖాతా, చరవాణి నంబరు తప్పనిసరి. గత వైకాపా ప్రభుత్వం 'ఈ- శ్రమ్' కార్డుల పంపిణీని 2023లో నిలిపివేసి ంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిని పునరుద్ధరించింది.

**అనేక ప్రయోజనాలు**

ఈ-శ్రమ్ ద్వారా నమోదు చేసుకొన్న కార్మికుడికి 12 అంకెల గల యూఏఎన్ గుర్తింపు కార్డు అందజేస్తారు. ఈ కార్డు ఉన్న వారికి ప్రభుత్వం అందించే సంక్షేమ, సామాజిక భద్రత పథకాలు వర్తిస్తాయి. కార్డుదారులు ప్రమాదంలో మృతిచెందితే ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకం ద్వారా రూ.2 లక్షలు, గాయపడినా, వైకల్యానికి గురైనా రూ.లక్ష పరిహారం వస్తుంది.

**ఉద్యోగ, ఉపాధి అవకాశాలు–** లక్ష్మీనరసయ్య, ఉపకార్మిక శాఖ కమిషనర్ 'ఈ-శ్రమ్' పథకం నమోదులో రాష్ట్రంలోనే ఉమ్మడి అనంత జిల్లా రెండో స్థానంలో ఉంది. ప్రతి కార్మికుడు నమోదు చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. వీటిపై అవగాహన కల్పిస్తూ నమోదు చేస్తున్నాం.

# నిధులు జేబుల్లో.. దోమలు ఇళ్లల్లో..!

విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో దోమల సంహారం పేరుతో స్వాహా పర్వానికి తెర లేపారు. మెకానికల్ విభాగంలో కొందరు సిబ్బంది...క్షేత్రస్థాయిలో పలువురు వార్డు స్థాయి నేతలు జత కలిసి మాయ చేస్తున్నారు. కాకి లెక్కలతో జేబులు నింపేసుకుంటున్నారు. వర్షాలతో దోమల బెడద పెరిగి నగరవాసులు ఇబ్బందులు పడుతుంటే...ఫాగింగ్ ప్రక్రియ నామమాత్రంగా జరుగుతున్నట్లు విమర్శలున్నాయి.

**మెకానికల్‌లో మాయ:** ఫాగింగ్ యంత్రాలు, వాహనాలకు పెట్రోలు బంకుల్లో డిజిటల్ కార్డులతో ఆయిల్ కొట్టించే బాధ్యతను జీవీఎంసీ మెకానికల్ విభాగం చూస్తోంది. ఇంత వరకు బాగానే ఉన్నా కొన్ని పెట్రోలు బంకుల యజమానులతో కొందరు అధికారులు కుమ్మక్కై డీజిల్‌ను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాహనాలకు రోజుకు వంద లీటర్లు డీజిల్ కొట్టిస్తున్నట్లు లెక్కల్లో చూపిస్తుండగా, వారానికి ఒక్కసారి కూడా వార్డుల్లో ఫాగింగ్ వాహనాలు తిరిగిన జాడ కనిపించడం లేదు. ప్రతి నెలా ఈ వాహనాల ద్వారానే రూ.10లక్షల మేర నిధులు స్వాహా చేస్తున్నట్లు అంచనా.

**మా వాహనాలకు నింపండి..**

వార్డుల్లో హ్యాండ్ మిషన్లతో ప్రతి రోజూ ఫాగింగ్ చేయాలి. ఫాగింగ్ చేసినట్లు కార్పొరేటర్ సంతకం పెడితేనే బిల్లులు మంజూరు చేస్తారు. ఇక్కడే అసలు కథ మొదలవుతోంది. కొందరు కార్పొరేటర్లు, చోటా నాయకులు వార్డుల్లో ఫాగింగ్ పక్కన పెట్టి, ఆ డీజిల్‌ను సొంతానికి ఉపయోగించుకుంటున్నారు. 'ఈ రోజు నా వార్డులో ఫాగింగ్ అవసరం లేదు. నా కారుకు కొట్టండి' అంటూ కొందరు ప్రజాప్రతినిధులు డీజిల్‌ను వాడేస్తున్న ఘటనలు ఇప్పటికే వెలుగులోకి వచ్చాయి. అధికారుల సమర్పించిన లెక్కలపై గతంలో ఫిర్యాదులు అందడంతో అప్పటి కమిషనరు ఆదేశాలతో విచారణ సైతం జరిగింది. ప్రస్తుతం మళ్లీ అదే పరిస్థితి కొనసాగుతోంది. విచిత్రమేమంటే 8 ఫాగింగ్ వాహనాల్లో కొన్ని మరమ్మతులకు గురై జీవీఎంసీ కార్యాలయంలోనే ఉన్నా.. లెక్కల్లో మాత్రం ఆ వాహనాలు నగరంలో తిరుగుతూ ఫాగింగ్ చేస్తున్నట్లు చూపిస్తున్నారు.

**సీజనల్ సిబ్బంది ఎక్కడ?**

దోమల నివారణకు సీజనల్ వర్కర్స్ పేరుతో రెండు నెలల కోసం 400 మంది సిబ్బందిని జీవీఎంసీ పరిధిలో నియమించుకున్నారు. ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున వేతనం ఇస్తున్నారు. వీరిలో అధికశాతం ముఖ ఆధారిత హాజరు కాగానే క్షేత్రస్థాయిలో కనిపించడం లేదనే ఆరోపణలున్నాయి. కొందరు కార్పొరేటర్లు తమ అనుచరగణానికే ఈ పోస్టులు ఇప్పించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

**జీవీఎంసీలో..**

ఫాగింగ్ వాహనాలు: 8

రోజుకు ఇచ్చే ఆయిల్ (ఒక్కో దానికి): 100 లీటర్ల డీజిల్, 10 లీటర్ల పెట్రోలుచిన్న యంత్రాలు (హ్యాండ్ మిషన్లు): 50

రోజుకు ఇచ్చే ఆయిల్ (ఒక్కోదానికి): 15 లీటర్ల డీజిల్, 2లీటర్ల పెట్రోలు

# దోమలతో సమరం.. రోగాల భయం

కావలి : జిల్లాలోని వసతి గృహాలు చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమలు రాజ్యమేలుతున్నాయి. కొన్నిచోట్ల చుట్టూ మురుగునీరు చేరింది. కొన్నింటిలో మరుగుదొడ్లు వినియోగించేందుకు పనికి రాకుండా ఉన్నాయి. ఈపరిస్థితుల్లో వీటిలో ఉండే బాలలు అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాంలో ఉన్న గిరిజన బాలికల గురుకులంలో అధ్వాన పరిస్థితులతో 100 మందికిపైగా అస్వస్థతకు గురయ్యారు. ఈనేపథ్యంలో జిల్లాలోని వసతిగృహాలపై పరిశీలనాత్మక కథనం.

**మంత్రి చెప్పినా..**

బోగోలు మండలంలోని కప్పరాళ్లతిప్పలో గురుకుల బాలికల పాఠశాల ప్రాంగణంలో భారీ నీటి నిల్వ గుంతతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో పాముకాటుతో అస్వస్థతకు గురైన బాలికను పరామర్శించేందుకు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వచ్చారు. గుంత పూడ్పిస్తామని చెప్పారు. ఏడాది దాటినా ఈపని చేయలేదు. తాజాగా వచ్చిన ప్రిన్సిపల్ నర్సమ్మ కంచె వేయించారు. నీటి నిల్వతో అంటువ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని బాలికలు భయపడుతున్నారు. ఇక్కడ 457 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు.

**అపరిశుభ్రమే!**

వింజమూరు బీసీ్మ బాలుర వసతిగృహంలో మరుగుదొడ్ల బేసిన్లు దెబ్బతిన్నాయి. గార పట్టి అపరిశుభ్రంగా ఉన్నాయి. పరిసరాలు మరీ దారుణంగా ఉన్నాయి. భవనం శ్లాబ్ పెచ్చులూడింది. ఎస్సీ బాలుర వసతిగృహంలో మరుగుదొడ్ల వద్ద దుర్వాసన వస్తోంది. పరిసరాల్లో వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోంది. మరుగుదొడ్డికి తలుపు లేదు. హాస్టల్ ముందు బురద ఉంది. దోమలు ముసురుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

**శిథిలం భయం.. భయం**

జలదంకిలో దశాబ్దాల క్రితం నిర్మించిన బీసీ బాలుర వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. ఇందులో 40 మంది విద్యార్థులు ఉన్నారు. గదుల్లో శ్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో పక్కనున్న గదుల్లో పెట్టెలు పెట్టుకొని భయాందోళనల మధ్య



నిద్రిస్తున్నారు. స్నానాల గదులు, మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయాయి. చుట్టూ చెట్లు పెరిగాయి. విషపురుగులు వస్తున్నాయని విద్యార్థులు భయపడుతున్నారు.

**పారిశుద్ధ్యం అధ్వానం**

కావలిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం-1, 2లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. దోమలతో విద్యార్థులు సమరం చేస్తున్నారు. ఈ రెండింటిలో 49 మంది ఉన్నారు. గతంలో కిటికీలకు మెష్‌లు అమర్చగా అవన్నీ ధ్వంసమయ్యాయి. పక్కనే ఉన్న గిరిజన బాలుర గురుకులంలోనూ ఇదే పరిస్థితి. నిత్యం వచ్చే చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య సిబ్బంది తీసుకెళ్లడం లేదు. దీంతో కుప్పగా పోసి కాల్చేసున్నారు.

**గడ్డితో అవస్థలు**

సీతారామపురంలోని వసతిగృహ ఆవరణ అంతా మట్టి నేల కావడంతో గడ్డి విపరీతంగా పెరిగి దోమలతో విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతున్నారు. రాత్రిళ్లు నిద్రపోలేకున్నారు. జ్వరపీడితులయ్యే అవకాశాలున్నాయి. ఎస్సీ వసతిగృహంలోనూ ఇదే పరిస్థితి. ఫ్లోరింగ్ ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందని విద్యార్థులు కోరుతున్నారు.

# కాలువ పూర్తి.. పరిహారం మరిచి!

కొండాపురం : సోమశిల జలాలను రాళ్లపాడుకు తరలించేందుకు ఉత్తర కాలువను విస్తరించాలని నిర్ణయించారు. ఆ మేరకు పదేళ్ల కిందటే చింతలదేవి, ఉప్పులూరు గ్రామాల పరిధిలో రైతుల నుంచి భూములు సేకరించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇప్పటికీ పరిహారం అందక పోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**జాబితా తయారీలోనే...**


కాలువ నిర్మాణంలో ఎంత మంది రైతుల భూములు పోతున్నాయనే వివరాలతో రూపొందించిన జాబితాపైనే నాడు వివాదం ఏర్పడింది. గ్రామంలో లేని, భూములు లేని వారి పేర్లు అందులో వచ్చాయి. దాంతో పట్టా భూమి ఎంత? అసైన్డ్ ఎంత ఉందనే వివరాలు ఇవ్వాలని అధికారులను రైతులు కోరారు. ఆ క్రమంలో మళ్లీ జాబితా తయారు చేసి.. ఉన్నతాధికారులకు అందజేశారు. రైతులు ఎకరాకు రూ. 1.20 లక్షలు, బావులు, చెట్లు తదితరాల వాటికి అదనంగా పరిహారం అందించాలని కోరారు. ఆ పీటముడితో జాప్యం జరిగింది. చివరకు ఎకరాకు రూ. 80వేల చొప్పున నిర్ణయించి.. సుమారు రూ. కోటి కోర్టుకు అందజేసింది.

**170 మంది.. 150 ఎకరాలు..**

2008లో భూములు తీసుకోగా.. నాటి నుంచి కోర్టులో ఉన్న అవార్డు నగదు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. సుమారు 170 మంది 150 ఎకరాలను కోల్పోయారు. మోపాడు కాలువ కింద పండే.. జీవనాధారంగా ఉన్న భూములు కోల్పోయి.. మరోవైపు పరిహారం అందక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అందేలా చూడాలని కోరుతున్నారు.

దీనిపై కొండాపురం తహసీల్దారు సురేష్‌బాబు మాట్లాడుతూ.. రైతుల సమస్య మా దృష్టికి రాలేదు. వివరాలు తెలిపితే.. పరిశీలించి.. ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

# నదిని మింగిన మొసళ్లు



నంద్యాల : నంద్యాల పట్టణాన్ని ఆనుకుని ప్రవహిస్తున్న కుందూ నది కబ్జా కోరల్లో చిక్కుకుంది. నంద్యాలలోని వీవీ నగర్ వెనుక భాగం నుంచి ప్రారంభమయ్యే కుందూ నది 8 కి.మీల పొడవునా పట్టణం మీదుగానే సాగుతుంది. ఈ నది మార్గంలోని పీవీ నగర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వెనుక వరకు 220.39 ఎకరాలు, కర్నూలు బైపాస్ మార్గంలో 110.26 ఎకరాలు, ఉడుమాల్పురం, కాంతినగర్ ప్రాంతాల్లో మరో 109 ఎకరాలకుపైగా పట్టా భూమి ఉంది. కుందూ నదికి, పట్టా భూములకు మధ్యనున్న కుందూ పోరంబోకు క్రమంగా ఆక్రమణలకు గురైంది. పలువురు వ్యక్తులు దీనిని తమ పట్టా భూముల్లో కలిపేసుకున్నారు. మరికొంతమంది నది శిఖం భూమిని ఆక్రమించి చదును చేసి ప్లాట్లు వేశారు.పోరంబోకు భూముల్లో పంటలు కుందూ నది ఆనుకుని 500 ఎకరాలకుపైగా పోరంబోకు భూమి ఉంది. దీనిపై కన్నేసిన అక్రమార్కులు అందినకాడికి ఆక్రమించారు.

మూలసాగరం పరిధిలోని 271, 279-ఏ సర్వే నంబర్లలోని భూమి కబ్జా కోరల్లో చిక్కుకుంది. ఈ భూమికి సంబంధించి నీటి పారుదల శాఖ వద్ద సరైన దస్త్రాలు లేవు.

సర్వే నంబర్ల వారీగా రెవెన్యూ శాఖలో వివరాలు కనిపిస్తున్నప్పటికీ.. పోరంబోకు భూమి ఏమేరకు ఆక్రమణకు గురైందన్న విషయం లేదు. రెండు శాఖల మధ్య సమన్వయ లోపం.. అక్రమార్కులకు వరంగా మారింది.

గతంలో పనిచేసిన కొందరు వీఆర్వోల సాయంతో పలువురు వ్యక్తులు సర్వే నంబరు 291, 271, 279, 504లోని పోరంబోకును ఆక్రమించుకున్నారు. కొన్నింటికి అక్రమంగా పట్టాలు పుట్టించారు.

**100 ఎకరాలకుపైగా స్వాహా**

జిల్లా కేంద్రంలో కుందూ పరివాహక ప్రాంతంలోని పట్టా భూమి 700 ఎకరాలకుపైగా ఉంది.. పోరంబోకు భూమి 183 ఎకరాలుగా ఉంది. ప్రస్తుతం పోరంబోకు భూమి దాదాపు ఆక్రమణలకు గురైంది. కర్నూలు బైపాస్ మార్గంలో ఆక్రమించి మునగ తోట సాగు చేస్తున్నారు. ప్రథమ నంది వెనుక వైపు కొంత భూమిలో మామిడి, సపోట తోటలు సాగవుతున్నాయి.

సర్వే నంబరు 383, 161లో కొంత భూమిని ఆక్రమించి ఇతరులకు విక్రయించారు. సర్వే నంబరు 504, 505లో ఆక్రమణలకు గురైన భూమికి సంబంధించి గత పదేళ్లుగా పెద్దఎత్తున క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.

**హద్దులు చెరిపి ఆక్రమణ**

కర్నూలు బైపాస్ రహదారిలోని జగనన్న లేఅవుట్‌లో ప్లాట్లు కేటాయించిన ప్రాంతంలోని కొంత భూమిని పలువురు ఆక్రమించి వరి సాగు చేస్తున్నారు. ఎస్సార్బీసీ కాలనీ మార్గంలో టిడ్కో గృహాల వెనుక వైపు పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో అధికారులు రాళ్లు పాతి ప్లాట్లు కేటాయించారు. వీటిని తొలగించి పంటలు వేశారు. ఆక్రమణలు భారీగా పెరిగిపోవడంతో కుందూ నది తరచూ వరద బారిన పడుతోంది. నీటి పారుదల శాఖ అధికారులు గతంలో ఆక్రమిత భూమిపై సర్వే చేయాలని నిర్ణయించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. మరోవైపు ఈ భూముల్లోనే గతంలో రెవెన్యూ శాఖ పట్టాలిచ్చింది. దీని మాటున కొన్ని ప్రాంతాల్లో అక్రమాలు జరిగాయి.

# పేలని.. చూద్దాం



కర్నూలు : జిల్లాలో బాణసంచా వ్యాపారుల అక్రమ నిల్వలు, అనధికార విక్రయాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గతేడాది దీపావళిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, ఆలూరులో 130 మందికి బాణసంచా విక్రయించుకునేందుకు కొంత గడువుతో తాత్కాలిక అనుమతులు ఇచ్చారు. అత్యధికంగా కర్నూలు నగరంలో 100 మంది అనుమతులిచ్చారు. కేవలం నాలుగురోజులపాటు మాత్రమే అమ్ముకొని మిగిలిన సరకును తిరిగి హెూల్‌సేల్ దుకాణాలకు అప్పగించాలని ఆంక్షలు విధించారు. వ్యాపారులు ఇవేవీ పట్టించుకోవడం లేదు.

**దృష్టి సారిస్తే మేలు**

ఆయా తయారీదారులు శుభకార్యాలకు, పండగల సందర్భంగా ఆర్డర్ ఇస్తే తయారు చేసి విక్రయిస్తున్నారు. మండల కేంద్రాలు, పల్లెల్లో చట్టవిరుద్ధంగా తయారయ్యే టపాసులే ఎక్కువగా వినియోగిస్తున్నారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించటంతో ఏడుగురు మృతి చెందిన నేపథ్యంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీపావళి పండగ సమీపిస్తున్న నేపథ్యంలో మూడు ప్రభుత్వశాఖల అధికారులు బాణసంచా అక్రమ నిల్వలపై దృష్టి సారించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

**గుట్టుగా దాచారు**

వ్యాపారులు ప్రొద్దుటూరు, హైదరాబాద్‌లో హెూల్‌సేల్ దుకాణాల నుంచి తెప్పించుకొన్నారు. మిగిలిపోయిన సరకును అక్రమంగా రహస్య ప్రదేశాల్లో నిల్వ ఉంచుకున్నారు. వినాయక చవితి పండగ సందర్భంగా భారీ మొత్తంలో టపాసులను విక్రయించారు. కర్నూలులో వినాయక నిమజ్జన ఊరేగింపులో విగ్రహ నిర్వాహకులు, భక్తులు పెద్దఎత్తున టపాసులు కాల్చారు. అదంతా స్థానిక వ్యాపారులు అక్రమంగా నిల్వ ఉంచుకున్నవే అని సమాచారం.

రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపకశాఖల అధికారులు అక్రమ నిల్వలు, విక్రయాలపైన దృష్టి సారించలేదు. ఎక్కడా తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేవు. అగ్నిప్రమాదం జరిగితే చూద్దాం అన్నట్లుగా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

# ఇష్టమొచ్చినట్లు వేస్తాం.. ఇష్టారాజ్యంగా అమ్మేస్తాం



చిత్తూరు : వ్యవసాయ భూమిలో లేఅవుట్ వేయాలంటే భూ మార్పిడి రుసుం చెల్లించాలి. తర్వాత ఇంటి స్థలాలుగా మార్చాలంటే 30 అడుగుల రహదారులు, తాగునీరు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలి. 10 శాతం కాలువలకు, 10 శాతం రోడ్లకు, 10 శాతం సామాజిక అవసరాలకు వదలాలి. ఇవేమీ లేకుండా లేఅవుట్లు వేసి అమాయకులకు అంటగడుతున్నారు స్థిరాస్తి వ్యాపారులు.

జిల్లాలో చుడా, తుడా, పీకేఎం ఉడా పరిధిలో 86 లేఅవుట్లకే అనుమతులు ఉన్నాయి. 286 అనధికారికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిలో ఇప్పటి వరకు క్రమబద్ధీకరణకు 23 లేఅవుట్లకు మాత్రమే దరఖాస్తు చేశారు. మిగిలిన వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించినా, వారికున్న పలుకుబడితో ముందుకు రావడం లేదు.నిబంధనలకు విరుద్ధంగా వేసిన అక్రమ వెంచర్లతో గత రెండేళ్లలో ప్రభుత్వం రూ.25 కోట్ల ఆదాయం కోల్పోయినట్లు అధికారుల అంచనా. **ఇక్కడే ఎక్కువ...** బైరెడ్డిపల్లి, బంగారుపాళ్యం, గంగవరం, చిత్తూరు, జీడీనెల్లూరు, గుడిపాల, ఐరాల, కార్వేటినగరం, నింద్ర, నగరి, పలమనేరు, పెనుమూరు, పులిచర్ల, పూతలపట్టు, పుంగనూరు, రామకుప్పం, రొంపిచర్ల, శాంతిపురం, సదుం, తవణంపల్లి, వి.కోట, విజయపురం మండలాల్లో అనధికార లేఅవుట్లు ఎక్కువ ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

**పంచాయతీల వాటా అందడం లేదు** లేఅవుట్ల క్రమబద్ధీకరణ రుసుంలో పంచాయతీలకు వాటా అందాలి. ఇటీవల కాలంలో ఆ మొత్తం రావడం లేదు. ఇక నుంచి స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా జమ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అక్రమ లేఅవుట్ల ద్వారా పుర, నగరపాలక సంస్థలతో పాటు గ్రామ పంచాయతీలకూ నష్టం.

# చట్టం.. ఆ అధికారులకు చుట్టం!

నెల్లూరు: 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పేరుతో వైకాపా ప్రభుత్వంలో జిల్లాలో జరిగిన దోపిడీ అంతా ఇంతా కాదు. మొత్తం 97,465 ఇళ్లు మంజూరు కాగా- ఆప్షన్-3 పేరుతో 28,826ను గుత్తేదారులకు అప్పగించారు. ఇప్పటి వరకు మొత్తంగా 39,985 పూర్తయినట్లు లెక్కలు చెబుతున్నా.. వాటిలో ఆప్షన్-3లో నిర్మించినవి 6,388 మాత్రమే. మిగిలినవి వివిధ దశల్లో ఉండగా- అత్యంత నాసిరకంగా కట్టిన గుత్తేదారులకు.. అప్పటి కొందరు అధికారులు సహకరించారు. లబ్ధిదారులకు కేటాయించిన స్టీలు, సిమెంట్, ఇసుక పక్కదారి పట్టించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిపై విచారణ చేయించగా.. రూ. 120 కోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఆ తర్వాత అంత మొత్తం జరగలేదని చెప్పడమూ విమర్శలకు తావిచ్చింది. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన సామగ్రిని బయటకు పంపినట్లు తేలినా.. నాణ్యతకు తిలోదకాలు ఇచ్చినా.. కనీసం చర్యలు తీసుకోలేదు. ఎక్కడైనా ప్రజాప్రతినిధులు గట్టిగా అడిగితే.. ఏదో నామమాత్రపు కారణం చూపి సస్పెండ్ చేస్తుండటం గమనార్హం.

**దృష్టాంతాలివిగో...**

నెల్లూరు నగరంలో కీలక స్థాయిలో పనిచేస్తున్న ఓ అధికారికి.. వెంకటాచలంలో అవే బాధ్యతలు అప్పగించడంతో పాటు జిల్లా కార్యాలయంలోనూ మరో పోస్టు కేటాయించారు. ఈయనపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు ఉండటం గమనార్హం. వరిగొండలో నాసిరకం ఇళ్లు నిర్మించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు పట్టుబడితే.. కేవలం 190 సిమెంట్ బస్తాలు గడ్డ కట్టినట్లు చూపి సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఇద్దరు ఏఈల పాత్ర ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నా.. ఒకరిపై చర్యలు తీసుకుని.. మరొక ఏఈపై ఎండీకి లేఖ రాయడంతో సరిపెట్టారు.

నాడు కావలిలో కీలకంగా వ్యవహరించిన మండల ఇన్‌ఛార్జి(అవుట్ సోర్సింగ్) అర్బన్‌లో నిర్మాణాల నాణ్యతను గాలికి వదిలేయడంలో



కీలకంగా వ్యవహరించారు. ఆ క్రమంలో 5,950 బస్తాల సిమెంట్, 27 టన్నుల స్టీలు కనిపించకుండా పోయినా.. రెండేళ్లుగా చర్యలు తీసుకోలేదు. వెంకటాచలంలో ఓ అధికారిపై భారీగా ఆరోపణలు రావడంతో.. సస్పెండ్ చేశారు. ఆ స్థానంలో ఆయన కుమార్తెకే బాధ్యతలు ఇవ్వడం గృహ నిర్మాణశాఖ అధికారులకే చెల్లింది.

దగదర్తిలో ఉన్న ఓ అవుట్ సోర్సింగ్ సిబ్బందిపై పెద్దఎత్తున ఆరోపణలు ఉండగా.. చర్యలు తీసుకోకపోగా.. ఆయనకే మూడు మండలాల బాధ్యతలు అప్పగించారు.

గృహ నిర్మాణశాఖలో ఇంటి దొంగలపై చర్యలకు ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అలుసో.. అధికారం అండగా ఉందన్న ధీమానో.. గత అక్రమాలను కప్పి పుచ్చుకోవడంతో పాటు కొత్త దోపిడీకి తెరదీస్తున్నారు. ఇప్పటి వరకు 8 మందిపై చర్యలు తీసుకున్నా.. వారిపై నామమాత్రపు కారణాలు చూపడం.. కొందరిపై అసలు చర్యలకు ఉపక్రమించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

# భారీ విస్ఫోటనాలు.. భయాందోళనలు!

ఆనందపురం : శుభకార్యాలు, పండగలు, రాజకీయ నాయకుల స్వాగతోత్సవాలకు బాణసంచా వినియోగం విరివిగా పెరిగింది. దీంతో కొంతమంది అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మందుగుం డు సామగ్రి తయారీని కుటీర పరిశ్రమగా మార్చుకుంటున్నారు. పైగా విధివిధానాలను పాటించకపోవడంతో భారీ విస్ఫోటనం జరిగి భయానక పరిస్థితులు సంభవిస్తున్నాయి. అధిక సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం లోని బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించి ఎనిమిదిమంది మృతి చెందిన ఘటన కలచివేసింది. నగరంలో పలుచోట్ల అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా బాణసంచా తయారీ కేంద్రాలు కొనసాగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

**ఎక్కడికక్కడ ముడిసరకు లభ్యం:** బాణసంచా తయారీకి వినియోగించే ముడిసరకు గన్ పౌడర్, కోల్ పౌడర్, సల్ఫర్, ఐరన్ కోర్, సురేకారం ఎక్కడికక్కడ దుకాణాల్లో దొరుకుతోంది. దీంతో పలువురు వాటిని కొనుగోలు చేసి స్వయంగా తయారీకి సిద్ధమవుతున్నారు. ఇటీవల విజయదశమి వేడుకల సందర్భంగా భీమిలి నియోజకవర్గం వలందపే ట గ్రామంలో మందుగుండు సామగ్రి తయారీకి ప్రయత్నించగా రాత్రివేళ భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఇప్పటికీ వీరు చికిత్స పొందుతున్నారు.



**ఇటీవల పోలీసులు దాడులు చేయగా..:** ఆనందపురం, పద్మనాభం, భీమిలి, భోగాపురం మండలాల్లో బాణసంచా తయారీ కేంద్రాలపై పోలీసులు దాడులు చేసి భారీ మొత్తంలో మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

ఆనందపురం మండలంలో శొంఠ్యాం, పెద్దిపాలెం, వెల్లంకి, నేలేరు, దిబ్బడిపాలెం గ్రామాల్లో విశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేయగా ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఇద్దరికి రిమాండ్ విధించారు.భీమిలి మండలంలో వలందపేటకు చెందిన ముగ్గురిపై.. అలాగే పద్మనాభం మండలంలో అర్చకులవానిపాలెం వద్ద ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకు ఆనందపురం మండలంలోని ముచ్చర్ల, బొడ్డపాలెం, గిడిజాల ప్రాంతాల్లో బాణసంచా తయారీ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు.భీమిలి, పద్మనాభం, రెడ్డిపల్లి, పాండ్రంగి, కొవ్వాడ, కురపిల్లి, నియోజకవర్గ సరిహద్దు ప్రాంతాలు కపులవాడ, తుడాం, బసవపాలెం గ్రామాల్లోనూ తయారీ కేంద్రాలు ఉన్నట్లు సమాచారం. మరోవైపు పోలీసులు హెచ్చరిస్తున్నా ఏదొక చోట బాణసంచా తయారీ కేంద్రాలు దర్శనమివ్వడంతో భయానక పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రజలు సైతం అప్రమత్తత కాకుంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో రహస్యంగా పేలుడు పదార్థాలను తయారు చేసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సూచిస్తున్నారు.

చురకలు



# చెట్లుంటే దోమలు కుడతాయయంట!

పరిగి : విద్యార్థులకు దోమలు కుడుతున్నాయనే కారణంతో మండలపరిధిలోని కొడిగెనహళ్లి అంధుల ఆశ్రమ పాఠశాలలో పచ్చని చెట్లను ప్రిన్సిపల్ నరికేయించారు. దీనిపై పర్యావరణ ప్రేమికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొడిగెనహళ్లిలో అంధుల ఆశ్రమ పాఠశాలను 1987 ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రారంభంలో పలువురు దాతలు ఇచ్చిన వందలాది మొక్కలను నాటారు. అవి నేడు మహావృక్షాలై పాఠశాలలో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పాఠశాల



ఆవరణలో ఐదు వందలకు పైబడి చెట్లు ఉన్నాయి. ఇటీవల దసరా సెలవుల్లో విద్యార్థులు ఉంటున్న వసతిగృహం సమీపం, ఆవరణలో ఉన్న టేకు, నీలగిరి, కానుగ చెట్లను ప్రిన్సిపల్ కొట్టి వేయించారు. 40 ఏళ్ల పాటు నుంచి ఉంటున్న చెట్లను ఒక చిన్న కారణంతో వృక్షాలను తొలగించడంపై ఫిర్యాదులు వెళ్లడంతో పెనుకొండ అటవీ శాఖ అధికారులు పరిశీలించి వెళ్లారు. దీనిపై ప్రిన్సిపల్ రాజేశ్వరిని వివరణ కోరగా దోమలు కుడుతున్నాయనే కారణంతో చెట్లను తొలగించామని ఆమె నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. తొలగించిన చెట్లను ఎక్కడికి తరలించిందీ తెలియలేదు. దీనిపై పూర్తి విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# త్రిపురాంతకానికి మహర్దశ వచ్చేనా?

త్రిపురాంతకం : రాష్ట్రంలోని 27 ప్రముఖ ఆలయాలతో పాటు త్రిపురాంతకం క్షేత్రం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించడంపై భక్తుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. చారిత్రక నేపథ్యమున్న ప్రసిద్ధిగాంచిన ఆలయాల్లో త్రిపురాంతకం ఒకటి. పదో శతాబ్దం నుంచి చోడరాజులు, చోళులు, కాకతీయులు, రెడ్డి రాజులు ఆలయాలను పోషించారు. రాణి రుద్రమదేవి ఇక్కడ నుంచి పరిపాలన సాగించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న త్రిపురాంతకం క్షేత్రం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడ వేసిన చందంగా ఉంది. పాలకులు, అధికారులు మారుతున్నా భక్తులకు కనీస వసతుల కల్పనకు నోచుకోకపోవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. 2014లో తెదేపా ప్రభుత్వ హయాంలో శిద్దా రాఘవరావు మంత్రిగా ఉన్నప్పుడు గ్రామం నుంచి ఆలయాల వరకు రహదారులు నిర్మించడంతో పాటు ఒకరిద్దరి ఈవోల హయాంలో భక్తుల ద్వారా ఆలయాల్లో కొంత మేర సౌకర్యాలు కల్పించడం తప్ప భక్తులు ఒక రాత్రి ఉండాలంటే కనీస వసతి లేదు. ఏడాదికి రూ.కోటి ఆదాయం లభిస్తున్నా మౌలిక వసతులు లేకపోవడంపై భక్తులు పెదవి విరుస్తున్నారు. త్రిపురాంతకం క్షేత్రానికి నాలుగు వైపులా రాజగోపురాల్లో దక్షిణం వైపు గోపుర నిర్మాణం 14 ఏళ్ల నుంచి సాగుతోంది. ఉత్తర, పడమర రాజగోపురాలు శిథిలావస్థలో ఉన్నాయి.

శాసనాలకు ఖిల్లా త్రిపురాంతకం క్షేత్రమని చెబుతారు. దాదాపు 100 వరకు శాసనాలుండడం విశేషం. త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం సమీపంలో పడిపోయిన గోళకీ మఠాన్ని కాకతీయుల కాలంలో గణపతి దేవుడు గురువు విశ్వేశ్వర శివదేశికాచార్యులు నిర్మించగా ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. రుద్రమదేవి యువరాణిగా ఉన్నప్పుడు మూడు సార్లు త్రిపురాంతకంలో పర్యటించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. కాకతీయులు త్రిపురాంతకాన్ని తొలి పరిపాలనా కేంద్రంగా వరంగల్లు రెండో కేంద్రంగా పరిపాలన సాగించినట్లు త్రిపురాంతకానికి చెందిన ప్రముఖ చారిత్ర పరిశోధకులు తురిమెళ్ల శ్రీనివాస ప్రసాద్ పరిశోధనలో తేలినట్లు తెలంగాణ ప్రభుత్వం కూడా ధ్రువీకరించింది. అమ్మదేవుడు, రుద్రమదేవి మధ్య ఇక్కడే యుద్ధం జరిగిందని కథనం. రుద్రమదేవి విగ్రహం త్రిపురాంతకంలో బయటపడింది. ఈ క్రమంలో ఆలయంలోని శాసనాలను పురావస్తుశాఖ అధికారులు రక్షిస్తే భావితరాలకు ఆనవాళ్లుగా నిలుస్తాయి. కూతవేటు దూరంలో సాగర్ కాలువ నుంచి పైపులైను వేసి త్రిపురాంతకం చెరువును నీటితో నింపి పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని భక్తులు కోరుతున్నారు. అభివృద్ధికి ప్రణాళికలు పంపాం: త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీదేవి ఆలయాల అభివృద్ధికి రూ.2.30 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం,. నిధులు మంజూరైన వెంటనే పనలు ప్రారంభిస్తాం. డి.అనిల్‌కుమార్, ఈవో, త్రిపురాంతకం దేవస్థానం

# దాచేందుకే కొంటున్నారు!

మొగల్తూరు : బులియన్ మార్కెట్లో ముడి వెండి, బంగారానికి భారీగా డిమాండ్ ఏర్పడింది. జిల్లాలో గతంలో సుమారు రోజుకు రూ.2 కోట్లు పైగా వ్యాపారం జరిగితే వాటిలో ఆభరణాలు 80 శాతం, ముడి బంగారం, వెండి 20 శాతం ఉండేది. ప్రస్తుతం ఆ విధానం తారుమారైందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో రూ.2.50 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకూ కొనుగోలు జరుగుతోంది. అందులో ముడి బంగారం, వెండి సుమారు 80 శాతం పైడి కొనుగోలు చేస్తున్నారు.

వారం తరువాత సరకు అప్పగింత.. ధరల వ్యత్యాసం, నష్టాల భయంతో వ్యాపారులు ముడి సరకు అధిక మొత్తంలో నిల్వ ఉంచడం లేదు. వీటి నిల్వలు బులియన్ డీలర్ల వద్దే ఉంటుంది. జిల్లాలో బులియన్ డీలర్లు లేరు. దీని ప్రభావంతో వ్యాపారులు కొనుగోలుదారుల నుంచి అడ్వాన్సు తీసుకున్న వారం రోజుల అనంతరం ముడి బంగారం, వెండి అప్పగిస్తున్నారు. వంద గ్రాముల మేలిమి బంగారం (24 క్యారెట్లు) పది రోజుల కిందట రూ.11.80 లక్షలకు విక్రయించారు. గురువారం మధ్యాహ్నానికి అది రూ.12.85 లక్షలకు పెరిగి సాయంత్రానికి రూ.12.60 లక్షలకు తగ్గింది. ఆభరణాల తయారీ బంగారం రూ.10.90 లక్షల నుంచి రూ.11.80 లక్షలకు పెరిగి రూ.11.65 లక్షలకు దిగివచ్చింది. కిలో వెండి రూ.1,39,600 నుంచి రూ.1.80 లక్షలకు.. అక్కడ నుంచి రూ.1.67 లక్షలకు తగ్గింది. నిబంధనల అమలులో భాగంగా కొనుగోలుదారుల నుంచి పాన్‌కార్డు, ఆధార్ కార్డు తీసుకుని వాటి వివరాలు నమోదు చేసిన అనంతరం నగదు ఆర్టీజీఎస్ విధానంలో బదిలీ చేయించుకుని వారం, పది రోజుల కొనుగోలుదారులకు సరఫరా చేస్తున్నామని బులియన్ వ్యాపారుల సంఘ నరసాపురం శాఖ అధ్యక్షుడు వినోద్‌కుమార్ జైన్ తెలిపారు.

# 'పెన్నా'ను పంచేసుకున్నారు!



అనంతపురం: పామిడికి చెందిన సోదరులు పెన్నా నదిని సొంత ఆస్తిలా పంచేసుకున్నారు. ఏటి గట్టున ఉన్న తమ పొలాలకు సమాంతరంగా నదిని ఆక్రమించి ఇటుకల వ్యాపారం సాగిస్తున్నారు. భారీ షెడ్లు నిర్మించి చిన్నపాటి పరిశ్రమ నడిపిస్తున్నారు. ట్రాక్టర్లలో టన్నుల కొద్ది మట్టిని తీసుకొచ్చి నది గర్భంలో ఇటుకలు తయారు చేస్తున్నారు. నిరంతరం జేసీబీలు, ట్రాక్టర్లు పని చేస్తూనే ఉన్నాయి. హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఇదంతా జరుగుతుండటం గమనార్హం. వైకాపా ప్రభుత్వంలో మొదలైన కబ్జాపర్వం ఇప్పటికీ కొనసాగుతోంది. అధికార పార్టీ స్థానిక నాయకులు కబ్జాదారులకు సహకరిస్తుండటంతో అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇష్టారాజ్యంగా..**

సోదరుల్లో ఒకరు ప్రతిపక్ష పార్టీ కాగా మరొకరు అధికార పార్టీలో కొనసాగుతున్నారు. వారికి పెన్నానదిని ఆనుకుని పొలాలు ఉన్నాయి. రాజకీయ పార్టీల అండతో నదిని ఆక్రమించి ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. 15 ఎకరాల మేర కబ్జాచేసి శాశ్వతంగా షెడ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక ప్రజాప్రతినిధి అండతో మరింత రెచ్చిపోతున్నారు. ఇటుక బట్టీలను విస్తరించి వ్యాపారాన్ని పెంచుకున్నారు. సోదరుల కనుసన్నల్లోనే ట్రాక్టర్ల ద్వారా నిరంతరం ఇసుక అక్రమ రవాణా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరు అధికారంలో ఉన్నా తమ జోలికి రాకుండా ఒక్కొక్కరు ఒక పార్టీలో కొనసాగుతూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు.

**సర్వే చేసి వదిలేశారు** పామిడి సమీపంలో పెన్నానది ఆక్రమణలపై ఫిర్యాదులు రావడంతో గతేడాది కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. వందలాది ఎకరాల్లో నది కబ్జాకు గురైనట్లు తేల్చారు. ఆక్రమణలను తొలగిస్తామని స్పష్టం చేసిన అధికారులు తర్వాత పట్టించుకోలేదు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే స్థానిక అధికారులు చర్యలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నది ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ ఆనంద్ వివరణ కోరగా.. విషయం తన దృష్టికి రాలేదన్నారు. తహసీల్దార్ ద్వారా విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# పసిప్రాయంలోనే ప్రసవ వేదనలా?



అనంతపురం : గడిచిన ఐదు నెలల్లో గుమ్మఘట్ట పీహెచ్‌సీ పరిధిలో 583 సాధారణ ప్రసవాలు జరగ్గా ఇందులో 124 టీనేజీ (18 ఏళ్లలోపు) ప్రసవాలే. అవులుగట్ట పీహెచ్‌సీ పరిధిలో 495 సాధారణ ప్రసవాల్లో 87.., ఎర్రగుంట పీహెచ్‌సీ పరిధిలో 421 ప్రసవాల్లో 79.., కురుగుంట పీహెచ్‌సీ పరిధిలో 1246 ప్రసవాల్లో 122 టీనేజ్ ప్రసవాలున్నాయంటే ఎంతమంది పరిణతి లేని వయసులోనే ప్రసవవేదన భరిస్తున్నారో అర్థం అవుతోంది. కొన్ని పీహెచ్‌సీల పరిధిలో ఆందోళనకర రీతిలో 18 ఏళ్లలోపే ప్రసవాలు జరుగుతున్నా అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదు.

కొంతమంది తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. బాలికలకు ప్రసవం తరువాత ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతుండటం ఆందోళన కల్గించే అంశం. బాల్య వివాహాలను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో పలు కార్యక్రమాలున్నా ఆశించిన ఫలితాలు రాలేదు. ఐసీడీఎస్ విభాగం మిగిలిన ప్రభుత్వశాఖలతో సమన్వయంతో పనిచేస్తున్నా ఆశించిన పురోగతి లేదు.

**అర్థం చేసుకునేవారేరీ?**

ప్రస్తుతం ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తోంది. అయినప్పటికీ కొంతమంది తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. చిన్న వయసులో పెళ్లిల్లు చేయటం ద్వారా ప్రసవ సమయంలో ఇబ్బందిపడి తల్లి లేదా పురిటి బిడ్డ చనిపోయే ఆస్కారాలు ఎక్కువ. ప్రసవ సమయంలో పరిస్థితి విషమిస్తే ఇద్దరూ చనిపోయే పరిస్థితులూ ఉంటాయి. కొంతమంది బాలికలు ఆకర్షణకు గురై తప్పటడుగులు వేసి గర్భం దాలుస్తుండటం కూడా ఆ్రందోళనకర అంశమే. ఆర్ఎంపీలు, వైద్యులు కాసుల కోసం కక్కుర్తి పడి ఇలాంటి కేసుల్లో అబార్షన్లు చేస్తూ ప్రాణాలను గాల్లో కలిపేస్తున్నారు.

**సమన్వయంతో పనిచేస్తాం..డాక్టర్ ఈ.బి.దేవి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి, అనంతపురం**

వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, ఎన్‌జీవో సంస్థలు కలిసి పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి తెలియజేస్తున్నాం. టీనేజీ ప్రసవాలు అధికంగా జరిగిన ప్రాంతాలను గుర్తించి అక్కడ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. అనధికారికంగా ఎక్కడైనా టీనేజీ పిల్లలకు ప్రసవాలు చేసినట్లు ఫిర్యాదులు అందటం లేదు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా ప్రసవాలు చేస్తే బాధ్యులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

# బాటల్లో మలుపు.. బతుకుల్లో కుదుపు



చిత్తూరు : జిల్లాలో మొగిలిఘాట్, తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం భాకరాపేట కనుమ రహదారి ప్రమాదాల నిలయంగా మారింది. తరచూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నా నియంత్రణ చర్యలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. 2019లో రెండు వరుసలుగా ఉన్న పాత మొగిలి ఘాట్ రోడ్డును 4 వరుసలుగా మార్చారు. అయినా ప్రమాదాలకు అడ్డుకట్టపడలేదు. తరచూ జరుగుతూనే ఉన్నాయి. దీనిపై అధ్యయనం చేయడానికి కేంద్రం ఎన్‌హెచ్‌ఐటీ విభాగానికి చెందిన ఒక బృందాన్ని నియమించింది. మలుపులు తొలగించి నేరుగా రోడ్డు వేయాలని సూచించారు. కొందరైతే ఈ రోడ్డు డిజైన్‌లోనే లోపముందని తేల్చేశారు.

**ప్రణాళికలు చేసినా..** తిరుపతి, అనంతపురం జాతీయ రహదారిలో తిరుపతి పీలేరు మార్గమధ్యలోని కల్యాణి డ్యాం నుంచి భాకరాపేట వరకు సుమారు 12 కిలోమీటర్లు రహదారి ఉంది. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా నివారణ చర్యలు పూర్తిస్థాయిలో తీసుకోవడం లేదు.

ప్రమాదాల నివారణకు ఆర్ అండ్ బీ, జాతీయ రహదారి అధికారుల బృందాలు ప్రణాళికలు రూపొందించి అమలు చేసినా పూర్తి స్థాయిలో ప్రమాదాలకు అడ్డుకట్ట వేయలేకపోయారు.

వేగంగా వాహనాలు నడపడం, మార్గంపై అవగాహన లేకపోవడం, మద్యం మత్తు తదితర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దొనకోటి గంగమ్మ మలుపు వద్ద ఉన్న లోయలో మూడు లారీలు, దెయ్యాలకోన వద్ద లోయలో ఓ కారు పడిపోయింది. వాటిని బయటకు తీయలేక అలాగే వదిలేశారు.

**అధికారులు ఏమన్నారంటే..?**

పనులు చేయాలంటే అటవీ శాఖ అనుమతులు కావాలి. అడవి జంతువుల స్వేచ్ఛకు భంగం కలగకుండా, అటవీ సంరక్షణ చట్టాలకు లోబడి ప్రమాదాలు జరగకుండా రహదారి నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తెలిపారు.

**తీసుకున్న చర్యలు**

కి.మీ. దూరానికి స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు
రోడ్డుమధ్యలోసౌర దీపాలు
రోడ్డుపొడవునా బ్లింకర్లు
ఇరువైపులా ఇనుప బీమ్స్‌లతో బారికేడ్లు
ప్రతి 10 అడుగులకు ఎల్లో రేడియం స్ట్రిప్స్

**ఎక్స్‌ప్రెస్ హైవేతో అడ్డుకట్ట**

డిజైన్ రూపొందించడంలో పొరపాటు ఉన్న విషయాన్ని గుర్తించాం. ఇప్పుడు దాన్ని మార్చడం అధిక శ్రమ, ఖర్చుతో కూడుకున్నది. దీనికి పక్కనే ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం వేగంగా సాగుతోంది. అది పూర్తయితే ప్రమాదాలు తగ్గుతాయని అనుకుంటున్నాం. ఇప్పటికే చాలా జాగ్రత్తలు తీసుకున్నాం.

వెంకటేశ్వర్లు, పీడీ, జాతీయ రహదారులశాఖ తిరుపతి విభాగం

ఎక్కడ: కల్యాణి డ్యాం నుంచి అటవీ శాఖ నర్సరీ వరకు
మలుపులు 08
ప్రమాదాల సంఖ్య 08
మృతులు 03
క్షతగాత్రులు 08మంది
ఏడాదిలో జరిగిన ప్రమాదాలు
ప్రమాదాలు 110
మృతులు 18
ఘాట్ ఎక్కడ: చెన్నై, బెంగళూరు మార్గం
దూరం: 01 కి.మీ. మొగిలి నుంచి పలమనేరు వైపు
మలుపులు: 02 (దొరచెరువు, మొగిలి)
ప్రమాదాలకు గురవుతున్న వాహనాల్లో కంటైనర్ల సంఖ్యే ఎక్కువ
ప్రమాదాల్లో నష్టం అంచనా: సుమారు రూ.20 కోట్లు
నివారణకు చేసిన ఖర్చు: రూ.7 కోట్లు (గతేడాది సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు)

# మేం తగ్గం.. తగ్గించం!

ఏలూరు : ఏలూరు బోధనాసుపత్రికి సమీపంగా ఉండే ఓ హోల్‌సేల్ దుకాణంలో అసలు బిల్లు ఇవ్వటం లేదు. బిల్లు అడిగిన వారికి ట్రేడింగ్‌పై ఇచ్చే డిస్కౌంట్ ఇవ్వలేమని చెప్పి దాటవేస్తున్నారు. నగరంలో ఎక్కడా లభ్యం కాని మందులన్నీ ఇక్కడ ఉంటాయి. ఈ కీలక షాపులోనే బిల్లులు ఇవ్వటం లేదు. ఆర్ఆర్‌పేటలోని ఓ ప్రధాన ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న ఔషధ దుకాణంలో ఎన్యూరిజం కిట్లు తీసుకుంటే వారికి ఏమాత్రం పన్ను తగ్గించ లేదు.

జంగారెడ్డిగూడెం- ఏలూరు ప్రధాన రహదారిలో ఓ మందుల దుకాణంలో బిల్లు అడిగితే తెల్లపేపరు మీద రాసిచ్చారు. అందులో కనీసం మందుల వివరాలు రాయలేదు.

అకస్మాత్తుగా కాళ్లు, చేతులు చచ్చుబడిపోయి స్ట్రోక్‌కు గురైనవారు, గుండెపోటు వచ్చినవారికి, పాము కాటుకు గురైనవారికి, ఏదైనా రహదారి ప్రమాదంలో చిక్కుకుని రక్తనాళాలు చిట్లిపోయినవారికి అత్యవసర మందులిస్తారు. వీటిపై తాజాగా కేంద్రం జీఎస్‌టీ బాగా తగ్గించింది. అంతేకాదు కొన్ని సర్జికల్స్ సామగ్రిపై పన్నులు తగ్గాయి. ఈ తగ్గిన జీఎస్‌టీ ఫలాలు ప్రజలకు అందటం లేదు.

జీఎస్టీ 2.0 అమల్లోకి వచ్చి పక్షం రోజులు గడిచిపోయినా ఉమ్మడి పశ్చిమగోదావరి వ్యాప్తంగా చాలా ప్రైవేటు ఆసుపత్రులు, మందుల దుకాణాల్లో కంప్యూటర్ బిల్లులే ఇవ్వటం లేదు. అదేమని ప్రశ్నిస్తే మారిన శ్లాబ్‌ల ప్రకారం సాఫ్ట్‌వేర్ తయారుచేయిస్తున్నామని, కంప్యూటర్



పనిచేయటం లేదని సాకులు చెబుతూ ప్రజలపై యథావిధిగా పన్నుల భారం మోపుతున్నారు.

ఔషధ దుకాణాల్లో రసీదులు ఇవ్వటం లేదని తమకు ఏ మందుపై ఎంత పన్ను తగ్గిందో తెలియటం లేదని చాలా మంది ఏలూరు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. హై యాంటీబయాటిక్స్, స్టంట్లు, హీమో స్టాట్స్, కొన్ని రకాల ఇంప్లాంట్స్, ఎన్యూరిజమ్ కిట్లు, కొన్ని కాయిల్స్ వంటి సర్జికల్స్‌పై పన్ను శాతం తగ్గటంతో ఆమేరకు ఆసుపత్రుల్లో బిల్లులు తగ్గుతాయని ఆశిస్తున్న వారికి చివరకు నిరాశే మిగులుతోంది. గతనెల 22 నుంచి జీఎస్టీ 2.0 అమల్లోకి వచ్చింది. ఇంతకు ముందు ఔషధాలు, సర్జికల్స్‌పై 12, 18 శాతం ఉండే పన్ను 5 శాతానికి తగ్గించారు.

**అప్రమత్తం చేశాం :** 'తగ్గించిన పన్ను రేట్లు అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఫార్మసీ, ల్యాబ్ అసోసియేషన్ ముఖ్య నాయకులను పిలిచి ఇకపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని, కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించాం. రూ.200కు పైబడి మందులు కొనుగోలు చేస్తే కచ్చితంగా బిల్లు అడిగి తీసుకోవాలి' అని ఎస్‌జీఎస్‌టీ సంయుక్త కమిషనర్ నాగార్జునరావు తెలిపారు.

# పుస్తకాలు.. విస్తుబోతున్నాయ్!

పాలకొల్లు : మండల కేంద్రమైన యలమంచిలిలో శాఖా గ్రంథాలయం ఇది. ఏడాది కిందట ఇక్కడి లైబ్రేరియన్‌ను డిప్యుటేషన్‌పై భీమవరం పట్టణానికి పంపారు. అప్పటి నుంచి పుస్తకాలు, నవలలు ఉండే గది మూతపడింది. వాటిలో పుస్తకాల ఎలా ఉన్నాయో తెలియని పరిస్థితి. ఏటా నవంబరులో నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలను సైతం నిర్వహించడం మానేశారంటే ఇక్కడి దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. మొగలూర్తులో శాఖా గ్రంథాలయానిది మరో సమస్య. ఇక్కడ గ్రంథాలయాధికారి ఎప్పుడొస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియదు.

యువతకు విజ్ఞానమందించే ఆలయాలుగా భావించే శాఖా గ్రంథాలయాలు క్రమంగా ఉనికి కోల్పోతున్నాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత నుంచి నవలలు, ఆధ్యాత్మిక గ్రంథాలు చదివేవారి



వరకు సంబంధిత పుస్తకాలు అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 3 గంటలు, సాయంత్రం 3 గంటల పాటు కూడా గ్రంథాలయాలను తెరవకపోవడంతో పాఠకులు వాటికి క్రమంగా దూరమవుతున్నారు.

**సగం మంది కూడా లేరు..** ఉమ్మడి జిల్లా పరిధిలో 74 శాఖా గ్రంథాలయాలకు పర్యవేక్షణాధికారులు 30 మంది కూడా లేరు. జిల్లా కేంద్రమైన భీమవరంతో పాటు కొన్ని పట్టణాల్లో సరిపడా సిబ్బంది లేక గ్రామీణ ప్రాంతాల్లో లైబ్రేరియన్లను డిప్యుటేషన్‌పై నియమిస్తున్నారు. పెనుగొండలో గ్రంథాలయానికి పెరవలి నుంచి లైబ్రేరియన్ ప్రతి మంగళవారం వచ్చి వెళ్తున్నారు. మిగిలిన రోజుల్లో ఏ పుస్తకాలూ అందుబాటులో ఉండటం లేదు. అధికశాతం గ్రామీణ గ్రంథాలయాల్లో దినపత్రికలను మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు.

**కమిటీల నియామకానికి ఆదేశం..** నిర్వహణ మొక్కుబడి తంతుగా మారిన గ్రంథాలయాలకు పాఠకుల కమిటీలను ఈ నెలాఖరు లోపు వేయాలని ఆ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. సిబ్బంది లేక. పుస్తకాలు అందుబాటులో లేని పరిస్థితుల్లో కమిటీలెందుకనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శేఖర్‌బాబును సంప్రదించగా పాత పద్ధతి ప్రకారం కమిటీలు వేయాలని ఉత్తర్వులు వచ్చినట్లు చెప్పారు.ఉండి, యండగండి, కాళ్ల తదితర ప్రాంతాల్లో పత్రికల పఠనం కోసమే గ్రంథాలయాలను తెరుస్తున్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి పోటీ పరీక్షలతో పాటు ఇతర విలువైన పుస్తకాలున్న గదులకు వారానికి ఆర్రోజులు తాళాలు వేసేస్తున్నారు. మంగళవారమే తెరుస్తున్నారు. దీంతో గ్రంథాలయాలకొచ్చే పాఠకుల సంఖ్య నామమాత్రమైపోతోంది.

**ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయాలు ఇలా..**

శాఖా 74 గ్రామీణ 37 పుస్తక నిక్షిప్త కేంద్రాలు 165

# కియారా చెప్పేసింది కాస్కోండిక!

అలనాటి అందాల బాలీవుడ్ తార మీనా కుమారి బయోపిక్ కి రంగం సిద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. సిద్ధార్థ్ పి. మల్హోత్రా ఈ సినిమా బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం స్టోరీ సహా ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగు తున్నాయి. అన్ని పనులు పూర్తి చేసి ఈ ఏడాదిలోనే పట్టాలెక్కించడానికి రెడీ అవుతున్నారు. అయితే మీనా కుమారి పాత్రలో బాలీవుడ్ నుంచి ఏ నటి రంగంలోకి దిగుతుంది? అన్నది ఇంత వరకూ సరైన స్పష్టత లేదు. తొలుత కృతి సనన్ పేరు తెరపైకి వచ్చింది. అటుపై కియారా అద్వాణీ వెలుగులోకి వచ్చింది.

**నేరుగా రంగంలోకి దిగిన కియారా:** కానీ అధికారికంగా ఎలాంటి కన్ఫర్మేషన్ లేకపోవడంతో నటి ఎవరు? అన్నది క్లారిటీ లేకుండా పోయింది. అటు మేకర్స్ గానీ..ఇటు నటీమణులు గానీ ఎవరూ స్పందించలేదు. తాజాగా ఈ ప్రచారంపై కియారా పూర్తి క్లారిటీ



ఇచ్చేసింది. మీనా కుమారి పాత్రలో తానే నటిస్తున్నట్లు అధికారికంగా వెల్లడించింది. కమల్ ఔర్ మీనా టైటిల్ తో ఈ సినిమా తెరకెక్కనుంది. ఇందులో మీనా కుమారి భర్త కమల్ పాత్ర ఏ నటుడు పోషిస్తారు? అన్నది ఆసక్తికరం. ఇంత వరకూ ఆ పాత్రకు సంబంధించి ఎంపిక కూడా పూర్తి కాలేదు.

**ఆమె జీవితం తెరిచిన పుస్తకం:** కొంత మంది యువ నటుల పేర్లు పరిశీలిస్తున్నారు. ఈ పని మనిహా ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి.అయితే ఈ సినిమా మాత్రం వచ్చే ఏడాది ఆరంభంలోనే ప్రారంభించాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ లోగా మిగతా పనులు కూడా పూర్తి చేయనున్నారు.

ఒక్కసారి మీనా జీవితంలోకి వెళ్తే... బాలీవుడ్లో ట్రాజెడీ క్వీన్ మీనా కుమారి కి పేరు గాంచారు. వృత్తి, వ్యక్తిగత జీవితం తెరిచిన పుస్తకం లాంటింది. నటిగా ఎన్నో క్లాసిక్ హిట్స్ తో తనకంటూ బాలీవుడ్ చరిత్రలో కొన్ని పేజీలు రాసిపెట్టారు.

**జీవితాన్ని చిన్నాభిన్నం చేసిన కారణాలు:** సాహిబ్ బివి ఔర్ గులాం, దిల్ ఏక్ మందిర్, ఫూల్ ఔర్ పత్తర్, పకీజా లాంటి చిత్రాలో అప్పట్లో మీనా కుమారి ఓ సంచలనం.

సినిమాలు చేస్తున్నంత కాలం మీనా కుమారి బాలీవుడ్ లో ఓ మెరుపు. అలాగే ఆమె వ్యక్తిగత జీవితం ఎంతో విషాధకరమైంది. ప్రేమ, నిరాశ, మద్యపానం అనే అంశాలు మీనా కుమారి జీవితాన్ని చిన్నాభిన్నం చేసాయి. వృత్తి గత జీవితంలో ఎంత గొప్ప సక్సెస్ సాధించిందో వ్యక్తిగత జీవితంలో అంతకంతకు కోల్పోయింది.

# దృశ్యం 3 ప్లాన్ రివర్స్ అయ్యేట్టు ఉందిగా..!

జీతూ జోసెఫ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ దృశ్యం సినిమాలకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. ముఖ్యంగా మలయాళ మెగాస్టార్ మోహన్ లాల్ తో ఆయన చేసే సినిమాలైతే నెక్స్ట్ లెవెల్ అనిపిస్తాయి. వాటిలో భాగంగా దృశ్యం సీరీస్ లు సూపర్ థ్రిల్ అందించాయి. దృశ్యం సినిమాలు మిగతా సౌత్ భాషలతో పాటు హిందీలో కూడా రీమేక్ అయ్యి సక్సెస్ అందుకున్నాయి. దృశ్యం 1, 2 సినిమాలు అన్ని భాషల్లో మంచి ఫలితాలు అందుకున్నాయి. ఐతే దృశ్యం 3 సినిమాను జీతూ జోసెఫ్ ఒకేసారి అన్ని భాషల్లో తెరకెక్కించాలని అనుకున్నారు. అంటే దృశ్యం ఏ భాషలో రీమేక్ అయ్యిందో అన్నిటిలో అక్కడ హీరోలను కొనసాగిస్తూ పార్ట్ 3 తీయాలని అనుకున్నారు.

**మలయాళంలో మోహన్ లాల్ దృశ్యం 3..** అందుకు తగినట్టుగానే ప్లానింగ్ కూడా చేసుకున్నారు. మలయాళంలో మోహన్ లాల్ దృశ్యం 3 కి అంతా రెడీ అయ్యారు. తెలుగులో దృశ్యం సీరీస్ లు విక్టరీ



వెంకటేష్ చేశారు. హిందీలో అజయ్ దేవగన్ ఆ సినిమాలు చేశారు. తమిళ్ లో కమల్ హాసన్ పాపనాశన్ గా చేసి మెప్పించారు. ఐతే దృశ్యం 3 ని కమల్ చేసే ఛాన్స్ లేదని తెలుస్తుంది. అందుకే మలయాళంతో పాటు తెలుగులో వెంకటేష్ తో.. హిందీలో అజయ్ దేవగన్ తో ఒకేసారి షూట్ చేసే ప్లాన్ చేస్తున్నారు జీతూ జోసెఫ్. ఐతే వెంకటేష్ ఓ పక్క చిరంజీవి సినిమాలో క్యామియోతో పాటు త్రివిక్రమ్ సినిమాకు రెడీ అవుతున్నారు. సో ఇప్పుడు దృశ్యం 3 కి డేట్స్ కుదరవనే చెబుతున్నారట. మరోపక్క హిందీ దృశ్యం 3 కి అక్కడ మేకర్స్ తో కొన్ని లీగల్ ఇష్యూస్ ఉన్నట్టు తెలుస్తుంది. దృశ్యం 3కి జీతు జోసెఫ్ కథ కాకుండా బాలీవుడ్ రైటర్స్ ఒక సీక్వెల్ స్టోరీ రాసుకున్నారట. సో అక్కడ కూడా దృశ్యం 3 తెరకెక్కే ఛాన్స్ లేదు.




# నవంబర్ ఆ ముగ్గురికీ అత్యంత కీలకం!



సక్సెస్ ఇచ్చే కిక్ వేరే లేవల్లో ఉంటుంది. కానీ ఆ కిక్ లో మజా అంత సులభం కాదు. అందుకు అదృష్టం కూడా కలిసి రావాలి. ఎంత మంచి సబ్జెక్ట్ చేసినా కొన్నిసార్లు వైఫల్యాలు తప్పవు. ఆవగింజంత అదృష్టం కూడా తోడైతేనే? కిక్ లో మజా సాధ్యమవుతుంది. అలాంటి మజా కోసం ముగ్గురు హీరోలు చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. నవంబర్ లో ఆ హీరోలు నటించిన సినిమాలు రిలీజ్ కు రెడీగా ఉన్నాయి. సుధీర్ బాబు హీరోగా నటించిన జఠాధర ఈనెల 7న రిలీజ్ అవుతుంది. ఈ సినిమాతో ఎలాగైనా హిట్ అందుకోవాలని ఆశ పడుతున్నాడు.

**కష్టానికి తగ్గ ఫలితం కోసం:** సుదీర్ బాబు చాలా కాలంగా కష్టపడుతున్నా? సరైన ఫలితాలు రాని సంగతి తెలిసిందే. శక్తి వంచన లేకుండా శ్రమిస్తున్నా? అది వృద్దా ప్రయత్నంగానే మిగిలిపోతుంది. ప్రేక్షకుల అభిరుచి మేరకు మౌల్డ్ అవుతున్నా? ఫలితాలు మాత్రం తారు మారు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో జఠాధరపై చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. వైఫల్యాలు తనని ఎంతగా బాధిస్తున్నాయి? అన్నది ఇటీవల ఆయన మాటల్లో బయట పడింది.

జఠాధరపై మాత్రం బజ్ బాగానే ఉంది. ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో జఠాదరతో హిట్ అందుకుంటాడనే అంచనాలు బలపడుతున్నాయి. ఈ సినిమా విజయం కూడా సుధీర్ బాబుకు కీలకమైంది.

**కొత్త జానర్ తో నయా స్టార్:** అలాగే అల్లరి నరేష్ కొంత కాలంగా స్టైల్ మార్చి సినిమాలు చేస్తున్నా? ఫలితాలు ఆశించిన విధంగా రావడం లేదు. తనలో కామెడీని పక్కన బెట్టి కొత్తగా ప్రయత్నిస్తున్నా? ఫలించడం లేదు. ఈ నేపథ్యంలో 12 ఏ రైల్వే కాలనీ అనే చిత్రంతో ఈనెల 21న ప్రేక్షకుల ముందుకొస్తున్నాడు. హారర్ థ్రిల్లర్ జానర్ చిత్రమిది. ఇంత వరకూ ఈ జానర్ లో నరేష్ సినిమాలు చేయలేదు. తన స్టైల్ కి భిన్నమైన చిత్రమిది. ఈ మధ్య కాలంలో ఈ జానర్ చిత్రాలు సక్సెస్ అవుతున్న నేపథ్యంలో నరేష్ హిట్ కొడతాడు? అన్న అంచనాలు బలంగా ఉన్నాయి.

**మరో మాస్ హిట్ పడుతుందా:** అలాగే ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని స్కంద, డబుల్ ఇస్మార్ట్ తో వరుస ఫ్లాప్ ల్లో ఉన్నాడు. అతడు నటించిన ఆంధ్రా కింగ్ తాలూకా ఈనెల 28న రిలీజ్ అవుతుంది. రామ్ ఎనర్జీని మ్యాచ్ చేస్తూ తెరకెక్కించిన చిత్రమిది.

ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. మరో మాస్ హిట్ అందుకుంటాడనే అంచనాలు అభిమానుల్లో బలంగా ఉన్నాయి. ప్రచార చిత్రాలతోనూ మంచి హైప్ క్రియేట్ అయింది. ఈ నేపథ్యంలో రామ్ బౌన్స్ బ్యాక్ అవ్వడం ఖాయమంటున్నారు.

# ప్రశాంత్ వర్మ హనుమాన్ పంచాయితీ.. ప్రొడ్యూసర్ రూ.200 కోట్ల డిమాండ్




పాన్ ఇండియా సంచలనం హనుమాన్ సృష్టించిన విజయం ఇప్పుడు పెద్ద వివాదానికి దారి తీసింది. ఆ చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మ, నిర్మాత నిరంజన్ రెడ్డి (ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్) మధ్య ఆర్థిక విభేదాలు మరింత సీరియస్ గా మారాయి. ఈ గొడవ ఇప్పుడు ఫిల్మ్ ఛాంబర్ మెట్లెక్కింది. ఇరువురూ ఒకరిపై ఒకరు తీవ్రమైన ఆరోపణలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. నిర్మాత నిరంజన్ రెడ్డి ప్రత్యేకంగా ఒక కంప్లైంట్ కూడా ఫిలిం ఛాంబర్ లో చేసినట్టు తెలుస్తుంది. అతని కంప్లైంట్ ప్రకారం, ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్‌లోని తదుపరి చిత్రాలైన అధీర, జై హనుమాన్ వంటి సినిమాల కోసం తమ సంస్థ నుంచే రూ. 10.23 కోట్లకు పైగా అడ్వాన్స్ రూపంలో తీసుకున్నారని ఆరోపించారు. అయితే, ఇప్పుడు ప్రశాంత్ వర్మ ఆ మాట తప్పినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే కాకుండా, ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో ఆగిపోయిన ఆక్టోపస్ అనే మరో ప్రాజెక్టును కూడా తనచేత వేరే ప్రొడ్యూసర్ నుంచి కొనిపించారని, దానికోసం చాలా ఖర్చు పెట్టించారని నిరంజన్ రెడ్డి తెలిపారు. ఆ సినిమాకు NOC ఇప్పిస్తానని హామీ ఇచ్చి విఫలమయ్యారని అన్నారు. ఈ కారణాల వల్ల తమ సంస్థకు జరిగిన నష్టానికి, ముఖ్యంగా జై హనుమాన్ ప్రాజెక్ట్ కోసమే 100 కోట్లు, మొత్తం కలిపి వ్యాపార నష్టంగా రూ.200 కోట్లు ప్రశాంత్ వర్మ నుంచి ఇప్పించాలని ఆయన ఛాంబర్‌ను డిమాండ్ చేశారు.

**ప్రశాంత్ వర్మ క్లారిటీ...** ఈ ఆరోపణలను దర్శకుడు ప్రశాంత్ వర్మ పూర్తిగా ఖండించారు. తాను తీసుకున్నది అడ్వాన్స్ కాదని, హనుమాన్ సినిమా లాభాల్లో తనకు చట్టబద్ధంగా రావాల్సిన వాటా అని ఆయన స్పష్టం చేశారు. తనకు కేవలం రూ. 15.82 కోట్లు మాత్రమే ముట్టిందని, అది తన రెమ్యునరేషన్‌లో భాగమేనని చెబుతున్నారు. భవిష్యత్ ప్రాజెక్టులపై ఎలాంటి ఒప్పందాలు లేవని, ఆక్టోపస్ సినిమా సమస్యకు తనకు సంబంధం లేదని, ఆ వ్యవహారాన్ని నిరంజన్ రెడ్డి, ఆ సినిమా పాత నిర్మాత చూసుకోవాలని వర్మ తేల్చి చెప్పారు.

హనుమాన్ సినిమా నుంచి తనకు ఇంకా రావాల్సిన భారీ మొత్తాన్ని ఎగ్గొట్టేందుకే నిర్మాత తనపై ఈ ఆరోపణలు చేస్తున్నారని ప్రశాంత్ వర్మ తెలిపారు. మొత్తానికి ఈ రూ.200 కోట్ల వివాదం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

# ఎంగేజ్‌మెంట్ రింగ్‌పై రష్మిక ఏమన్నారంటే?

నేషనల్ క్రష్ రష్మిక ప్రధాన పాత్రలో నటించిన సినిమా ది గర్ల్‌ఫ్రెండ్. నవంబర్ 7న గర్ల్‌ఫ్రెండ్ ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఈ సినిమా ప్రమోషన్స్ లో రష్మిక చాలా యాక్టివ్ గా పాల్గొంటున్నారు.

అందులో భాగంగానే సీనియర్ హీరో జగపతి బాబు హోస్ట్ గా వ్యవహరిస్తున్న జయమ్ము నిశ్చయమ్మురా టాక్ షో కు కూడా గెస్టు గా హాజరైంది రష్మిక.

**రష్మిక ను గాలి పిల్ల అనేసిన జగపతి...** తాజాగా ఈ ఎపిసోడ్ కు సంబంధించిన ప్రోమో రిలీజవగా అందులో రష్మిక తన కెరీర్ తో పాటూ పర్సనల్ విషయాలను కూడా షేర్ చేసుకున్నట్టు తెలుస్తోంది. ఓ రకంగా నీకు ఓ నిక్ నేమ్ పెట్టాను.

గాలి పిల్ల అని జగపతి అనగానే దానికి రష్మిక అయ్యయ్యో అంటూ క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చారు. విజయ్ దేవరకొండతో ఫ్రెండ్‌షిప్, విజయ్ సేతుపతికి ఫ్యాన్, దళపతి విజయ్ కు ఆల్ టైమ్ ఫ్యాన్.. అంటే విజయం, విజయ్ ను మొత్తానికి సొంతం చేసేసుకున్నావా అని అడగ్గా, దానికి రష్మిక చాలా క్యూట్ గా నవ్వేశారు.



**వాటిని ఎంజాయ్ చేస్తున్నానంటున్న రష్మిక...** ఇక రష్మిక చేతికి పెట్టుకున్న రింగ్స్ గురించి మాట్లాడుతూ, ఆ రింగ్స్ ఏమైనా సెంటిమెంటా అని అడగ్గా, అంటే చాలా ఇంపార్టెంట్ రింగ్స్ అని రష్మిక చెప్పగా, వాటిలో ఓ రింగ్ ఫేవరెట్ అయ్యుంటుంది, దాని వెనుక ఓ హిస్టరీ కూడా ఉందని అనగా రష్మిక తెగ సిగ్గు పడ్డారు.

వెంటనే ఆడియన్స్ నుంచి కేకలు వినిపించగా, వాళ్లేదో గోల చేస్తున్నారు, వాళ్ల బాధేంటో కనుక్కో అనగానే ఐ యామ్ ఎంజాయింగ్ ఇట్ అని చెప్పిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుంది. కాగా, దసరా రోజున విజయ్ దేవరకొండతో రష్మిక ఎంగేజ్‌మెంట్ జరిగిన విషయం తెలిసిందే.

**ఆ విషయం తెలుసుకోవాలనుంది...** ది గర్ల్‌ఫ్రెండ్ ప్రమోషన్స్ లో భాగంగానే రష్మిక ఎక్స్‌లో ఫ్యాన్స్ లో ముచ్చటించి పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ప్రస్తుతం తాను పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నానని, డైరెక్ట్ తమిళ్ మూవీ చేయడానికి కాస్త టైమ్ పడుతుందని, చాలా సినిమాలు ప్రస్తుతం డిస్కషన్స్ స్టేజ్ లోనే ఉన్నాయన్నారు రష్మిక. తనకు కొంతమంది బెస్ట్ ఫ్రెండ్స్ ఉన్నారని, వారి గురించి పబ్లిక్ లో చెప్తే తనను చంపేస్తారని రష్మిక చెప్పారు. ది గర్ల్‌ఫ్రెండ్, థామా సినిమాల్లో ఏ సినిమా చేయడం కష్టంగా అనిపించిందంటే గర్ల్‌ఫ్రెండ్ సినిమా పేరే చెప్పారు రష్మిక. సూపర్ స్టార్ మహేష్ బాబు గురించి మాట్లాడుతూ, ఆయనకు ఎప్పటికీ వయసు అయిపోవడం లేదని, రోజురోజుకీ వయసు తగ్గుతుందని, అదెలా సాధ్యమో తెలుసుకోవాలనుకుంటున్నట్టు రష్మిక చెప్పుకొచ్చారు.

# హౌస్ లో బ్యాడ్ చేశారు.. ట్రోలర్స్ కి గట్టిగా ఇచ్చి పడేసిన .. చిట్టి పికిల్స్ రమ్య..!

బిగ్ బాస్ సీజన్ 9లో వైల్డ్ కార్డ్ ఎంట్రీగా ఇచ్చింది చిట్టి పికిల్స్ రమ్య మోక్ష. సోషల్ మీడియాలో కాంట్రవర్షియల్ అయిన ఈ అమ్మడు బిగ్ బాస్ కి వెళ్తుంది అనగానే ఆడియన్స్ అంతా షాక్ అయ్యారు. హౌస్ లో ఎలా ఉంటుంది.. ఎలా కనిపిస్తుంది అన్న ఆసక్తి ఏర్పడింది. ఐతే హౌస్ లోకి వెళ్లిన రమ్య మోక్ష కొందరిని టార్గెట్ చేసుకుని వెళ్లినట్టుగా అయ్యింది. తనూజతో క్లోజ్ గా ఉంటున్న కళ్యాణ్ ని అమ్మాయిల పిచ్చోడని అనడంతో పాటుగా రీతు, కళ్యాణ్ ల క్లోజ్ నెస్ మీద కామెంట్స్ చేయడం లాంటివి ఆమెను బ్యాడ్ చేశాయి.

**తనూజ మీద రమ్య నామినేషన్స్..** అంతేకాదు హౌస్ లో స్ట్రాంగ్ కంటెస్టెంట్ అయిన తనూజ మీద రమ్య నామినేషన్స్ లో ఫేక్ పిల్ల, బాండింగ్ కోసమే వచ్చింది అనడం ఆమెకు బ్యాడ్ అయ్యింది. ఐతే రమ్య మోక్ష హౌస్ నుంచి బయటకు వచ్చాక తన బిగ్ బాస్ ఎక్స్ పీరియన్స్ గురించి ఒక స్పెషల్ ఇంటర్వ్యూలో చెప్పింది. తన గురించి హౌస్ లో బ్యాడ్ గా చూపించారని అంటుంది అమ్మడు. అక్కడ చాలా విషయాలు జరిగాయి కానీ కేవలం బ్యాడ్ చేద్దామనే హౌస్ లోకి పిలిచినట్టు ఉన్నారు. అందుకే కేవలం బ్యాడ్ థింగ్స్ మాత్రమే చూపించారని అన్నది రమ్య. అంతేకాదు తను ఒరిజినల్ గానే ఉ



న్నానని.. నీళ్లు పడక ఇబ్బంది పడ్డానని.. హెల్త్ కూడా చాలా ఇబ్బంది పెట్టిందని అన్నది రమ్య. తనకు హౌస్ లో ఫీవర్ వచ్చింది..హెల్త్ ప్రాబ్లెం ఉండటం వల్ల గవదలు లావయ్యాయి. అందుకే కొన్ని చోట్ల ఫేస్ రౌండ్ గా కనిపించిందని అన్నది రమ్య. ఐతే హౌస్ లో తాను ఉన్నప్పుడు తన గురించి విపరీతమైన ట్రోల్స్ చేసారు. తన లుక్ గురించి రకరకాలుగా కామెంట్ చేశారు.

**ఈ ట్రోల్స్ నాకు కొత్త కాదు..** నాకు ఈ ట్రోల్స్ అనేవి కొత్త కాదు.. మీరేమనుకున్నా నాకు ఏమి కాదు. నన్ను ఎంకరేజ్ చేస్తూ చేసిన కామెంట్స్ కూడా ఉన్నాయి. ఇక బిగ్ బాస్ కి వెళ్లొచ్చినందుకు మంచి పారితోషికం ఇచ్చారు. సినిమా ఆఫర్లు కూడా వస్తున్నాయి. నా లైఫ్ అంతా బాగుంది కానీ మీరు మాత్రమే ఇంకా ట్రోల్స్ చేస్తూ అలానే ఉండిపోతున్నారని అన్నది రమ్య మోక్ష.

తనకు స్నాప్ చాట్ వాడటం తెలియదని.. తను ఎలా ఉన్నానో అలానే వీడియోస్ పెడతానని.. హౌస్ లో వేరేలా కనిపించా అంటే అక్కడ పరిస్థితులు అలా ఉన్నాయని అన్నది రమ్య. హౌస్ లో విప్పుకుని తిరగలేం.. బయట ఇష్టం వచ్చినట్టు చేయొచ్చు.. అక్కడ కొన్ని కండీషన్స్ ఉంటాయని తన బిగ్ బాస్ ఎక్స్ పీరియన్స్ చెప్పి మరోసారి ట్రోలర్స్ కి తాను భయపడేది లేదని చెప్పింది చిట్టి పికిల్స్ రమ్య.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536